05-06Pg1fB.qxd:05-06Pg1fB.qxd 01/01/01 9:24 AM Page 1




తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు




epaper.vaartha.com WWW.VAARTHA.COM
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-6-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 124 పేజీలు: 12 వెల: 6.50






5-6pg2exHMNWJQE.qxd:5-6pg2exHMNWJQE.qxd 01/01/01 10:18 AM Page 1





డిప్యూటీ సీఎం పవన్‌కు బుధవారం యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని అందిస్తున్న మంత్రి నారా లోకేష్

# పవన్‌కు లోకేష్ 'యువగళం'

## పాదయాత్రపై రూపొందించిన పుస్తకం బహూకరణ

**విజయవాడ,జూన్4,ప్రభాతవార్తప్రతినిధి:** యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు అందజేశారు. మంత్రివర్గ సమావేశం సందర్భంగా అమరావతి సచివాలయంలో పుస్తక ప్రతిని పవన్‌కు అందజేశారు. నాటి రాక్షస పాలనపై ప్రజలను చైతన్యవంతం చేయడంలో యువగళం పాదయాత్ర సఫలీకృతమైందని పవన్ కల్యాణ్ అన్నారు. ఆనాటి అనుభవాలను కళ్లకి కట్టినట్లుగా పుస్తక రూపంలో తేవడంపై లోకేశ్‌ను పవన్ కల్యాణ్ ప్రశంసించారు. ఈ రోజుకి అరాచక పాలన అంతమై ఏడాది పూర్తయిందని, గత ప్రభుత్వ పాలన పీడకలను ఇప్పటికీ జనం మర్చిపోలేదని చెప్పారు. యువగళం పాదయాత్ర నాటి అనుభవాలను పవన్ కల్యాణ్‌తో లోకేశ్ పంచుకున్నారు. పవన్ కల్యాణ్‌తో పాటు సహచర మంత్రులందరికీ లోకేశ్ పుస్తకాలు అందజేశారు. ఈ పుస్తకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా 3 వేల 132 కిలోమీటర్ల మేర నారా లోకేశ్ పాదయాత్ర చేశారు. చరిత్రాత్మకంగా సాగిన యువగళం విధానాన్ని వివరిస్తూ ప్రచురించిన కాఫీ టేబుల్ బుక్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఆవిష్కరించారు.

# నియంతలు కొట్టుకుపోయిన రోజు జూన్-4

>> లు, కమలనాథుల మద్దతుతో రాష్ట్రం గెలిచిన రోజు అని అన్నారు. సరిగ్గా సంవత్సరం క్రితం ఇదే రోజున విధ్వంసపాలనపై ప్రజలు గెలిచారని, నాటి ప్రజా తీర్పుతో ఉన్మాద పాలన కొట్టుకుపోయిందని వ్యాఖ్యానించారు. వచ్చే నాలుగేళ్లలో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. వచ్చే 4 ఏళ్లలో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని మాట ఇస్తున్నాము. విధ్వంస పాలకులపై రాజీలేని పోరాటంతో కూటమి విజయానికి నాంది పలికిన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కార్యకర్తలకు, నాయకులకు అభినందనలు, ధన్యవాదాలు. ఈ రోజు మంత్రి మండలి సమావేశంలో ముఖ్యమంత్రిని మంత్రులంతా అభినందించారు.ప్రజాస్వామ్యం గెలిచిన రోజు అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అరాచక, కక్షపూరిత పాలనపై ప్రజా ఆకాంక్షలు ఘన విజయం సాధించాయని అభిప్రాయపడ్డారు. చంద్రబాబు పాలనానుభవం, పవనన్న ఆశయానికి మోదీ ఆశీస్సులు పుష్కలంగా లభించడంతో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం ప్రారంభమైందని లోకేశ్ పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఆశీర్వదించిన ఐదు కోట్ల ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. సంక్షేమాన్ని అందిస్తూ అభివృద్ధి పట్టాలెక్కించామని పేర్కొన్నారు. రాష్ట్ర దశ దిశను మార్చేందుకు ప్రజలిచ్చిన తీర్పుకు ఇవాళ్టితో ఏడాది పూర్తి అయిందన్న సీఎం నాటి విజయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రజలకు శిరసు వంచి నమస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

# బెంగళూరు స్టేడియంలో తొక్కిసలాట

>> వేసింది. దారిపొడవునా అభిమానులు గోడలు, చెట్లు ఎక్కి కోలాహలంగా కనిపించారు. ఒకదశలో రెండోనెంబరు గేటునుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు దూసుకువచ్చారు. లాఠీఛార్జిచేయడంతో ఒక్కసారిగా పరిస్థితి అదుపుతప్పి ఒకరినొకరు తోసుకుంటూ పరుగులు తీసారు. ఈ క్రమంలోనే 11 మంది మృతిచెందారు. 50మందికిపైగా గాయపడ్డారు. వారిని సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. విషమంగా ఉన్న ముగ్గురిని బౌరింగ్ ఆసుపత్రికి తరలించారు. వీరు అక్కడ చనిపోయారని ప్రకటించారు. వైదేహి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో మరో నలుగురు చనిపోయారు. కబ్బన్‌పార్క్‌వద్ద ఉన్న గేటునుంచి తోసుకురావడంవల్లనే తొక్కిసలాటజరిగి ఈ ఘోరానికి దారితీసిందని పోలీసులు అంచనావేసారు. గాయపడిన కొందరికి ఆర్సీబీ అభిమానులే సిపిఆర్‌చేసారు. స్టేడియం చుట్టూ కూడాట్రాఫిక్ సమస్య రావడంతో ఎక్కడికక్కడ జామ్ అయిపోయింది. దీనితో గాయపడిన వారిని తరలించడం కూడా పోలీసులకు కష్టమయింది. మృతుల కుటుంబీకులు బౌరింగ్ ఆసుపత్రి ఆవరణలో రోదించడం కనిపించింది. విధాన సౌధ వద్ద కొందరు స్పృహతప్పిపడిపోగా మరి కొందరు స్టేడియంగోడదూకి లోనికి వచ్చేందుకు ప్రయత్నించి తీవ్రగాయాలపాలయ్యారు. బాధితు లందరినీ బౌరింగ్‌ఆసుపత్రి, వైదేహిమల్టీస్పెషాలిటీ ఆసుపత్రుసమీపంలోని మరికొన్ని క్లినిక్‌లకు తరలించారు.

**అభిమానులు తోసుకురావడంవల్లే దుర్ఘటన: సీఎం సిద్ధరామయ్య:** విజయోత్సవ వేడుకల్లో తమ ఐపిఎల్ టీమ్‌ను చూసేందుకు వచ్చిన అభిమానులు చిన్నగేటునుంచి స్టేడియం లోపలికి తోసుకురావడంవల్లనే ఈ దుర్ఘటన జరిగిందని సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. చిన్నస్వామి స్టేడియంలో రెండునుంచి మూడు లక్షలమంది అభిమానులు వచ్చారని, ఇంతమంది వస్తారని ఎవ్వరూ ఊహించలేదన్నారు. ఈ స్టేడియం కెపాసిటీ కేవలం 35 వేలకు మించి లేదని ముఖ్యమంత్రి తెలిపారు. స్టేడియంకు చిన్నగేటే ఉందని, వారంతా గేటును బద్దలుకొట్టి లోపలికి రావడంతో తొక్కిసలాట జరిగి ఈ గోరం జరిగిపోయిందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలచొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. మృతుల్లో ఎక్కువమంది యువకులే ఉండటం పట్ల విచారం వ్యక్తంచేసారు. ఈ ఘటనపై న్యాయవిచారణకు ఆదేశిస్తున్నామనిముఖ్యమంత్రిప్రకటించారు.

**ప్రధానిమోడీ సంతాపం:** ఐపిఎల్ విజయోత్సవాలు, అభినందన సభలో జరిగిన ఘోరంపై ప్రధాని నరేంద్రమోడీ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆనందోత్సాహాలవేళ అనుకోని దుర్ఘటన ఎంతో బాధించిందని మృతుల కుటుంబాలకు మోడీ తన సానుభూతిని ప్రకటించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి కూడా ఈ విషాదంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసి మృతుల కుటుంబాలకు ప్రగాఢసంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని పేర్కొంటూ కర్ణాటక ప్రభుత్వ అధికారులను ఈప్రమాదం వివరాలను ఆరాతీసారు.

**ఎయిర్‌పోర్టులో ఆర్సీబీ టీమ్‌కు ఘనస్వాగతం:** అంతకుముందు ప్రత్యేక విమానంలో ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్‌కు డిప్యూటి సీఎం డికెశివకుమార్ స్వయంగా వెళ్లి స్వాగతం పలికారు. కోహ్లీ, కృనాల్‌పాండ్యా, టిమ్‌డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు పుష్పగుచ్ఛం ఇచ్చి వెలకమ్ చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సుల్లో విధాన సౌధకు చేరుకుంది. అక్కడినుంచి చిన్నస్వామి స్టేడియంకు భారీ ఎత్తున బందోబస్తుతో చేరుకున్న టీమ్‌ను చూసేందుకు ఫ్యాన్స్ ఎగబడటంతో భారీ విషాదం చోటుచేసుకుంది. దీనితో అభినందన సభను కొంతసేపు నిలిపివేసారు.

**బిసిసిఐ రియాక్షన్:** బెంగళూరు చిన్నస్వామి స్టేడియం విషాదంపై బిసిసిఐ స్పందించింది. ఆర్సీబి విజయోత్సవానికి మరింత మెరుగైన రీతిలో ఏర్పాట్లుచేయాలి ఉందని అభిప్రాయం వ్యక్తంచేసింది. క్రికెటర్లను చూసేందుకు అభిమానులు పోటీపడతారనే విషయం అందరికీ తెలుసునని విజయోత్సవం నిర్వాహకులు ముందుజాగ్రత్తచర్యలు అభిమానుల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేయాల్సిందని బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు ఏర్పాట్లలో లోపాలున్నట్లుకనిపిస్తోందన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన బిసిసిఐక్షతగాత్రులుసత్వరమే కోలుకోవాలని ఆకాంక్షను వ్యక్తంచేసారు.

## ఆర్సీబీ అభిమానులకు క్షమాపణలు చెప్పిన డికె

**బెంగళూరు, జూన్ 4 :** ఆర్సీబీ విజయోత్సవాల్లో జరిగిన అత్యంత విషాదకర ఘటనపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ తొక్కిసలాట ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్సీబీ అభిమానులకు, నగరప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఇంతటి ఘోరవిపత్తు జరుగుతుందని ఊహించలేదని, స్టేడియం సామర్థ్యంకంటే ఐదురెట్లు ఎక్కువమంది అభిమానులు రావడం, తమ అభిమాన క్రికెటర్లనుచూసేందుకు తోసుకురావడంతో పరిస్థితి అదుపు తప్పి ఈ దుర్ఘటన జరిగిందని అన్నారు. నగర పోలీస్ కమిషనర్‌తో తాను స్వయంగా మాట్లాడానన్నారు. ఈ తొక్కిసలాటలో ఎంత మంది చనిపోయారో ఇప్పుడే చెప్పలేం. ప్రజలు కాస్త సంయమనంతో ఉండాలి. ఆర్సీబీ విజయోత్సవ కార్యక్రమాన్ని 10నిమిషాల్లోనే ముగించాం. అయితే లక్షలాది మంది క్రికెట్ అభిమానులు వచ్చారు. పరిస్థితిని సాధారణ స్థితికి తెచ్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

# పి-4 కార్యాలయాలు

>> భూకేటా యింపులు, రాయితీల కల్పనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏడాదిలో 25 మంత్రివర్గ సమావేశాలు జరిపినందుకు సీఎంకు కేబినెట్ అభినందనలు తెలిపింది.

**ప్రతీ జీవోను జాగ్రత్తగా గమనించాలి:** తుని రైలు ప్రమాదం కేసు అంశం మంత్రివర్గంలో ప్రస్తా వనకు వచ్చింది. ప్రతీ జీవోను జాగ్రత్తగా గమనిం చాలని సీఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పొరపాటు జరిగాక సరిదిద్దుకోవటం కంటే ముందే జాగ్రత్త పడాలని సూచించారు. ఈ తరహా పరిణామాలు మళ్లీ పునరావృతం కాకూడ దని స్పష్టంచేశారు. జరిగిన పొరపాటుకు హోం శాఖ కార్యదర్శి సీఎంకు క్షమాపణలు చెప్పారు.

**కేంద్రం నుంచి సానుకూల స్పందన:** పోలవరం బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తోందని మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టుకు నిధుల సమీకరణ కూడా జరుగుతోందని చెప్పారు. అమరావతిలో చేపట్టే క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ భవనాల డిజైన్లు చూడాలని పవన్ కల్యాణ్‌ను సీఎం కోరారు. తిరుపతిలో సినీతారలతో యోగా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల 15వ తేదీని ఇందుకు పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. పీ4 సక్రమ అమలుకు ప్రతీ నియోజకవర్గంలో ఒక కార్యాలయం ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పీ4 విధానం ప్రజల్లోకి మరింతగా వెళ్లేలా చర్యలు ఉండాలని సీఎం సూచించారు. ఈ నెల 12వ తేదీలోగా ప్రతీ జిల్లా కేంద్రంలో ఒక పీ4 కార్యాలయం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ పైనా ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. 8 గంటల్లో చేసే పనిని క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ ద్వారా 12 నిమిషాల్లోనే పూర్తి చేయవచ్చని సీఎం వ్యాఖ్యానించారు. క్వాంటమ్ వ్యాలీ అందుబాటులోకి వస్తే పనివేగం పెరిగి సమయం కలిసి వస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయాలు నడుస్తున్నాయని మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు నేరస్థులను రాజకీయ నాయకులు కలవాలంటేనే భయపడేవారన్న చంద్రబాబు, ఇప్పుడు నేరస్థులను అడ్డం పెట్టుకునే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నేరస్థులకు తాము అండగా ఉన్నామని ప్రజలకు సందేశమిస్తూ రాజకీయాల్ని ఎటు తీసుకుపోతున్నారో అర్థం కావట్లేదని దుయ్యబట్టారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రులతో పలు విషయాలు చర్చించిన సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వ ఏడాది పరిపాలన అంతా బాగుందన్నారు. మంత్రులు మరింత సమర్థంగా పని చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే మన అజెండా కావాలని పిలుపునిచ్చారు. మరింత దూకుడు పెంచి ప్రజల్లో మమేకం కావాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో తప్పులు చేసిన పెద్దలు ఇంకా బయటే తిరగటం సబబు కాదని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. ఏ తప్పు చేయకుండానే తెలుగుదేశం నాయకుల్ని జైలుకు పంపారని మంత్రి సంధ్యారాణి అన్నారు. తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరన్న చంద్రబాబు, వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో మనల్ని అన్యాయంగా వేధించారని, మనము వేధించడం సరికాదన్నారు. గత ప్రభుత్వ అవినీతి అక్రమాలపై పారదర్శక విచారణ జరుగుతోందన్నారు. నేరం రుజువయ్యాక ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చంద్రబాబు తేల్చి చెప్పారు. అమరావతి నిర్మాణం, రెండో దశకు అవసరమైన 44 వేల ఎకరాల భూసేకరణ అంశంపై చర్చ జరగనుంది. అమరావతిలో నిర్మించే జీఏడీ టవర్ టెండర్లకు, హెచ్ఓడీ భవనాల 4 టవర్లకు, అమరావతిలో 5 వేల ఎకరాల్లో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలపనుంది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రత్యేక చర్చ. జూన్ 21న వైజాగ్ జరిగే అంతర్జాతీయ యోగా డే పైనా చర్చించనున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయ్యే సమయానికి 25 కాగిత రహిత ఇ క్యాబినెట్లను నిర్వహించిన దార్శనిక ముఖ్యమంత్రికి మంత్రి వర్గం అభినందనలు తెల్పింది. ఈ 25వ మంత్రి వర్గ సమావేశంలో రాష్ట్ర ప్రగతి దిశానిర్దేశం చేసేటటు వంటి ఎన్నో కీలక మరియు సాహసోపేత నిర్ణయాలను తీసుకున్న ముఖ్యమంత్రి, వారి దార్శనికతను మంత్రి వర్గం అభినందించింది. అదే విధంగా ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి, రాష్ట్ర ఐటి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ కి మంత్రి మండలి అభినందనలు తెలిపింది. ఎన్టీఆర్ సుజల పథకం కింద శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతం మరియు ఆదివాసీ ప్రాంతాలకు ఆఫ్ షోర్ ప్లాంట్ ద్వారా సురక్షితమైన తాగునీటి సరఫరా కోసం రూ.575.75 లక్షల వన్ టైమ్ సెటిల్మెంట్ మరియు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని 4 మండలాల్లో 533 నీటి కొరత ఉన్న జనావాసాల్లో కడలీ కోసం క్లస్టర్ ఆధారిత విధానంలో 15 వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లకు రూ.822.86 లక్షల వన్ టైమ్ సెటిల్మెంటుకు పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. ఈ నిర్ణయం వల్ల శ్రీకాకుళం జిల్లాలోని పలాస, వజ్రపుకొత్తూరు, కవిటి, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, మందస తదితర ఏడు మండలాల్లో సీతంపేట మండలంలోని ఆదివాసీ ప్రాంతాలతో సహా 341 జనావాసాల్లోని 2.42 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందుతుంది. అలాగే చిత్తూరు జిల్లా కుప్పం, గుడిపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లోని 533 జనావాసాల్లోని 2.85 లక్షల మంది ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు.

# 'కల్తీ' నెయ్యి కేసులో 'మాజీ'లకు నోటీసులు!


>> అధికారులు రెండురోజులుగా అలిపిరిలోని సిట్ కార్యాలయంలో లోతుగా విచారణ సాగిస్తున్నారు. అప్పన్న గత ఐదేళ్లలో ఢిల్లీ స్థాయిలో వ్యవహారాలను చక్కబెట్టడం, వైవి లావాదేవీలు,ఆర్థికపరమైన అంశాల్లో కీలకంగా వ్యవహరిచాడనేది సిట్ నిగ్గుతేల్చింది. ఆయన తనకు టిటిడి వ్యవహారాల్లో సంబంధంలేదని, గతంలో 2019 నుండి 2023వరకు బోర్డు ఛైర్మన్‌గా వైవి సుబ్బారెడ్డి పాలన సాగించినా నిర్ణయాలు తనకు తెలియదని సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. అయితే పెద్దమొత్తంలో ఆర్థికలావాదేవీలపై సిట్ ఆరా తీసి కొన్ని సమాధానాలు రాబట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఏడుకొండల వెంకన్న సేవకులుగా ఉంటూ కల్తీనెయ్యి కొనుగోలుచేసిన వ్యవహారంలో ప్రస్తుతం మాజీలుగా ఉన్న టిటిడిలో పనిచేసిన కీలక నేతలు, అధికారులకు నోటీసులు జారీచేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. ఆ కోవలో టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి,మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డి, 2023-24 కాలంలో మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని కూడా త్వరలోనే సిట్ అధికారులు విచారణకు పిలిచే సూచనలు లేకపోలేదనేది తెలుస్తోంది. మేనెల 15వతేదీకే ఛార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంది. దర్యాప్తు పూర్తికాకపోవడంతో గడువును మరో రెండునెలలు పొడిగించారు.

**-ఐదేళ్ళలో నెయ్యిసరఫరాలో లోపాలే !:** తిరుమలకు స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేసేందుకు టెండర్లు దక్కించుకున్న డైరీలు,కాంట్రాక్టర్‌లు కమీషన్లకు కక్కుర్తిపడి కల్తీనెయ్యి పంపిన కేసులో ఇప్పుడు కీలక మలుపుతిరుగుతోంది. ఇప్పటికే కల్తీనెయ్యి సరఫరాకు సంబంధించి పక్కా ఆధారాలు,రికార్డులు సేకరించిన సిబిఐ సిట్ బృందంలోని సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు, డిఐజి మురలీరాంభా నేతృత్వంలోని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డిఎస్పీలు, సిఐలు నలుగురు అసలు సూత్రధారులను పట్టుకునే దిశగా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రధాన నిందితులను విచారణ చేసిన సిట్ బృందం టిటిడికి నెయ్యి సరఫరా చేయడానికి టెండర్లలో పాల్గొనడం, నిబంధనలకు విరుద్ధంగా నెయ్యిని సరఫరాచేయడం, ఆఖరు రెండేళ్ళలో నాణ్యతలేని కల్తీనెయ్యి సరఫరా చేశారని తేల్చారు. ఇందుకు గత పాలకమండలిలో ఇద్దరు పెద్దల పేర్లు నిందితులు వెల్లడించడంతో ఆ ఇద్దరిపై సిబిఐ సిట్ ఇప్పుడు ఫోకస్ చేయడం సంచలనంగా మారింది. 2019-23 మధ్యకాలంలో లడ్డూల తయారీకి నెయ్యిసరఫరా చేసేందుకు టెండర్లు పిలవడం, టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లు, డైరీలకు కాదని తమిళనాడు, ఉత్తరాఖండ్‌లోని డైరీలకు అనుమతినివ్వడం కూడా ఆ ఇద్దరి కీలక వ్యక్తుల విచారణతోనే మొత్తం కల్తీ వ్యవహారం మారనుంది. ఇప్పటికే గత ఐదేళ్ళలో జరిగిన నెయ్యిసరఫరా లావాదేవీలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఫోన్ సంభాషణల కాల్‌డేటాను సిట్ అధికారులు సేకరించారు. ఈ కేసులో ఇప్పటికే విచారణ కీలకదశకు చేరుకోవడంతో రానున్న రోజుల్లో ఎవరిని సిట్ అరెస్టుచేయనుందనేది అటు గత పాలకమండలి పెద్దలకు, పూర్వ టిటిడి అధికారులకు వణుకుపుట్టిస్తోంది. ఏదిఏమైనా పదిరోజుల్లో అసలు సూత్రధారులతోబాటు టిటిడిలో మార్కెటింగ్, కొనుగళ్ళు, పోటు విభాగం, విజిలెన్స్‌లో కొందరు పాత్రధారులైన వాళ్ళూ నిందితులు కావచ్చనేది ఇప్పుడు హాట్‌టాఫిక్‌గా మారింది.

# ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మనీష్ సిసోడియా, సత్యేందర్‌జైన్‌లకు ఎసిబి సమన్లు!

## తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఆరోపణలు..

**న్యూఢిల్లీ, జూన్ 4:** ఢిల్లీలోని పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మనీశ్‌సిసోడియా, సత్యేందర్ జైన్‌లపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ కేసులో అవినీతి నిరోధక శాఖ వీరికి సమన్లు జారీ చేసింది. ఈ నెల 6న సత్యేందర్, 9న సిసోడియా ఢిల్లీలోని బ్యూరో కార్యాలయానికి రావాలని అందులో పేర్కొంది. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం ఆప్ ప్రభుత్వ హయాంలో సిసోడియా విద్యాశాఖమంత్రిగా, సత్యేందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ మంత్రిగా ఉన్నారు. వారి నేతృత్వంలో ఢిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం తలపెట్టారు. ఈ నిర్మాణంలో రూ.వేల కోట్ల అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. 34 మందికి దీని కాంట్రాక్టులు దక్కగా వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. తరగతి గదులను 30 సంవత్సరాలు ఉండేలా కడితే వాటికి అయిన ఖర్చు మాత్రం చాలా ఎక్కువగా ఉంది. గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో వ్యయం దాదాపు అయిదు రెట్లు పెరిగిపోయింది. ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన నివేదికలో తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పేర్కొంది. కొత్త టెండర్లు తీసుకోకపోవడంతో, ఈ ప్రాజెక్టు వ్యయం రూ.326 కోట్లు పెరిగిందని రిపోర్టులో తెలిపింది. సిసోడియా, జైన్‌లను విచారించేందుకు మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో ఏప్రిల్‌లో వీరిపై కేసు నమోదైంది.



# జులై 21 నుంచి వర్షాకాల పార్లమెంటు

## ఆగస్టు 12 దాకా సమావేశాలు

**న్యూఢిల్లీ, జూన్ 4:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 21వ తేదీనుంచి ఆగస్టు 12వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. ఆర్థికవ్యవహారాల కేబినెట్ కమిటీ రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన సమావేశమయి తేదీలను సిఫారసుచేసిందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సిఫారసులను రాష్ట్రపతికి పంపిస్తామని, సమావేశాల నిర్వహణకు రాష్ట్రపతి ఆమోదం అవసరమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి తెలిపారు. ఇప్పటికే దేశంలోని 16 ప్రతిపక్షాలు ఆపరేషన్ సిందూర్, పహల్గాంవ్ దాడిలపై చర్చించేందుకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అలాగే ప్రధాని మోడీకి సైతం లేఖరాసాయి. ఈ డిమాండ్‌పై మంత్రి స్పందిస్తూ ప్రతి సమావేశం మాకు ప్రత్యేక సమావేశమేనని నిబంధనలను అనుసరించి అన్న ముఖ్యమైన అంశాలను చర్చిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేసారు. ఉభయ సభల బిజినెస్ అడ్వయిజరీ కమిటీలు ఈ సమావేశాలకు సంబంధించి అజెండా, చర్చలు కీలక అంశాలను నిర్ణయించేందుకు సమావేశం అవుతుందని కిరెన్ రిజిజు చెప్పారు. ఆపరేషన్ సిందూర్,పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంట్‌ను ప్రత్యేక సమావేశ పరచాలని 16 విపక్షాలు డిమాండ్ చేసాయి. నిబంధనల ప్రకారమే చర్చిస్తామని ఎన్డీయే కూటమి బదులిచ్చింది. నిజానికి బడ్జెట్ సమావేశాలతర్వాత మళ్లీ వర్షాకాల సమావేశాలు జరుగుతున్నాయి. బడ్జెట్ సమా వేశాలు ఈ యేడాది జనవరి 31న ప్రారంభమై ఏప్రిల్ నాలుగో తేదీ ముగిసిన సంగతి తెలిసిందే.

# నేడు ఎపి ఎడ్‌సెట్ పరీక్ష

>> మధ్యాహ్నం 2నుంచి 4గంటల మధ్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.అభ్యర్థులు తమకు కేటాయించిన సెంటర్ మధ్యాహ్నం 12.30నుంచి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, ఒక నిమిషం నిబంధన అమల్లో ఉంటుందని వివరించారు. హాల్ టిక్కెట్‌తోపాటు,ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు,ఓటర్ ఐడెంటికార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఏదైనా ప్రభుత్వ గుర్తింపుకార్డు,బ్లూ లేదా బ్లాక్ పెన్ తమవెంట కలిగి ఉండాలన్నారు.ఏపి ఎడ్‌సెట్‌ను అత్యంత సమర్థవంతంగా నిర్వహించడానికి పలు విశ్వవిద్యాలయాలకు చెందిన సీనియర్ అధ్యాపకులను కో-ఆర్డినేట ర్లుగా నియమించినట్లు తెలిపారు.

# రాష్ట్రంలో 300 మె.వా సౌర విద్యుత్ ప్లాంట్లు

>> సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ధేశించింది. ఐదు అల్ట్రా మెగా సౌర విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 12,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతించింది.పునరుత్పాదక రంగంలో నైపుణ్య శిక్షణకు ఆస్ట్రేలియా సహకారం. ఈ క్రమంలోపునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఆస్ట్రేలియా సంసిద్ధత వ్యక్తం తెలిపింది. ఆ దేశానికి చెందిన కానుస్సల్ జనరల్ సిల్లైజకి,డిప్యూటీ జనరల్ డేవిడ్ ఈగిల్సన్‌లు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిశారు. పునరుత్పాదక ఇంధన రంగంలో నైపుణ్యాభివృద్ధికి ఉన్న అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయి అని మంత్రి వివరించారు. మహిళలు,గిరిజన ప్రాంత యువతకు ఉమ్మడి కార్యాచరణతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తామని కాన్సుల్ జనరల్ తెలిపారు.

# తప్పుడు ఇంజెక్షన్ ఇవ్వడంతో ప్రభుత్వాసుపత్రిలో ఆరుగురు రోగులు మృతి

## ఒడిశాలో విషాదం

**భువనేశ్వర్, జూన్ 4:** వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఆరు నిండు ప్రాణాలను బలితీసుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు నర్సు తప్పుడు ఇంజక్షన్ ఇవ్వడంతో వారు ప్రాణాలు కోల్పోయారు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా కేంద్రంలో గల సాహిద్ లక్ష్మణ్ నాయక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రిలో ఐసియు, సర్జికల్ వార్డుల్లో చికిత్స పొందుతున్న ఐదుగురు రోగులు నిన్న రాత్రి వేళ గంటల వ్యవధిలో ప్రాణాలు కోల్పోయారు. వీరు మరణించడానికి కొన్ని నిమిషాల ముందు ఆసుపత్రి సిబ్బంది వీరికి రెండో రౌండ్ ఇంజెక్షన్లు వేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. 'అర్ధరాత్రి సమయంలో ఓ నర్సు వచ్చి మా పక్కన ఉన్న ముగ్గురు రోగులకు ఇంజెక్షన్ ఇచ్చారు. మా సోదరికి కూడా అలాంటి సూది మందు వేశారు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే ఆమె నొప్పితో విలవిల్లాడిపోయింది. డాక్టర్ వచ్చి చెక్ చేసేలోపే ప్రాణాలు కోల్పోయింది' అని ఓ మృతురాలి కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆందోళన కొనసాగుతుండగానే ఐసియులో చికిత్స పొందుతున్న మరో రోగికి ఇంజెక్షన్ ఇచ్చారు. కాసేపటికే ఆ రోగి కూడా ప్రాణాలు కోల్పోవడంతో మృతుల సంఖ్య 6కు చేరింది. చనిపోయిన రోగులంతా ఈ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారని, సర్జరీ తర్వాత వారి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని మృతుల కుటుంబసభ్యులు తెలిపారు. ఎప్పుడయితే ఇంజెక్షన్ డోసు ఇచ్చారో ఆ తర్వాతే వారి ఆరోగ్యం ఉన్నట్లుండి క్షీణించిందని పేర్కొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆసుపత్రి సిబ్బందిపై వారు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోస్టుమార్టం తర్వాతే మృతికి గల కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. ఘటనపై ఆసుపత్రి యాజమాన్యం ఇంకా స్పందించలేదు. మరోవైపు, కాంగ్రెస్‌నేతలు వైద్య కళాశాల వద్ద ధర్నాకు దిగారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై దర్యాప్తు జరిపిస్తామని కోరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ విలేకరులకు తెలిపారు. అవసరమయితే రాష్ట్ర ప్రభుత్వం సహాయం కోరుతామన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 05-06-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
దశమి రా.2.17
హస్త పూర్తి
వర్జ్యం మ.1.02-2.50
దు. ఉ.9.56-10.48, 2) మ.3.10-సా.4.02
శుభసమయం:ఉ.7.45-8.15, 2)సా.4.45-5.25
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ఇతరుల విషయాలలో జోక్యంతగదు. ముఖ్యమైన విషయాలలో మాత్రం పరీక్షాకాలంగావుంటుంది.

**వృషభం :** ఆర్థిక పరిస్థితి సంతృప్తి కరంగా వుంటుంది. రుణ వత్తిడులు తొలుగు తాయి. వస్తులాభం.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి కొంతవరకు మెరుగుపడుతుంది. సంతానం సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. అకారణంగా వివాదాలు ఏర్పడవచ్చు.

**సింహం:** పనులు సకాలంలో పూర్తిచేస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కన్య :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ఆటు పోట్లు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**వృశ్చికం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. శ్రమానంతరం పనులు పూర్తి కాగలవు.

**ధనుస్సు:** అనుకోని అతిథుల నుండి ఆహ్వానాలు అందుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**మకరం:** సంఘంలో గౌరవం లభిస్తుంది. కొత్త విద్యలపై ఆసక్తి చూపుతారు. వాహన సౌఖ్యం.

**కుంభం:** జీవితభాగస్వామి నుండి ఆస్తి లాభం పొందుతారు. వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు..

**మీనం :** శ్రమకు తగిన ఫలితం దక్కదు. ఆరోగ్య, వాహనాల విషయాలలో నిర్లక్ష్యం తగదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కొల, హైదరాబాద్

# ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధులసభ చీఫ్‌గా జర్మనీ అనలీనా బేర్‌బాక్

**న్యూయార్క్, జూన్ 4 :** ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధుల సభకు నూతన అధ్యక్షురాలిగా జర్మనీ విదేశాంగ శాఖ మాజీ మంత్రి అనలీనా బేర్‌బాక్ ఎన్నిక అయ్యారు. రష్యా డిమాండ్ చేసినట్లుగా రహస్య బ్యాలెట్ ద్వారానే సభ్య దేశాలు ఓటింగ్‌లో పాల్గొన్నాయి. అయితే మొత్తం ఇద్దరు అభ్యర్థులు ఈ పదవి కోసం పోటీ చేయగా భారీ మెజార్టీతో అనలీనా బేర్‌బాక్ గెలిచారు. జర్మన్ దౌత్యవేత్త హెల్గా ష్మిడ్ ఘోర పరాజయం పాలయ్యారు. ఈ ఎన్నికకు మెజార్టీ మార్కు 88 ఓట్లు మాత్రమే కాగా అనలీనా 167 ఓట్లు సాధించారు. హెల్గా ష్మిడ్‌కు కేవలం 7 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. ప్రాంతాల వారీగా ప్రతీ ఏటా నిర్వహించే ఈ ఎన్నికలను రహస్య బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని రష్యా డిమాండ్ చేసింది. అందుకు సభ్య దేశాలు కూడా అంగీకారంతెలిపాయి. దీంతో రహస్యబ్యాలెట్ పద్ధతిలోనే ఓటింగ్ నిర్వహించారు. ముఖ్యంగా అధ్యక్ష పదవికోసం జర్మనీ విదేశాంగ శాఖ మాజీ మంత్రి అనలీనా బేర్‌బాక్, జర్మన్ దౌత్యవేత్త అయిన హెల్గా ష్మిడ్ పోటీలోకి దిగారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-6-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 124 పేజీలు: 12 వెల: 6.50

**ముజిబుర్ రహ్మాన్ జాతిపిత గుర్తింపు రద్దు** 9లో

**హమాస్ కొత్త అధినేతగా అల్ హద్దాద్!**



విజయోత్సవంలో విషాదం..

## బెంగళూరు స్టేడియంలో
# తొక్కిసలాట

**11 మంది మృతి, 50మందికి పైగా గాయాలు**

కోహ్లి బృందం అభినందన సమావేశానికి తరలివచ్చిన లక్షల మంది అభిమానులు

చిన్నస్వామిస్టేడియం గేట్లు బద్దలు కొట్టి తోసుకువచ్చిన ఘటనలో పలువురికి గాయాలు

పరిస్థితి అదుపు తప్పడంతో లాఠీచార్జి

ఘటనపై న్యాయవిచారణకు ఆదేశించిన సిఎం సిద్దరామయ్య

మృతుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం

ప్రధాని మోడీ, బిసిసిఐ దిగ్భ్రాంతి

**బెంగళూరు, జూన్ 4:** ఐపిఎల్ 18వ సీజన్‌లో ఛాంపియన్‌ట్రోఫీ గెలుచుకుని స్వరాష్ట్రానికి తిరిగివచ్చిన రాయల్‌ఛాలెంజర్స్ విజయోత్సవ వేడుకలు విషాదాన్ని నింపాయి. భారీ ఎత్తున తరలివచ్చిన కోహ్లి, ఆర్సీబీ అభిమానులు తోసుకురావడంతోపోలీసులకు సైతం కట్టడిచేయడం కష్టం అయింది. ఈ తొక్కిసలాటలో 11 మంది చనిపోగా 50 మందికిపైగా తీవ్ర గాయాలపాలయ్యారు. 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత ట్రోఫీని గెలుచుకని బెంగళూరుకు ప్రత్యేక విమానంలో వచ్చిన కోహ్లి బృందానికి కర్ణాటక ప్రభుత్వం అభినందన సభ ఏర్పాటుచేసింది. నగరంలోనిచిన్నస్వామి స్టేడియంలో ఈకార్యక్రమం ఏర్పాటుచేసారు. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈసభ ఏర్పాటయింది. ఈ కార్యక్రమానికి ఉచిత పాస్‌లు అందించినట్లు కూడా తేలింది. పాస్‌లు లేని అభిమానులు ఒక్కసారిగా భారీ సంఖ్యలో వచ్చిపడ్డారు. భద్రతా బలగాలు ఉన్నప్పటికీ అభిమాన గుంపులు ఎక్కువ కావడంతోపరిస్థితి అదుపు తప్పింది. 18వ నెంబరు గేట్ వద్ద పెద్ద ఎత్తున తొక్కిసలాటజరిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీఛార్జిచేసారు. అయినా కూడా అభిమానులు ఎక్కడా తగ్గలేదు. ఎయిర్ పోర్టునుంచి చిన్నస్వామి స్టేడియం వరకూ ఆర్సీబీ జెండాలు చేతబూనిన అభిమానులు ఇంత భారీ సంఖ్యలో వస్తారని ఎవ్వరూ ఊహించలేదు. లక్షమందికిపైగా వచ్చినట్లు కెసిఎ అంచనా >>2

**ఆర్‌సిబి అభిమానులకు క్షమాపణ చెప్పిన డికె** 2లో

## అన్ని జిల్లా కేంద్రాలలో
# పి-4 కార్యాలయాలు



బుధవారం సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశ దృశ్యం

సిఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రి మండలి భేటీ

సిఆర్‌డిఎ నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం

వివిధ సంస్థలకు భూకేటాయింపులపై రాయితీలకు ఆమోదం

248 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి

17మంది యావజ్జీ ఖైదీలకు క్షమాభిక్ష

వైఎస్సార్ జిల్లాపేరు వైఎస్సార్ కడపగా మార్పు

జగన్ తప్పులు చేసినట్లు రుజువైతేనే చర్యలు: సిఎం

**విజయవాడ,జూన్4,ప్రభాతవార్తప్రతినిధి:** తనను జైల్లో పెట్టారని జగన్‌ను కూడా జైలులో పెడతామంటే ఎలా కుదురుతుంది..అది కరెక్ట్ కాదు కదా అని మంత్రులతో సీఎం అన్నారు. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా.. జగన్ తప్పుచేశాడు కదా? మనం ఎందుకు చర్యలు తీసుకోకూడదు అని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రశ్నించగా అతను తప్పులు చేసినట్లు రుజువులు ఉంటే చట్టానికి దొరికితే మనం చర్యలు తీసుకోవాలి. మంత్రులు చాలా జాగ్రత్తగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం భేటీ జరిగింది. వివిధ సంస్థలకు చేసిన భూకేటాయింపులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అదే విధంగా సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించారు. సత్ప్రవర్తన కలిగిన 17 మంది జీవిత ఖైదీల విడుదలకు ఆమోదం తెలిపిన మంత్రివర్గం, జైళ్లలో సంస్కరణలు తేవాలని నిర్ణయించారు. ఉద్దానం, కుప్పం రక్షితనీటి సరఫరాకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ ఇచ్చేందుకు ఆమోదించారు. 248 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పించే ప్రతిపాదనకు, వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ తెచ్చిన జీవోకు కేబినెట్ సమావేశంలో ఆమోదముద్ర వేశారు. పోలీసు అకాడమీకి అదనంగా 94.45 ఎకరాలు ఇచ్చేందుకు నిర్ణయించారు. పరిశ్రమలకు సంబంధించి 2025 చట్టంలో పలు నిబంధనల సవరణలపై చర్చించారు. మహిళలు రాత్రిపూట కూడా పనిచేసే చట్టసవరణకు ఆమోదించారు. రాత్రిపూట పనిచేసే మహిళలకు భద్రత, రవాణా సౌకర్యాలు కల్పించాలని, పరిశ్రమలు, కార్పొరేట్ రంగంలో పనిచేసేందుకు మహిళలకు అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. రక్షితనీటి సరఫరాకు శ్రీకాకుళంలో రూ.5.75 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండ్‌కు ఆమోదం తెలిపిన మంత్రివర్గం,కుప్పం నియోజకవర్గంలో రూ.8.22 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండ్ విడుదల చేయాలని నిర్ణయించారు. పలు సంస్థలకు >>2

## నియంతలు కొట్టుకుపోయిన రోజు జూన్-4
### యేడాది కూటమి పాలన సందర్భంగా సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** మహా ప్రజా విప్లవంతో ఏపీలో దుష్టుని రాజ్యం అంతరించిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.ఇక జనం జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసిన ప్రజలు దగ్గరకు రానివ్వరన్నారు. వైకాంగ్రెస్ పార్టీ అదృశ్యం కావడం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి సరిగ్గా ఏడాది కావడంతో ఈ ఘనవిజయాన్ని గుర్తు చేస్తుకుంటూ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. జూన్ 4న ప్రజల తీర్పుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన రోజు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రజా విప్లవానికి నియంత పాలకులు కొట్టుకుపోయిన రోజు అని గుర్తు చేశారు. అధికారం పేరుతో ఊరేగిన ఉన్మాదాన్ని ప్రజలు తరిమికొట్టిన రోజు అని, సైకో పాలనకు అంతం పలికి ప్రతి పౌరుడూ స్వేచ్ఛ, ప్రశాంతత పొందిన రోజు అని స్పష్టం చేశారు. ఉద్యమంలా ఓట్లేసి తిరిగి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన రోజు అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉగ్రవాదంతో గాయపడ్డ రాష్ట్రాన్ని కూటమి చేతిలో పెట్టి సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు నాంది పలికిన రోజు అని వెల్లడించారు. పసుపు సైనికుల పోరాటాలు, జనసైనికుల ఉద్యమా >>2

# 700 ఎలక్ట్రికల్ బస్సులు
### ఆర్టీసి రీజనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి

**వెంకటగిరి, జూన్ 4, ప్రభాతవార్త:** కాలుష్య నివారణకు మొదట విడుదల 700 ఎలక్ట్రికల్ బస్సులను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు నెల్లూరు ఆర్టీసీ రీజినల్ చైర్మన్, రాష్ట్ర బోర్డు డైరెక్టర్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి ఆర్టీసీ డిపో, బస్టాండ్లను ఆయన పరిశీలించారు. మొదటి విడుదల 700 బస్సులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వనున్నట్లు తెలిపారు. అంచలంచెలుగా అన్ని డిపోలకు ఎలక్ట్రికల్ బస్సులను తెప్పిస్తామని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ సమస్త లక్ష్యమని చెప్పారు. బస్సులను పరిశుభ్రంగా ఉంచడం, సమయానికి నడపడం వంటి కార్యక్రమాలు చేయాలని తెలిపారు. ఆర్టీసీ డిపో కార్యాలయం, బస్టాండు పైన పెచ్చులు ఊడుతున్నాయని వీటి రిపేర్లకు నిధులు తెప్పిస్తానని తెలిపారు. ఆగస్టు నెల 15 నుండి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు.

# రాష్ట్రంలో 300 మె.వా సౌర విద్యుత్ ప్లాంట్లు
### ఎస్ఎఇఎల్ సంస్థ ఏర్పాటు

**విజయవాడ, జూన్ 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుంది.ఎస్ఏఈఎల్ సోలార్ ఎంహెచ్‌పీ1 ప్రైవేటు లిమిటెడ్ సంస్థ దీన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు రూ.1130 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) నిర్వహించిన కాంపిటీటివ్ బిడ్డింగ్‌లో ఎస్ఏఈఎల్ 300 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్‌ను దక్కించుకుంది. రాష్ట్రంలో ప్రాజెక్టు ఏర్పాటు చేయనుండటంతో, ఆ సంస్థతో డిస్కంలు విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని(పీపీఏ)కుదుర్చుకోవాల్సిన అవసరం లేదు. విద్యుత్ ఎక్స్‌పోర్ట్ పాలసీ నిబంధనలు వర్తిస్తాయి. దీని ప్రకారం ప్రాజెక్ట్ నుండి వచ్చే విద్యుత్‌ను తొలి ప్రాధాన్యత కింద రాష్ట్రం కోరితే ఇవ్వాల్సి ఉంటుంది. లేకుంటే ఆ విద్యుత్‌ను ఇతర రాష్ట్రాల్లో సంస్థ విక్రయిస్తుంది. ఎస్ఏఈఎల్ సుమారు 6.5 గిగావాట్ల కంటే ఎక్కువ ఇండిపెండెంట్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను(ఐపీపీ) నిర్వహిస్తోంది. ఆధునాతన టన్నెల్ ఆక్సైడ్ పాసివేటెడ్ కాంట్రాక్ట్(టాప్‌కాన్)సాంకేతికను వినియోగించి 3.5 గిగావాట్ల సామర్థ్య ఉన్న సౌరమాడ్యూల్ తయారీ యూనిట్‌నూ నిర్వహిస్తోంది. పంజాబ్,హర్యానా,రాజస్థాన్‌లలో 11 వేస్ట్ టు ఎనర్జీ (చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి) ప్లాంట్లను నిర్వహిస్తోంది. వాటి ద్వారా ఏటా 2 మిలియన్ టన్నుల వ్యవసాయ వ్యర్థాలను సంస్థ వినియోగిస్తోంది.ప్రాజెక్ట్ ఏర్పాటుకు అవసరమైన నిధులను విదేశీ ఆర్థిక సంస్థల నుంచి సమకూర్చుకోనున్నట్లు సంస్థ తెలిపింది. ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఎన్‌డీబీ).సొసైటీ జనరల్ గ్రూప్‌లు ఒక్కొక్కటి 44 మిలియన్ డాలర్ల (రూ.377కోట్లు) చొప్పున అందిస్తాయని సెకికి దాఖలు చేసిన బిడ్డింగ్ ప్రతిపాదనల్లో తెలిపింది. ఈ మొత్తాన్ని ప్రాజెక్ట్ అమలు, అభివృద్ధి, నిర్వహణకు సంస్థ వినియోగించనుంది. విద్యుత్ ఎక్స్‌పోర్ట్‌పాలసీ కింద 16 వేల మెగావాట్ల >>2



ఆచార్య ఎవివిఎస్ స్వామి

## నేడే ఎపి ఎడ్‌సెట్ పరీక్ష
### ఏర్పాట్లు పూర్తి: ఆచార్య ఎవివిఎస్ స్వామి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్ 4, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా 2025-26విద్యా సంవత్సరంలో బిఈడి కోర్సుల్లో ప్రవేశాల కొరకు నిర్వహించే ఏపి ఎడ్‌సెట్-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బెస్డ్ టెస్టుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పర్యావరణ విభాగం ప్రొఫెసర్,ఏపి ఎడ్‌సెట్ -2025 కన్వీనర్ ఆచార్య ఏవివిఎస్ స్వామి తెలిపారు. ఎడ్‌సెట్ ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టుకు మొత్తం 17,795మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 87 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం >>2

# యేడాదైనా హామీల అమలు హుళక్కి..

**వైఎస్సార్సీ ఆధ్వర్యంలో రాష్ట్రమంతా 'వెన్నపోటు దినం'**

**ఒక్క యేడాదిలో రూ.లక్షా యాభైవేల కోట్ల అప్పు చేసిన కూటమి ప్రభుత్వం: మాజీ మంత్రి బుగ్గన**

**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** సూపర్ సిక్స్ సహా 143 హామీలతో ప్రజలను నమ్మించి ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయలేదు. చంద్రబాబు చేసిన ఈ మోసంపై ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ ఉద్యమబాట పట్టింది. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు ఏపీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజైన ఇవాళను వెన్నుపోటు దినంగా పాటించాలని నిర్ణయించి నిరసనలకు దిగింది. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆందోళన, వెన్నుపోటు దినంలో పాల్గొంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సాధారణ ప్రజలు, కూటమి సర్కార్ ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిందని ప్రజాగ్రహం, చంద్రబాబు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని నినాదాలు చేశారు. చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రోజు, ఓట్లేసిన ప్రజలకే వెన్నుపోటు పొడిచిన రోజు ఈ రోజు. అప్పుడు మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారనుకుంటే ఏడాది కాలంగా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారు. చంద్రబాబు గతంలో కూడా చెప్పిన హామీలను నెరవేర్చిన ఘనత ఎప్పుడూ లేదని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. చంద్రబాబు మారాడు మారాడు అనుకుంటే చంద్రబాబు ఎప్పటికీ మారడు. డోన్‌లో వైఎస్సార్‌సీపీ వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మూడ లక్షల కోట్లు అప్పు చేస్తే నేడు కూటమి ప్రభుత్వం సంవత్సరంలోనే లక్ష యాభై వేల కోట్లు అప్పు చేసిందన్నారు. కరెంటు బిల్లులు పెంచబోమని చెప్పి ఇష్టం వచ్చినట్లు పెంచి సూపర్ సిక్స్ అంటూ పిల్లల నుంచి ముసలి వారి వరకు మోసం చేశారు. సంపద సృష్టిస్తాం అని చెప్పి చివరకు పథకాల హామీలలో చేతులు ఎత్తేస్తున్నారని విమర్శించారు.

పులివెందులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలప్పుడు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెం టీ అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, నెలకు రూ.1500, రైతన్నలకు ఏడాదికి రూ.20000, అమ్మఒడి, ఫీజు రీయింబర్స్ మెంట్ ఆరోగ్యశ్రీ పథకాలను నిర్వీర్యం చేశారు.

పులివెందుల మెడికల్ కాలేజీకి 50 సీట్లు వస్తే వెనక్కు పంపిన నీచ చరిత్ర చంద్రబాబుది అన్నారు. పులి వెందుల నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో 90శాతం పనులు అయితే మిగిలిన 10 శాతం పనులను ఈ ప్రభుత్వం చేయలేదని వైఎస్సార్సీ నేతలు విమర్శించారు.

# జులై 21 నుంచి వర్షాకాల పార్లమెంటు 2లో
### ఆగస్టు 12 దాకా సమావేశాలు



## 'కల్తీ' నెయ్యి కేసులో
# 'మాజీ'లకు నోటీసులు!
### సిట్ అదుపులో వైవి పిఎ అప్పన్న
### సాక్ష్యాధారాలతో లోతుగా విచారణ

**తిరుమల,జూన్ 4ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూల తయారీకి స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరాలో కల్తీనెయ్యితో సరిపెట్టుకున్నారని బలమైన ఆరోపణలపై సిబిఐ సిట్ అధికారులు సాక్ష్యాధారాలు సేకరించారు. ఇప్పటికే ఈ కేసులో నలుగురు ప్రధాన నిందితులు తమిళనాడు ఏఆర్ డెయిరీ ఎండి రాజశేఖరన్, నెయ్యిసరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌లోని పరాగ్‌డెయిరీ, ప్రీమియర్ అగ్రిఫుడ్స్,అల్ఫామిల్క్‌ఫుడ్స్, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒఅపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలను సిట్ నాలుగునెలల క్రిందటే అరెస్టుచేసి కీలక ఆధారాలు రాబట్టింది. వీరేగాక మరో ఐదారుగురు టిటిడి ఉద్యోగులను సిట్ అరెస్టుచేసింది. ఇప్పుడు టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు(పిఎ) అప్పన్నను, మరో ఆరుగురు టిటిడి ఉద్యోగులను అదుపులోకి తీసుకున్న సిట్ >>2



**శరవేగంగా కరిగిపోతున్న హిమనీ నదాలు**

**మూడు నగరాలకు జలప్రమాదం ఉందంటున్న నిపుణులు**

# ముంబయి, చెన్నై, విశాఖ మునిగి పోతాయా?

**న్యూఢిల్లీ, జూన్ 4:** అభివృద్ధి పేరుతో మానవ జాతి సృష్టిస్తున్న విధ్వంసం కారణంగా ఈ శతాబ్దం చివరి నాటికి భూమి సగటు ఉష్ణోగ్రత 2.7సెంటిగ్రేడ్ పెరిగే అవకాశం ఉందని దీనివల్ల ప్రపంచంలోని పలు దేశాలు మునిగిపోయే ముప్పు ఎదుర్కొంటాయని ఒక సర్వే నివేదిక సంచలనం సృష్టిస్తోంది. పైగా అందులో భారతదేశం కూడా ఉందంటూ ముంబై, విశాఖ, చెన్నై నగరాలు జల సమాధి అవుతాయని కూడా ఆనివేదికలో ప్రస్తావించారు. ఉష్ణోగ్రత పెరుగుదల కారణంగా ఈ శతాబ్దం చివరినాటికి భూమిపై ఉన్న మంచు పర్వతాలు, హిమనీనదాలు కేవలం పావు వంతు మాత్రమే మిగిలి ఉంటాయని, మిగిలిన మూడు వంతులు కరిగిపోతాయని పేర్కొన్నారు. దీని కారణంగా ప్రపంచంలోని కొన్ని దేశాలతో పాటు భారతదేశంలో ముంబై, చెన్నై, విశాఖపట్నం వంటి తీరప్రాంత నగరాలు జలమయం అవుతాయని చెబుతున్నారు. దాదాపు రెండు అడుగుల మేర నీటిలో మునిగిపోతాయని ఈ సర్వేలో పేర్కొన్నారు అధ్యయనకారులు. ఇప్పటికే స్విట్జర్లాండ్‌లో ఎత్తైన పర్వతాల నుండి ఒక మంచు చరియలు విరిగిపడి దిగువప్రాంతాలలో విధ్వంసం సృష్టించింది. ఈ మంచు తుఫాను దిగువలోయలోని బ్లాటెన్‌అనే గ్రామాన్ని నామరూపాల్లేకుండా చేసింది. అక్కడి ప్రజలకు కనీసం దాని నుండి బయటపడే అవకాశం కూడా లేకుండాపోయింది.క్షణాల్లోనే ఆ ప్రాంతమంతా స్మశానంలా మారింది. బార్చ్ అని పిలువబడే ఈ హిమనీనది వల్ల గ్రామంలోని తొంభైశాతం ప్రాంతం పూర్తిగా నాశనమైంది. ఈ విలయం నుంచి 300మంది తప్పించుకుని బయటపడ్డారు. ఉష్ణోగ్రత మరో తాజా అధ్యయనం ప్రకారం ప్రపంచంలోని హిమానీనదాలు గతంలో అంచనా వేసిన దానికంటే చాలా వేగంగా కరుగుతున్నాయి.

వార్త

కిందపడిన ప్రతిసారీ సర్దుకుని మళ్లీ లేచినప్పుడే అది మన అతి ఉత్తమమయిన గొప్పతనాన్ని చాటుతుంది.

-గోల్డ్‌స్మిత్

# బ్రహ్మోస్త్ర పాటవం!

అణ్వాయుధాలు ఉండడమే కాదు యుద్ధ నీతి, యుద్ధ రీతి కూడా తెలిసి ఉంటేనే యుద్ధంలో విజయం సాధించడం సాధ్యమౌతుంది. లేకుంటే శత్రువు చేతికి చిక్కి అవమానాలు పాలవడమే మిగులుతుంది. ఇప్పుడు పాకిస్థాన్‌కు అదొక్కటే మిగిలింది. మూడుసార్లు చావుదెబ్బతిన్నా నైజం మార్చుకోకుండా దాయాది దేశం భారత్‌ను సాధించాలనుకోవడమనేది అవివేకం. ఈ విషయాన్ని పాకిస్థాన్ గుర్తించేసరికి పుణ్యకాలం పూర్తయిపోతుంది. అణ్వాయుధాలున్నాయంటూ భయపెట్టడ మొక్కటే ఆ దేశ డొల్లతనానికి నిదర్శనం. ఆ దేశం, ఈ దేశం మద్దతు ఉన్నా నిన్నమొన్నటి ఇండో పాక్ యుద్ధంలో కనీసస్థాయిలో భయపెట్టలేక పోయింది. కేవలం భారత్ అస్త్రాలను మట్టుపెట్టామని చెప్పుకోవడమే ఆ దేశ యుద్ధరీతిగా బయటపడింది. ఆ వ్యూహానికి చైనా టర్కీ వంటి దేశాలు ఎంతగా తాళం వేసినా కుట్రలు, కుతంత్రాలు భారత్ యుద్ధతంత్రం ముందు వెలవెలపోయాయి. భారత్ నేవీ బలగాన్ని, పలు అస్త్రాలను మాత్రమే నమ్ముకుని యుద్ధానికి దిగింది. అణ్వాయుధాల ఊసే ఎత్త లేదు. ఒక్క బ్రహ్మోస్త్రంతో పాక్ సైన్యాన్ని మట్టి కరిపించింది. ఈ సందర్భంగా బ్రహ్మోస్త్రమే భారత్ పరువు నిలబెట్టిందని చెప్పాలి. భారత్ అమ్ములపొదిలో ఓ బాణమే బ్రహ్మోస్త్రం. ఒక విజయం వెయ్యేనుగుల బలాన్నిస్తుంది. ఇందులో ఒక్క అక్షరం కూడా పాలుపోలేదు. బ్రహ్మోస్ ఘన కీర్తి వెలుగులోకి వచ్చాక మరిన్ని బ్రహ్మోస్‌ల తయారీకి, రాఫెల్స్ తయారీకి దారి తీసింది. 2030 సంవత్సరం నాటికి 26 రఫేల్ మెరైన్ ఫైటర్ విమానాలతో భారత నౌకాదళ ఆయుధ సంపత్తి మరింత పటిష్ఠం కానుంది. ఈ రఫేల్‌మెరైన్ ఫైటర్ విమానాలను పూర్తిగా సముద్ర జలాల్లో మాత్రమే వినియోగించే అవకాశం ఉంటుంది. ఈ విమానాల కొనుగోలు కోసం రూ.63 వేల కోట్ల ఫ్రాన్స్, భారత్ అంతర్ ప్రభుత్వ ఒప్పందం జరిగింది. పాక్ మీద ఎప్పుడూ మనమే పైచేయిగా ఉన్నాం. ఈ విమానాల్లో అధిక భాగాన్ని భారత్‌లోనే తయారుచేస్తారు. శిక్షణ, సిమ్యులేషన్, పరికరాలు, ఆయుధాలు, పనితీరు ఆధారిత రక్షణ సరఫరాలు అన్నింటికీ ఈ ఒప్పందం వర్తిస్తుంది. దీంతో భారత దేశానికి 62 రఫేల్ ఫైటర్ విమానాలు అందుబాటులోకి వస్తాయి. ఈ రఫేల్‌మెరైన్ జెట్ విమానాలు జోడు కావడంతో ఫ్రాన్స్ తర్వాత రఫేల్ రెండు తరాల విమానాలు గల తొలిదేశంగా భారత్ మారుతుంది. ఫలితంగా భారత వాయు, నౌకాదళాల బలం మరింతగా పెరుగుతుంది. గగనతలం, సాగరజలాల్లో భారత దేశానికి ఆధిపత్యం లభిస్తుంది. బ్రహ్మోస్ క్షిపణి ఒక్కటే ఇంతటి ఘనకార్యం సాధిస్తే ముందస్తు వ్యూహంతో సిద్ధం జేసిన నేవీ దళాలనుకూడా రంగంలోకి పంపితే పాక్ భస్మీ పటలమేనని కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ చెప్పిన విషయాలు వింటే ఎంతో పకడ్బందీగా మన రక్షణ సంపత్తిని పెంపు చేసుకునే కార్యక్రమంలో వ్యూహాత్మక ప్రణాళికను జాతి నేతలకు ప్రణామాలు అర్పించాల్సిందే! పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను లక్ష్యంగా చేసుకుని జరిగిన క్షిపణి దాడులు పాకిస్థాన్ వైమానిక లాజిస్టిక్స్, సైనిక సమన్వయాన్ని గణనీయంగా దెబ్బతీశాయి. ఇప్పట్లో కోలుకోవడం కష్టమే. బ్రహ్మోస్ దాడులు భారతదేశ సైనిక సామర్థ్యాలకు నిదర్శనంగా, పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై దాడితో గణనీయమైన నష్టం కలిగించాయి. కనుక మన దేశ సైనిక ఔన్నత్యాన్ని గుర్తుచేసుకుంటూ నిశ్చింతగా నిద్రపోవచ్చు. ఈ ఆపరేషన్ సిందూర ప్రభావమే భారత్ పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ కుదిర్చింది. ఐనా మాట నిలకడలేక, ఎన్నోసార్లు కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించిన ప్రబుద్ధ దేశం కనుక నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో ఆయుధ సంపత్తిని పెంచుకోవాల్సినఅగత్యమే ఏర్పడింది. నిజమైన 'బ్రహ్మోస్త్రం'ఎలా వుంటుందో పురాణ ప్రవచనాల్లో చెప్పగా విన్నాం. మళ్ళీ ఇప్పుడు పాక్ అధ్యక్షుని నోట. పాక్ దుశ్చర్యలను, ఉగ్రవాద దురాగతాలను ప్రపంచ దేశాలకు తెలియచెప్పిఎండకట్టేందుకు అఖిల పక్ష నేతలు, పార్లమెంట్ సభ్యుల బృందాలు మన దేశం తరపున విదేశాల్లో తిరుగుతూ ఉంటే పాకిస్థాన్ మాత్రం పాక్ గడ్డమీద నుంచే మన బ్రహ్మోస్‌ను కీర్తిస్తోంది. బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు మిగిల్చాయని ప్రధాని నరేంద్రమోడీ కాన్పూర్ సభలో చెప్పడానికి ఇదే కారణమై ఉంటుంది. వివరించారు. ఆప రేషన్ సిందూర్ ప్రతాపాన్ని, సైనిక శక్తిని యావత్ ప్రపంచం చూసిందని, మన బలం, బలగాల విషయమై ప్రపంచానికి ప్రధాని గర్వంగా చాటి చెప్పారు. 290 కి.మీ కంటే ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం కలది. బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి. లక్ష్యాల ఛేదనలో అత్యంత ఖచ్చితమైన ఫలితాలనిస్తుందని ప్రతీతి. ఆపరేషన్ సిందూర్, ఇతర సైనిక కార్యకలాపాలలో బ్రహ్మోస్ క్షిపణి పనితీరు భారత సైన్యానికి ఎనలేని ఆస్తిగా మారింది. భారత్ తనసొంత తెలివి తేటలతో రూపొందించుకున్న అతిశక్తి బ్రహ్మోస్ ఉంది. దానిపేరు వింటేనే పాక్‌హడలిపోతోంది. ఆవిషయం ఆ దేశ అధ్యక్షుడే సహబాజ్ షరీఫ్ స్వయం గా చెప్పారు. బ్రహ్మోస్ శక్తిని గుర్తించి ఎదుర్కొందామని చూసేసరికే తమ మీద దాడి చేసిందని చెప్పారు. స్వదేశీ ఆయుధ సామర్థ్యం, మేక్‌ఇన్ ఇండియా శక్తిని ప్రపంచం గమనించే స్థాయిలో తమ ప్రతిభ పాటవాలను చూపగలిగాయి. పాకిస్థాన్‌లోని వందల కిలోమీటర్‌ల దూరంలో ఉన్న పాక్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిందంటేనే భారత్ సంపూర్ణ విజయం సాధించినట్లే లెక్క!

ఒక వ్యక్తి పేదరికాన్ని సంపదను నిర్ణయించేది ఆ వ్యక్తి సంపాదనగాని, ఆదాయంకాని కాదు. అతడి ఆదాయానికి, ఖర్చుకీ మధ్య ఉన్న వ్యత్యాసం అంతే.



డేనియల్

గులాబీ బోధ చేయదు. పరిమళాన్ని గుబాళిస్తుంది. అలాగే అధ్యాపకుడు తన జీవిత పరిమళంతో బోధించాలి.



మహాత్మాగాంధి

# ప్రజావాక్కు



### చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టాలి

సమాజంలో చిన్నారులు భవిష్యత్తు పౌరులు మాత్రమే కాదు, నేటి బాధ్యతగా కూడా భావించాలి. కానీ ఇటీవల చిన్నారులపై లైంగిక దాడులసంఖ్య ప్రమాదకరంగా పెరుగుతోంది. యునిసెఫ్ నివేదికప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 53శాతం బాలికలు లైంగిక వేధింపులకు గురవుతుండగా, వాటిలో 90శాతందాడులు కుటుంబసభ్యులు లేదా పరిచయస్తులచే జరుగుతుండటం మన మానవత్వాన్ని కలవరపెడుతోంది. ఇలాంటి దాడులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి. బాధితులు భయంతో మౌనంగా ఉంటూ జీవితాంతం ఆ గాయాలతోనే బతకాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అంతేకాదు, మత్తు పదార్థాలు, అసభ్యవీడియోలు, సోషల్ మీడియా వల్లనూ బాలబాలికలు ప్రమాదంలో పడుతున్నారు. పోక్సో చట్టం వంటి చట్టాలున్నా అమలు లోపం వల్ల నేరగాళ్లకు శిక్షలు పడటం అరుదు .న్యాయవ్యవస్థ వేగంగా స్పందించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### గురుకుల అడ్మిషన్లు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బాలుర, బాలికల గురుకులాలలో అడ్మిషన్లు5వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులలో అడ్మిషన్లను రాష్ట్రంలోని33జిల్లా కేంద్రాలలో విద్యార్థులకు వచ్చిన మార్కులు మెరిట్ ఆధారంగా అన్ని గురుకులాలకుఒక చోటకౌన్సిలింగ్ నిర్వహించాలి. ప్రభుత్వం నిర్ణయించిన సీట్లు ప్రతి కళాశాలలో భర్తీ అయ్యే విధంగా చూడాలి గురుకుల ఇంటర్ కళాశాలలో తప్పనిసరిగాసైన్స్ మ్యాథ్స్ సబ్జెక్టులతోపాటుగా సామాజిక శాస్త్రాలు అయిన ఎకనామిక్స్, హిస్టరీ, సివిక్స్, కామర్స్, వంటి కోర్సులనునూతన విద్యాసంవత్సరంలో ప్రారంభించాలి.

- రాపాక రవీందర్, జనగాం

### ఆదాయ మార్గాలను సృష్టించాలి

ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు విపరీతంగా ఖర్చుచేస్తున్నాయి. ఇది దీర్ఘ కాలంలో ఆర్థిక అస్థిరతకు దారితీస్తుంది. వీలైనంత త్వరగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు కోత విధించి ఆదాయ మార్గాలను సృష్టించాలి. ఉచిత పథకాలను ఎత్తివేసి ఆదాయ మార్గాలను సృష్టించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

- టి.ముత్యంరెడ్డి, సిద్దిపేట జిల్లా

### ఓర్వలేకనే విమర్శలు

రేవంత్‌రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. వారి కోసంచాలా కష్టపడుతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వారి కోసం ఎన్నోపథకాలను రూపొందిస్తూ అమలు పరుస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, పెన్షన్లు ఇస్తూ పేద ప్రజలను ఆదుకుంటున్నారు. పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలు చేస్తున్నారు. ఐ.టి, పరిశ్రమలనుస్థాపించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తాపత్రయపడుతున్నారు. మహిళా క్యాంటీన్లు, స్కిల్ యూనివర్సిటీ ఇలా ఎన్నో కార్యక్రమాలు, పథకాలకు కార్యరూపం ఇస్తున్నారు. తెలంగాణలో అన్నిరంగాలను అభి వృద్ధిచేసి రాష్ట్రాన్ని దేశంలో ముందువరసలో నిలబట్టేలా పనిచేస్తున్నారు. గత ముఖ్యమంత్రిలాగా అధికారులను, మంత్రులను, ప్రజలను ఎవరినీ కలవకుండా నిద్రపోవడం లేదు.

-మిథునం, హైదరాబాద్

### పాక్‌ను నమ్మేదెలా?

గాంధీ, బుద్ధుడువంటి అహింసావాదులు, వివేకానంద, పరమహంస లాంటి మహాపురుషులు, రామదాసు, త్యాగయ్య, అన్నమయ లాంటి గొప్ప భక్తులు జన్మించిన పవిత్ర దేశాన్ని ఏలిన ప్రభువులు పొరుగు దేశాలతో యుద్ధాలు చేయాలని వారిపై ఆధిపత్యం చెలాయించాలని ఎప్పుడూ కోరుకోలేదు. యుద్ధాలు చేసే పరిస్థితులు రాకూడదని ప్రజలు సుఖశాంతులతో జీవించాలని విదేశీ ప్రతినిధులతో చర్చలు, సంప్రదింపులు జరిపేవారు. శాంతి ఒప్పందాలు కుదుర్చుకునేవారు. అయితే దేశంలో శాంతి వాఖ్యలు లేకుండాపోయాయి. పొరుగుదేశం వారు అల్లర్లు, అలజడులు సృష్టిస్తు అమాయక జనాల్ని చంపుతున్నారు. యుద్ధానికి కాలుదువ్వుతున్నారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### ఘనతను చాటిన పోటీలు

జూన్ ఒకటవ తారీఖున ముగిసిన ప్రపంచ సుందరి ఎన్నిక పోటీలు ఘనంగా ముగిసాయి. తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అనేక విమర్శల మధ్య కొన్ని రోజులుగా ఇతర దేశాల నుంచి వచ్చిన వారందరికి సకల సదుపాయాలు సమకూర్చి పోటీ నిర్వహణ నిర్విఘ్నంగా పూర్తిచేసి తన ఘనతను ప్రపంచానికి చాటిచెప్పింది. ఇందులో ప్రథమ ద్వితీయ శ్రేణి పొందిన సుందరిలకు హృదయ పూర్వక అభినందనలు. కవులు వర్ణించినట్టు అందాన్ని కొలవడానికి పనిముట్లు లేవు.

-డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పెను ప్రమాదంలో ప్రకృతి శోకం

*పర్యావరణాన్ని పరిరక్షించకపోతే జరిగే పరిణామాలను తెలియచేయడానికి భూగ్రహం విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి ప్రతిఏటా ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుగుతున్నది. జన జీవితాల్లోకి ఇబ్బడి ముబ్బడిగా వచ్చిచేరుతున్న ప్లాస్టిక్ వలన అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమనే అంశాన్ని2025 సంవత్సరపు ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రధాన అంశంగా ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయం. ప్రపంచం ఎదుర్కొంటున్న కాలుష్య సంబంధిత సమస్యలకు మూలం శిలాజఇంధనాల వాడకం విపరీతంగా పెరగడమే. సౌరశక్తి వాడకంపై దృష్టిసారించకుండా శిలాజ ఇంధనాల వినియోగం అధికంచేయాలనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వితండవాదం పర్యా వరణానికి పెద్దదెబ్బ. ఇప్పుడిప్పుడే 'క్లీన్ ఎనర్జీ' పై దృష్టి సారిస్తున్న ప్రపంచానికి ట్రంప్ నిర్ణయం ఆందోళన కలిగిస్తు న్నది. ట్రంప్ బాధ్యతారాహిత్యానికి ప్రపంచం మూల్యం చెల్లించుకోక తప్పదు.*



సుంకవల్లి సత్తిరాజు

ప్రకృతి భూమికి గొడుగు వంటిది. మానవ మనుగడకు రక్షణకవచం లాంటి ప్రకృతిని విధ్వంసం చేయడం మనల్ని మనం ప్రమాదంలో పడేసుకోవడమే. మన చుట్టూ ఆవరించిఉన్న ప్రకృతిని నిర్లక్ష్యం చేసి, పర్యావరణానికి ముప్పు కలగచేయడం క్షమార్హం కాదు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ, ఎన్నో అవగాహనా సదస్సులు, ఎన్నో అంతర్జాతీయసమావేశాలు జరుగుతున్నా పర్యావరణ విధ్వంసం యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. పర్యావరణ విధ్వంసంతో మానవ ప్రపంచం విలపిస్తున్నది. ప్రపంచాన్ని పచ్చదనంతో నింపితేనే భూగ్రహాన్ని కాపాడగలం. స్వీడన్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, ఐస్‌లాండ్, డెన్మార్క్, యు.కె, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ వంటి దేశాలు హరిత దేశాలుగా పేర్కొనబడుతున్నాయి. సహజ వనరులను పరిరక్షించి, కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా డెన్మార్క్ గ్రీనెస్ట్ కంట్రీ దిశగా పయనిస్తున్నది. ఖతార్, నైజర్, గ్రీన్‌లాండ్ వంటి దేశాల్లో పచ్చదనం తక్కువగా ఉంది. ధరిత్రిని కలుషిత వ్యర్థాల నుండి కాపాడడం, ప్లాస్టిక్‌ను నెమ్మదిగా తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు ప్రపంచాన్ని మళ్ళించడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం, అడవులను సంరక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం వంటి చర్యలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. ప్రస్తుత కలుషితభరితమైన ప్రపంచంలో ప్రతీ చోట వినిపించే మాట 'పర్యావరణం'. పర్యావరణం అనే పదానికి నిర్వచనం చాలా మందికి తెలియక పోవచ్చు. పచ్చదనమే పర్యావరణ పరిరక్షణకునిజమైన పరిష్కారమన్న అవగాహన మాత్రం సామాన్య ప్రజల్లో కూడా ఏర్పడింది. కాని ఆచరణలో పర్యావరణ పరిరక్షణ అంశం విఫలమవుతూనే ఉంది. పర్యావరణం శరవేగంగా విధ్వంస మౌతూనే ఉంది. మానవ ప్రపంచాన్ని పెను ప్రమాదం వెంటాడుతూనే ఉంది. మన చుట్టూ పంచభూతాలతో ఆవరించి ఉన్న సహజసిద్ధమైన ఏర్పాటును 'పర్యావరణం'గా పేర్కొనవచ్చు. అలాంటి పర్యావరణం మానవ స్వార్థంతో, తప్పిదాలతో విధ్వంసం కావడం పెను ప్రమాదానికి సంకేతం మానవ మనుగడకు శరాఘాతం. సకల జీవరాశుల మనుగడకు ఏకైక ఆధారం భూగ్రహం. మిగిలిన గ్రహాల్లో జీవించడానికి అనువైన పరిస్థితులు లేవు. ఇతర గ్రహాలపై పరిశోధనలు జరుగుతున్నా ఇప్పటివరకు జీవరాశుల జాడ కనిపించలేదు. వేలాది కోట్లధనం ఇతర గ్రహాలపై పరిశోధనలకు ఖర్చుపెడుతున్నా ఫలితాలు నిరాశాజనకంగానే ఉన్నాయి. ఇతర గ్రహాలపై తిష్ఠ వేయాలనే మానవ జిజ్ఞాస కేవలం అత్యాశగానే మిగిలిపోతుందేమో అనే సంశయం కలగడం సహజం. సువిశాలమైన భూగ్రహాన్ని నాశనం చేసి, ఇతర గ్రహాలపై నివాసానికి కలలు కనడం హాస్యాస్పదం. ప్రకృతి హొయలతో అలరాడే అందమైన భూగ్రహాన్ని కాలుష్యంతో కురూపిగా మార్చి, ఇతర గ్రహాలపై పరిశోధనలు చేయడం కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారింది. భూగ్రహం కూడా ఈ సమస్త విశ్వంలో ఒక భాగమే. భూగ్రహంపై మూడొంతుల నీరు, ఒక వంతు భూమి కలదు. వృక్షాలతో, నదీనదాలతో, కొండలు, లోయలు, సముద్రాలతో పలు జీవరాశులతో, విభిన్నమైన భౌగోళిక నైసర్గిక స్వరూపాలతో, పచ్చని ప్రకృతి మధ్య జీవించే మహద్భాగ్యాన్ని మానవుడే చెరిపేస్తున్నాడు. స్వార్థ ప్రయోజనాల కోసం విచక్షణ కోల్పోయి ప్రకృతిని చెరబట్టి, వికృతంగా మారుస్తున్నాడు. అడవులను నరికి నివాసాలను ఏర్పాటుచేసుకోవడం, పంటభూములను మానవావసరాలకు వినియోగించడం, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఏర్పాటు చేయడం, శిలాజ ఇంధనాలను ఇబ్బడి ముబ్బడిగా వినియోగించడం వలన ధరిత్రిపై కాలు




ష్యపు క్రీనీడలు కమ్ముకుంటున్నాయి. శిలాజ ఇంధనాల వాడకం వలన, అడవులను ధ్వంసం చేయడం వలన, పారిశ్రామిక విప్లవం వలన వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి గ్రీన్‌హౌస్ వాయువుల శాతం పెరిగి, భూఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతున్నది. ఇదేపరిస్థితి కొనసాగితే 'గ్లోబల్ వార్మింగ్' సమస్య పెరిగి భూమిపైమనుగడ సాగిస్తున్న పలుజీవరాశుల భవిష్యత్తు ప్రశ్నార్థకమౌతుంది. భూఉష్ణోగ్రతలు పెరగడానికి మానవ తప్పిదాలే కారణం. ప్రకృతిలో లభ్యమయ్యే వనరులను అవసరాలకు మించి వినియోగించడం, ధనాశతో, దురాశతో దూరదృష్టి కోల్పోయి, పర్యావరణానికి చేటుతేవడం మానవ మనుగడకు పెను ముప్పు. పచ్చదనమే ప్రపంచ మానవాళికి నిజమైన ధనం. మానవాళి మనుగడకు మూలాధారమైన ధరిత్రి పదిలంగా ఉండాలంటే పచ్చని ప్రకృతిని పరిరక్షించుకోవాలి. అవాంఛనీయమైన వాతావరణ మార్పులను అరికట్టి, కాలుష్యాన్ని కొంతవరకైనా నిరోధించగలిగితేనే ధరిత్రిపై జీవరాశుల అస్థిత్వం కొనసాగుతుంది. ఆధునికత, సాంకేతికత ప్రభావంతో రేడియేషన్ పెరిగి మనచుట్టూ ఉన్న పలురకాల పక్షి జాతులు అంతరించిపోవడం చూస్తున్నాం. ప్రకృతి సమతుల్యం లోపించడంతో జీవవైవిధ్యం దెబ్బతింటున్నది. పచ్చదనం నశించడం వలన ఏర్పడుతున్న విపత్కర పరిణామాల వలన ధరిత్రిపై భవిష్యత్తులోమానవ జాతి మనుగడ దుర్లభంగా మారబోతున్నది. మానవ నివాసయోగ్యం కాని ప్రదేశంగా భూగ్రహం పరివర్తన చెందబోతున్నది. అరణ్యాలు స్థానభ్రంశం చెంది కాంక్రీటు కట్టడాలతో ఆధునిక అరణ్యాలుగా రూపాంతరం చెందుతున్నాయి. పర్యావరణ వ్యవస్థను పచ్చదనంతో పునః ప్రతిష్ఠించడానికి ప్రపంచ దేశాలన్నీ చిత్తశుద్ధితో ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలి. పర్యావరణాన్ని పరిరక్షించకపోతే జరిగే పరిణామాలను తెలియచేయడానికి భూగ్రహం విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి ప్రతీ ఏటా ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుగుతున్నది. జన జీవితాల్లోకి ఇబ్బడి ముబ్బడిగా వచ్చి చేరుతున్న ప్లాస్టిక్ వలన అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమనే అంశాన్ని 2025 సంవత్సరపు ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రధాన అంశంగా ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయం. ప్రపంచం ఎదుర్కొంటున్న కాలుష్య సంబంధిత సమస్యలకు మూలం శిలాజ ఇంధనాల వాడకం విపరీతంగా పెరగడమే. సౌరశక్తి వాడకంపై దృష్టి సారించకుండా శిలాజ ఇంధనాల వినియోగం అధికం చేయాలనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వితండవాదం పర్యావరణానికి పెద్ద దెబ్బ. ఇప్పుడిప్పుడే 'క్లీన్ ఎనర్జీ' పై దృష్టి సారిస్తున్న ప్రపంచానికి ట్రంప్ నిర్ణయం ఆందోళన కలిగిస్తున్నది. ట్రంప్ బాధ్యతారాహిత్యానికి ప్రపంచం మూల్యం చెల్లించుకోక తప్పదు. పెరుగుతున్న భూ ఉష్ణోగ్రతలను రెండు డిగ్రీల సెల్సియస్ దిగువ స్థాయికి తగ్గించడం, సగటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదలను 1.5డిగ్రీల సెల్సియస్‌కి పరిమితి చేయాలన్న ఆలోచనతో గతంలో పారిస్ ఒప్పందం కుదిరింది. ఐక్యరాజ్య సమితిలోని మెజారిటీ సభ్యదేశాలు వాతావరణ మార్పులపై ఆందోళన చెంది, గ్రీన్‌హౌస్‌వాయు వులను తగ్గించి, ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఆమోదించిన ఒప్పందం 2016వ సంవత్సరం నుండి అమల్లోకి వచ్చింది. గతంలో డోనాల్డ్‌ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా అధికారంలో ఉన్నప్పుడు పారిస్ ఒప్పందం నుండి వైదలగడం జరిగింది. జోబైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నకాలంలో అమెరికా తిరిగి పారిస్ ఒప్పందంలో చేరింది. ట్రంప్ ఈ సంవత్సరం అధికారంలోకి వచ్చాక తిరిగి పాతపాటే పాడుతూ పారిస్ ఒప్పందం నుండి తప్పుకున్నారు. తమదేశ అవసరాలకు ఖనిజ ఇంధనాన్ని వాడుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచానికి దశాదిశా నిర్దేశం చేయవలసిన అమెరికా తన తొందరపాటు నిర్ణయాలతో ప్రపంచాన్ని సాంప్రదాయేతర ఇంధనాల వన రుల వాడకం నుంచి శిలాజ ఇంధనాల వాడకంపై తిరిగి దృష్టిసారించేలా నిర్ణయాలు తీసుకోవడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. ప్రపంచంలో ప్రకృతి ప్రేమికులకు కొదవలేదు. అయినా ఆశించినంత ప్రయోజనం ఆచరణలో కనిపించడంలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరగకుండా, ప్రజల అవసరాలు తీర్చే ప్రణాళికలు చేపట్టకుండా పర్యావరణ విధ్వంసాన్ని ఆపలేం. 2025వ సంవత్సరం జూన్ 5వ తేదీన దక్షిణ కొరియా ఆతిథ్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఒక దశ, దిశ నిర్దేశించాలి. ప్రపంచస్థాయిసంస్థలు, ప్రభుత్వాలు, పర్యావరణ వేత్తలు పర్యావరణ పునరుద్ధరణకు నడుం బిగించి, మానవాళిని పెనుసంక్షోభం నుండి బయటకు తీసుకురావడానికి వడివడి అడుగులువేయాలి. సహజసిద్ధ మైన, కలుషిత రహితమైన వాతావరణాన్ని పునర్జీవింపచేయాలి. ●

# యుద్ధాలతో జనజీవనం అతలాకుతలం

కనుమ ఎల్లారెడ్డి

ఇద్దరు దేశాధినేతలు యుద్ధం వైపే మక్కువ చూపుతున్నట్లు ఉన్నారు. ఒకరి అంగీకారం మరొకరికి సమ్మతం కావడం లేదు. ఒకరు నెలరోజులు కాల్పుల విరమణ అంటే, మరొకరు కేవలం రెండు, మూడు రోజులే అంటుంది. ఇలా పరస్పర భేషాజాలు పోతే ఎవరికైనా విసుగు వస్తుంది. అందుకేనేమో ఉక్రెయిన్ మునుపెన్నడూ లేని దాడులు చేసింది. ఆ దాడిలో రష్యా నష్టపోయినా సరైన వివరణ ఇవ్వడంలేదు. రష్యాను కోలుకోలేని దెబ్బతీశామని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించాడు. ఈ దిశలో ఆ దేశ సెక్యూరిటీ సర్వీస్ చీఫ్ మాలిక్‌ను అభినందించాడు. రష్యాపై అతి పెద్దదాడి చేసిన ఉక్రెయిన్ ఇది తమ అతిపెద్ద విజయమని పేర్కొంది. ఇలా ఒకరి భూభాగాల నుంచి మరొకరు దాడి చేసుకుంటున్న తరుణంలో ఇస్తాంబుల్‌లో శాంతి చర్చలు ఫలితాలు ఇవ్వలేదు. ఉక్రెయిన్ ముప్పై రోజులు కాల్పుల విరమణ అంటే రష్యా ససేమిరా అంటోంది. అయితే ఒక అంగీకారం కుదరకపోవడం యుద్ధం ఆగిపోతుందనే ఆశ మిణుకు, మిణుకు మంటోంది. అదేమంటే యుద్ధ ఖైదీల మార్పిడి, యుద్ధంలో మరణించిన వారి మృత శరీరాలను అప్పగింతలో ఒక్కటే అంగీకారం కుదిరింది. ఈ విషయం ఉక్రెయిన్ రక్షణ మంత్రి ఉమెరోవ్ చెప్పడం ముదావహం. కాని ఆదివారం ( జూన్ 1) నాటి దాడులలో ఆపరేషన్ స్పైడర్ వెబ్‌కు ప్రతిగా రష్యా భీకర దాడులు చేస్తోంది. అందుకు ఉక్రెయిన్ మేము ఆదివారం చేసిన దాడులలో దాదాపు ఒక వెయ్యిమందికి పైగా రష్యా సైనికులు మరణించారని చెప్పటం గమనార్హం. దీనిపై రష్యా పెదవి విప్పకపోవటం అనుమానాలకు తావిస్తోంది. ఇలా కాల్పులు, ప్రతి కాల్పులతో ఇక శాంతి చర్చలకు అవకాశం ఎక్కడ ఉంటుంది? రెండు దేశాల మధ్య యుద్ధం ఆగిపోతుంది అనేది ఇప్పట్లో జరిగేది కాదు. ఏదైనా అద్భుతం జరిగితే తప్పా. అటు ఉక్రెయిన్‌కు ఇటు రష్యాకు ఎవరు శాంతిచర్చలు జరిపినా ఫలితం శూన్యం. ఒకవేళ భారత్ మాత్రం నడుం బిగిస్తే యుద్ధం ఆగిపోయే అవకాశం ఉండొచ్చు. కాని భారత్, పాక్ మధ్య పొరపొచ్చలు రావడంతో భారత్ మిన్నకుండి పోయింది. పహల్గం దాడిలో పాక్‌కు చెందిన లష్కరే హస్తం ఉండటంతో, దాన్ని పక్కదారి పాటించాలన్న పాక్ కుటిల శక్తులు పారలేదు. ఐక్యరాజ్య సమితిలోని భద్రతా మండలిలో పాక్, పహల్గం ఉగ్రదాడి భారత్ స్వయంకృతం అని చెప్పబోయి చతికిల పడింది. భద్రతా మండలిలో పాక్ ప్రతినిధి అసిమ్ ఇప్తిఖర్ అహ్మద్‌కు తగిన గుణపాఠం భద్రతా మండలి చెప్పింది. పాక్‌కు ఏఒక్క దేశం మద్దతు పలుకలేదు. పాక్ మిత్ర దేశమైనా చైనా కూడా పాక్‌కు మద్దతు చెప్పలేదు. పైగా భారత్ మాపై దాడిచేస్తే విశ్వంలో ఎవరూ మిగలరు అని పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలు దుమారం లేపాయి. ఆది భారత్‌పై మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. భద్రతా మండలిలోని సభ్యులు పాక్‌ను ఉక్కిరి, బిక్కిరి చేసి మీవి తప్పులు పెట్టుకుని మళ్ళీ భారత్‌పై చాడీలు చెబుతారా అంటూ ఏకిపారేసింది. చైనా మద్దతు ఏలాగూ భారత్‌కు ఉండటంతో భారత ప్రధాని మోదీ భద్రతా మండలిలోని శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్ దేశాలతో పాక్ వైఖరిని, ఉగ్రదాడిని వివరించారు. భద్రతా మండలిలో పాక్ ఏకాకి అయిపోయింది. ఇది భారత్ సాధించిన విజయం. భారత్‌తో పోరాడితే మనకే నష్టం అని పాక్‌లోని ఓ మత గురువు చెప్పడం, అక్కడి మసీదులో ఉన్న వాళ్లు కూడా ఎవరూ పాక్‌కు అనుకూలంగా మాట్లాడ లేదు. తప్పు మాదే అనే మిషతో ఉన్నారు. పాక్ ప్రజలు కూడా పాక్‌నే తిట్టిపోస్తుఉంటే ప్రభుత్వం తలలుపట్టుకుంది. భారత్‌ను శరణువేడటమే తరువాయి. అప్పుడే భారత్ శాంతిస్తుంది. లేకపోతే పాక్ నామరూపాలు లేకుండా పోతుంది. ●

# యువత ఉపాధిపై కృత్రిమ మేధ ప్రభావం

తరిగోపుల నారాయణస్వామి

ఇప్పటి యాంత్రిక యుగంలో కృత్రిమ మేధసు ప్రభావం వేగంగా విస్తరిస్తోంది. ఇది ఉద్యోగ రంగాన్ని కుదించే దిశగా ముందుకెళ్తోంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తేనే కాదు, మన దేశంలోనూ ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఏఐ సాంకేతికతతో ఎన్నో ఉద్యోగాలు యంత్రాల చేతుల్లోకి వెళ్లిపోయాయి. బ్యాంకులు, ఐటీరంగం, ఫ్యాక్టరీలు, కన్సల్టెన్సీలు, టెలికాలింగ్ కేంద్రాలు ఇలా ఏ రంగానైనా తీసుకున్నా మానవ శక్తికి బదులుగా యంత్రాలు పని చేస్తున్నాయి. ఇది ఆర్థికపరంగా సంస్థలకు లాభదాయకం కావచ్చు. కానీ సమాజానికి మాత్రం ఇది భవిష్యత్ సంక్షోభానికి నాంది. ఇప్పటికే మన దేశంలో యువత పెరుగుతున్న నిరుద్యోగం వల్ల తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అటు ప్రభుత్వ రంగం నుండి కొత్త ఉద్యోగ ప్రకటనలు తక్కువగా రావడం, ఇటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కోల్పోవడం, ఈ రెండు కలిసి ఒక కుంభమేళం లాగా నిరుద్యోగాన్ని పెంచిపెడుతున్నాయి. ప్రభుత్వ నియామక ప్రక్రియలు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయి. గ్రూప్ పరీక్షల ప్రకటనలు సంవత్సరాల తరబడి ఆలస్యం అవుతుండగా, నియామకాల్లో తారతమ్యాలు, కోర్టుల స్టేలు, రాజకీయ ప్రతిస్పందనలు మరింత కల్లోలం సృష్టిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో యువత తమ జీవిత భద్రతపై ఆశను కోల్పోతున్నారు. అందుకే చాలామంది యువకులు పెళ్ళిళ్లను వాయిదా వేస్తున్నారు లేదా పూర్తిగా వివాహం వైపు వెళ్లకుండా జీవితాన్ని ఒంటరిగా గడిపే దిశగా అడుగులు వేస్తున్నారు. ఒక కుటుంబం నెరవేర్చే సామర్థ్యం లేకపోతే, ఒకరికొకరు భరోసా ఇచ్చే పరిస్థితి లేకపోతే పెళ్లి ఎలా సాధ్యం అవుతుంది? ఈ ఫలితంగా మన దేశ జనాభా పెరుగుదల మందగిస్తోంది. ఇది కొంతవరకూ మంచి విషయంగా కనిపించొచ్చు, కానీ దీర్ఘకాలంలో ఇది శ్రమిక శక్తి లోపానికి దారితీస్తుంది. అనేక రంగాల్లో పనిచేసే చేతులు లేకపోవడం వలన ఉత్పత్తితీరు తగ్గుతుంది. పెన్షన్, హెల్త్‌కేర్ లాంటి రంగాల్లో వృద్ధ జనాభా కోసం పనిచేసే యంగ్ జనరేషన్ లేకుండా పోవచ్చు. ఇది వృద్ధుల భద్రతకు ప్రమాదాన్ని తీసుకువస్తుంది. ఇక్కడ ప్రశ్నించాల్సింది ఏమిటంటే - పాలకులు ఈ పరిస్థితిని అర్థం చేసుకుంటున్నారా? వారు ఒక వైపు జనాభా తగ్గితే అభివృద్ధి తగ్గుతుందని చెబుతున్నారు. మరొకవైపు ఉద్యోగ అవకాశాలు సృష్టించకుండా నిరుద్యోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇది అంతర్గత విరోధం. పాలకుల వైఖరిచూస్తే, వారు సమాజ భవిష్యత్తుగురించి కాక, తాత్కాలిక లాభాలు, రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తు




న్నట్టు స్పష్టమవుతోంది. ఇలాంటి పరిస్థితే కొనసాగితే, రాబోయే 10-20ఏళ్లలో మనం తీవ్ర జనాభా సంక్షోభాన్ని, సామాజిక అసమతుల్యతను ఎదుర్కోవల్సి వస్తుంది. దీనికి పరిష్కార మార్గాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయాలన్న చొరవ పాలకుల నుండీ, ప్రైవేట్ రంగం నుండీ గోచరించటం లేదు. ఈ సమస్యకు సరైన నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం అత్యవసరం. కొన్ని కీలక పరిష్కారాలను ఇక్కడ సూచించవచ్చు. ప్రతిరంగంలో ఉద్యోగ సృష్టికి ఏఐ తో సహజీవనం, ఏఐని పూర్తిగా నిషేధించాల్సిన అవసరం లేదు. కానీ అది తీసుకొచ్చే ప్రమాదాలను గుర్తించి, కొత్త రకాల ఉద్యోగ అవకాశాలను రూపొందించాలి. డేటా మేనేజ్మెంట్, ఎథికల్ ఏఐ, మానవ అనుసంధానం వంటి రంగాల్లో శిక్షణలు ఇవ్వాలి. ప్రభుత్వ రంగాన్ని పునర్వ్యవస్థీకరించాలి. ఉద్యోగ నియామక ప్రక్రియలు వేగవంతం చేయాలి. ఖాళీలను నిబంధనలతో నింపాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. నిరుద్యోగ యువతకు నిరంతరం ధైర్యం ఇచ్చేవిధంగా ప్రభుత్వ రంగం ముందుకు రావాలి. ప్రైవేట్ రంగానికి నిబంధనలు విధించాలి. ఉద్యోగులు తొలగింపుల విషయంలో కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాలి. కర్మాగారాలు, సంస్థలు తమ సామాజిక బాధ్యతను గుర్తించాలి. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఆర్థిక మద్దతు లేదా స్వయం ఉపాధి యోజనల ద్వారా భరోసా కల్పించాలి. నవతరానికి సామాజిక భద్రత, పెన్షన్, ఆరోగ్యబీమా, విద్యా సహాయం వంటి రంగాల్లో యువతకు మద్దతు ఇవ్వడం ద్వారా వారి భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచాలి. ఈ మార్గాల్లో చర్యలు తీసుకోకపోతే రేపటి సమాజం ఘోరసంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. యువత మన దేశ భవిష్యత్తు, వారి భద్రత, అభివృద్ధిపై పెట్టే పెట్టుబడే నిజమైన జాతీయ పెట్టుబడి. కృత్రిమ మేధస్సుతో సమతుల్యంగా మానవమేధస్సును అభివృద్ధి చేయాలంటే, ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, సమాజం - మూడూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పాలకులు ప్రైవేటు ఉద్యోగాలు సృష్టించి ఇస్తామని చెప్పడమే కాకుండా ప్రభుత్వ రంగంలో కూడా ఉద్యోగాలు కల్పించవలసిన అవసరం ఉన్నది ఒక మాటలో చెప్పాలి అంటే పాలకులు పిసినారితనమును వదులుకోవలసిన అవసరము ఉన్నది. అదే సమయంలో ప్రైవేట్ రంగంలో కూడా నియంత్రణలో ఉంచుకొని నిరుద్యోగ సమస్యలేకుండా ఉద్యోగ కల్పన చూపించే బాధ్యత పాలకులపైఉన్నది. అది ఇప్పుడు స్పందించకుండా ఉంటే మన మనుగడకే ముప్పుగా మారుతుంది. కనుక పాలకులు జనాభా పెంచండి అని చెప్పడమే కాకుండా పెరిగిన జనాభాకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు ప్రవేటు రంగంతో పాటు ప్రభుత్వ రంగంలో ఇవ్వవలసిన బాధ్యత ఉన్నది. అప్పుడే పాలకులు చెప్పే మాటలు యువత ఆచరణలో చూపే అవకాశం ఉంటుంది. పాలకులు అలా చేయకుండా ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చిన యువత పాటించదు. దీనిని గమనంలోకి తీసుకోవలసిన ఆవశ్యకత పాలకులపై ఉన్నది. ఆ విధంగా పాలకులు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం. ●

అమరావతి వార్త

## ఉప్పలపాడు పీహెచ్‌సీను ఆకస్మిక తనిఖీ చేసిన పల్నాడుజిల్లా కలెక్టరు



**మాచర్ల, జూన్ 4 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలం ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టరు అరుణ్‌బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోజూ ఎంతమంది పేషెంట్లు వస్తున్నారు, వారికి అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ఉన్న ల్యాబ్‌లో అన్ని పరీక్షలు చేస్తున్నారా, సిబ్బంది సకాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారా వివరాలు సేకరించారు. రిజిస్టర్లు పరిశీలించారు. అదేవిధంగా హాజరు పట్టిక రిజిస్టరును పరిశీలించారు. ఈహెచ్‌ఆర్ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నారా, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు వెంట జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా॥ బి.వి.రవి, పీహెచ్‌సీ సిబ్బంది, వెల్దుర్తి ఎంపీడీఓ ప్రసాదు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.బాబునాయక్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్రస్థాయి యోగాంధ్ర

### పల్నాడుజిల్లా కలెక్టర్



**నరసరావుపేట, జూన్ 4 ప్రభాతవార్త :** యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా జూన్ 5వతేదీ గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలియజేశారు. కలెక్టరేట్ పేరేడ్ గ్రౌండ్స్‌లో ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. యోగాలో సుమారు 1000 మంది పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరౌతారన్నారు. యోగా వలన మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందన్నారు.

### వినుకొండలో

# విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం

**వినుకొండ, జూన్4, ప్రభాతవార్త:** ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు అని తెలిసినా మనుషులు క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నా చాలా మంది వీటి వినియోగం నుంచి దూరం కావడం లేదు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్ల వినియోగం వినుకొండ నియోజకవర్గంలో రోజు రోజుకు పెరిగిపోతూనే ఉంది. వాటర్ బాటిళ్ళు, పాలప్యాకెట్లు, కాఫీ, టీ కప్పులు, శుభకార్యాల్లో భోజనానికి ఉపయోగించే పేట్లు, గ్లాజులు ప్లాస్టిక్‌తో తయారైన వాటినే వినియోగించడం ఆందోళన కలిగిస్తోంది. చివరకు తినుబండారాలు పార్సిల్ చేసే కవర్లు కూడా ప్లాస్టిక్ కవర్లే కావడం పరిస్థితి తీవ్రతకు అద్ధం పడుతోంది. ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్లు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీనివల్లే వాటి వినియోగం పట్టణంలో విచ్చలవిడిగా పెరుగుతోందని అంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ భూమిలో



కలిసిపోవడానికి కొన్ని వందల ఏళ్ళు పడుతుంది. తద్వారా నేల కూడా కాలుష్యంగా మారి భూసారం కోల్పోతుందని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. ఫలితంగా పంటలు సక్రమంగా పండవని, కరువులు సంభవించే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో శుభకార్యాల్లో భోజనానికి అరటి ఆకులు వినియోగించేవారు. కూరగాయాలకు మార్కెట్‌కు వెళ్లేటప్పుడు చేతి సంచులు, వెదురుతో తయారు చేసిన బుట్టలు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగంతో లాభాల కన్నా నష్టాలే అధికమని వైద్యులు అంటున్నా చాలా మంది పెడచెవిన పెడుతున్నారు. 50,20 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లు అత్యంత ప్రమాదకరమని, పలుచగా ఉన్న ఈ కవర్ల దృఢత్వం కోసం అధిక మోతాదులో రసాయనాలు కలుపుతారని ఇవి చాలా హాని కలిగిస్తాయని, ముఖ్యంగా పిల్లల్లో జా ్ఞపకశక్తి తగ్గిపోవడం, పెద్దల్లో గుండె, నాడీ సంబంధిత వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని

**-వినియోగదారుల్లో కొరవడిన చైతన్యం**
**-ప్రాణాంతకమని తెలిసినా వీడని నిర్లక్ష్యం**
**-చర్యలు లేకే వ్యాపారుల ఇష్టారాజ్యం**
**-నిర్మూలనలో అధికారుల అలసత్వం**

హెచ్చరిస్తున్నారు. అరికట్టాలి ్సన బాధ్యత కలిగిన సంబంధిత అధికారులు మాత్రం మిన్నకుండిపోతున్నారు. నిషేధిత ప్లాస్టిక్ అమ్మినా, కొనుగోలు చేసినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరికలు చేస్తున్నా కొందరు వ్యాపారులకు ఇదేమీ పట్టడం లేదు. మరోవైపు అధికారులు తూతూ మంత్రంగా ఒకటో, రెండో దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి మమ అనిపిస్తుండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయాలు జరుపుతున్నారు. వినుకొండ మున్సిపల్ పరిధితోపాటు మండలాల పరిధిలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఉన్నా నిర్మూలనలో అధికారులు తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. వీటి వినియోగం వల్ల కలిగే దుష్ర్పభావాలపై ప్రజలను చైతన్యం చేయడంతోపాటు, చట్టాన్ని ఉల్లఘిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకొని నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత వరకు అరికట్టే బాధ్యత అధికారులపై ఎంతో కలదు.

# విజనరీ లీడర్ మక్కెన

**వినుకొండ, జూన్4, ప్రభాతవార్త:** మక్కెన మల్లికార్జునరావు ఆ పేరు వింటేనే పల్నాడు, వినుకొండ ప్రాంత ప్రజలు పులకించిపోతారు. ఆ పేరులోనే పవర్ ఉంది. పదవులకు వన్నె తేవటంతోపాటు అన్ని వర్గాల ప్రజల్లో పార్టీ పరపతి పెంచటమే లక్ష్యంగా పని చేసే విజనరీ లీడర్. గత సార్వత్రిక ఎన్నికల్లో వినుకొండ నియోజకవర్గంలో వైకాపా నేతలు పెట్టిన ఇబ్బందులు, సృష్టించిన సమస్యలను ఎదురొడ్డి పోరాడిన మొండి ఘటం మక్కెన. అధికారంలో ఉన్నా లేకున్నా ఆయన కోసం ప్రాణాలు తీసుకునే నాయకులు, కార్యకర్తలు, అభిమానలు ఉన్నారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయాల్లో

### నిజాయితీ, నిబద్ధతే ఆయన ఆయుధం

### సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, చీఫ్‌విప్ జీవీ అండతో అడుగులు

### నేడు జీడీసీసీబి ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం



కొత్తగా పరిచయం అక్కర్లేని మక్కెన గ్రామ స్థాయి రాజకీయాలు నుండి అంచెలంచెలుగా ఎదిగి సర్పంచ్, ఎంపిపి, జెడ్పిటిసి, ఎమ్మెల్యే వంటి పదవులు చేపట్టి ప్రజలకు సేవలందించారు. ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చేలా పని చేశారు. 2024లో వైకాపా నిరంకుశ పాలనను ధిక్కరించిన మక్కెన వినుకొండ ప్రాంత అభివృద్ధే ముఖ్యమని భావించి ప్రజలు, అభిమానులు, కార్యకర్తల ఆకాంక్ష మేరకు తెదేపాలో చేరారు. వినుకొండ నియోజకవర్గంలో అన్ని వర్గాలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చి వైకాపాను భూస్థాపితం చేయడంలో కీలకంగా మారారు.



వినుకొండ రాజకీయాల్లో ఎంతో క్రియాశీలంగా వ్యవహరించి తెదేపా విజయానికి ఎంతగానో తోట్పడ్డారు. నమ్ముకున్నవారికి అండగా ఉండటం, ప్రజలకు మేలు చేయాలనే తాపత్రయంతో పని చేసే మక్కెనకు తెదేపా అధిష్టానం జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ పదవి అందించడం పట్ల ప్రజలు ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌కు, ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు చెబుతున్నారు.

**సత్తా ఉన్న నాయకుడు.......** వినుకొండ నియోజకవర్గ రాజకీయాల్లో అపర చాణిక్యుడిగా, పవర్‌ఫుల్ పొలిటికల్ లీడర్‌గా పేరు తెచ్చుకున్న మక్కెనకు ఏదైనా సమస్య చెవిలో వేస్తే చిటికలో ఆ సమస్య పరిష్కరించే సత్తా ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలంతా ఆనందపడే విధంగా రైతులకు అన్ని విధాలుగా మేలు జరిగే విధంగా ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా జీడీసీసీబి ఛైర్మన్ బాధ్యతలు నిర్వహించి పదవికి వన్నె తెస్తారని పల్నాడు, వినుకొండ ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## యోగాంధ్రలో సభ్యుల పేర్ల నమోదును వేగవంతం చేయాలి : బాపట్ల జిల్లా కలెక్టర్

**బాపట్ల, జూన్4, ప్రభాతవార్త:** యోగాంధ్రలో సభ్యుల పేర్ల నమోదును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు మరియు ఎంపీడీవోలతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా నుండి 6 లక్షల 31 వేల 435 మంది సభ్యులను నమోదు చేయుటకు లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందన్నారు. దినిలో భాగంగా ఇప్పటివరకు 5 లక్షల 55 వేల 218 మంది సభ్యుల పేర్లను నమోదు చేశారన్నారు. మిగిలిన సభ్యులను నమోదు చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.



మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయుటలో వెనుకబడిన మండల ఎంపీడీవోల పై ఆయన ఆగ్రహం వ్యక్తపరిచారు. ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయనిచో వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. యోగ గురువులకు సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను నమోదు చేయడమైనదని ఆయన తెలిపారు. యోగాంధ్రలో నమోదు చేసిన సభ్యులను యోగా గురువులతో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంపీడీవోలను ఆదేశించారు. జిల్లాలోని గ్రామ మరియు వార్డు సచివాలయ పరిధిలో యోగా శిక్షణకు మూడు ప్రాంతాలను నిర్దేశించి వాటి వివరాలను యాప్ లో నమోదు చేయాలన్నారు. ఒక్కొక్క చోట ఇద్దరు సచివాలయ సిబ్బంది, ఒక యోగ గురువుచే శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆయన తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో యోగ పై వివిధ పోటీలను నిర్వహించి ఆ వివరాలను రోజు యోగ యాప్ లో నిక్షిప్తం చేయాలని ఆయన ఎంపీడీవోలకు సూచించారు. యోగాంధ్ర లో సభ్యుల నమోదు ప్రక్రియలో వచ్చేటటువంటి సాంకేతిక సమస్యలను పరిష్కరించడానికి యోగ గ్రూప్ ని తయారు చేయాలని, యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాల పురోగతిపై పర్యవేక్షణ చేయాలని పిడి డిఆర్డిఏ కు ఆయన సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు యోగాంధ్రలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయుటలో సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో ప్రతి గ్రామంలో నూరు శాతం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోనికి తీసుకురావాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామంలో చెత్తను డోర్ మిత్ర, క్లాప్ మిత్ర సభ్యులచే ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని ఆయన తెలిపారు. సేకరించిన చెత్తను రెండు భాగాలుగా విడగొట్టి వాటిని ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రాలకు తరలించాలని ఆయన తెలిపారు. గ్రామాలలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయడానికి వీలు లేదని, అట్లు చేసిన యెడల వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆయన తెలిపారు. చెత్తను వేయటానికి బక్కెట్లు లేని ఇళ్లను గుర్తించి ప్రతి ఇంటికి రెండు బకెట్లను అందజేయాలని, ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రాలు లేనటువంటి గ్రామాలను గుర్తించి వాటి వివరాలను సేకరించి నివేదిక తయారు చేయాలని, ఎస్ డబ్ల్యూ పిసి లకు స్థల సేకరణ పై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, బాపట్ల డి.ఎల్.డి.ఓ విజయలక్ష్మీ వీక్షణ సమావేశం ద్వారా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈ. ఓ. పి ఆర్ డి లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు సాధనే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలి : మేయర్, కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్, జూన్4, ప్రభాతవార్త:** క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు సాధనే ధ్యేయంగా నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాల పై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, కార్పొరేటర్లు, నోడల్ అధికారులతో సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా గుంటూరు నగరంలో వార్డుల వారీగా కార్పోరేటర్లకు మొక్కలు, గుడ్డ సంచులను జియంసి నుండి అందించుట జరుగుతుందన్నారు. ఆయా వార్డులలో కార్పోరేటర్ల ఆద్వర్యంలో స్థానిక ప్రజలు, విద్యార్థులను భాగస్వాములను చేసుకుంటూ మొక్కలు నాటటం, గుడ్డ సంచులు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్పోరేటర్ల భాగస్వామ్యం



పెరగాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో ఈ సీజన్ కి 5 లక్షల మొక్కలు నాటేలా వార్డు సచివాలయాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. అలాగే ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ధరకు గుడ్డ సంచులను అందించేలా గాంధీ పార్కు మరియు యన్.టి.ఆర్ స్టేడియం దగ్గర వెండింగ్ మెషిన్లను అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే 1 కేజీ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇస్తే గాంధీ పార్కు ఎంట్రీ టికెట్ అందించుట జరుగుతున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా గురువారం ఉదయం స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి దగ్గర నుండి హిమని సెంటర్ వరకు మాస్ క్లీనింగ్ చేస్తూ, పర్యావరణ పరిరక్షణ పై అవగాహనా ర్యాలీ జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాదాన్యతనిస్తున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వం, అధికారులదే కాదని, ప్రజల భాగస్వామ్యం ఉంటేనే విజయవంతం అవుతుందన్నారు. నిత్య జీవితంలో మమేకమౌతున్న నిషేదిత ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి డివిజన్ కు అందించే మొక్కలను సక్రమంగా ప్రజలు సంరక్షించేలా అవగాహన కలిగించాలన్నారు. సదరు సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఎస్.ఈ నాగామల్లేస్వర రావు, సి.యం.ఓ.హెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, బి. శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య, సి.హెచ్ శ్రీనివాస్, యం.హెచ్.ఓ డాక్టర్ రవిబాబు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్‌సి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి : డిఈవో సి.వి.రేణుక

**గుంటూరు విద్య, జూన్ 4, ప్రభాతవార్త :** మెగా డిఎస్‌సి 2025కి అన్ని రకాల ఏరా ్పట్లు చేసినట్లు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 14పరీక్షా కేంద్రాల్లో జూన్ 6నుంచి 30వ తేది వరకు ఉదయం 9.30నుంచి 12.00గంటల వరకు మధ్యాహ్నం 2.30నుంచి 5.00గంటల వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర ్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ అధికారులను, ఫ్లైయింగ్ సా ్క్వడ్ లను, హెల్ప్‌డెస్క్, డిస్‌ప్లే ఆఫ్ సైన్ బోర్డ్సు ఏర్పాటు చేసినట్లు, అవసరమైన వారికి స్రై ్కబ్‌లను ఏర్పాటు చేసినట్లు, కాబట్టి డిఎస్‌సి అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం, సాయంత్రం తమ షెడ్యూల్డ్ ప్రకారం గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకొని ప్రశాంతంగా పరీక్ష రాయాలని, ఒక్క నిమిషం ఆలస్యమైన అభ్యర్థులు పరీక్షలకు అనుమతించబడరని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

## యస్‌పి బాల సుబ్రహ్మణ్యం చిరస్మరనీయుడని : మేయర్ రవీంద్ర

**గుంటూరుతూర్పు, జూన్4, ప్రభాతవార్త:** ఎంతోమంది ప్రజల అభిమానం పొందిన గాన గంధర్వుడు స్వర్గీయ యస్.పి బాల సుబ్రహ్మణ్యం చిరస్మరనీయుడని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు.



బుధవారం ఆయన 79వ జయంతిని పురస్కరించుకొని నాజ్ సెంటర్ సర్కిల్ నందు గల ఆయన విగ్రహ వద్ద కళాదర్బార్ వారి ఆధ్వరంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకలలో పాల్గొని ఆయని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, స్వర్గీయ యస్.పి బాల సుబ్రహ్మణ్యం తెలుగువాడిగా పుట్టటం మన అదృష్టం అన్నారు. వారి గాన మాధుర్యంతో ఎంతో మంది ప్రజల అభిమానాన్ని పొందారని, అటువంటి వారి స్మృతులు ప్రజలు ఎప్పటికి మర్చిపోకూడదన్నారు. యస్.పి బాల సుబ్రమణ్యం భారత దేశంలోని అన్ని భాషలలో పాటలు పాడారని, ఏ భాషలో పాట పాడినా ఆ బాషకు చెందిన వ్యక్తిగా పాడేవారన్నారు. ముఖ్యంగా ఆయన తెలుగు వారగుట మనం అందరం గర్వించదగ్గ విషయం అన్నారు. తెలుగు ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన బాల సుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేసినందుకు కళాదర్బార్ అధ్యక్షలు పొత్తూరు రంగారావుని అభినందిస్తున్నామని తెలియచేశారు. పొత్తూరు రంగారావు ఇప్పటికే నాజ్ సెంటర్ సర్కిల్ లో మహానటి సావిత్రి, ఘంటసాల వంటి మహానుభావుల విగ్రహాలను ఏర్పాటు చేశారని, ఈ విగ్రహాలు ఏర్పాటు చేయడమే ఆయనకు కళలపై ఎంతమక్కువ ఉన్నది అర్థమౌతుందన్నారు. త్వరలో యన్.టి.ఆర్ స్టేడియంలో యస్.పి బాలసుబ్రమణ్యం పాటలకచేరిని ప్రముఖ గాయనీ గాయకుల చేత ఏర్పాటు చేయటకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కళాదర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు, సభ్యులు ఇక్కుర్తి భాను ప్రకాష్, వేణుగోపాల్, బాబురావు, అబ్దుల్ ఖాదర్, నరసింహారావు, రాధా రాణి, అన్నపూర్ణ సత్తార్, ఇతర గాయనీ, గాయకులూ, అభిమానులు పాల్గొన్నారు.

## ఫాబ్రిక్స్ ఇన్, ప్లాస్టిక్ అవుట్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలి : విజయవాడ కమిషనర్

**విజయవాడ కార్పొరేషన్, జూన్ 4, ప్రభాతవార్త :** ప్లాస్టిక్ సేకరణ కోసం ఫ్యాబ్రిక్ ఇన్-ప్లాస్టిక్ అవుట్ స్టాల్స్‌ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం శాఖాధిపతులతో ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ లోని మూడు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్లాస్టిక్ సేకరణ కోసం స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించగా, అధికారులు 7 ప్రదేశాలలో ఏర్పాటు చేస్తున్నారని, కనకదుర్గమ్మ గుడి, పూల మార్కెట్, కాళేశ్వరరావు మార్కెట్, విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్, సాంబమూర్తి రోడ్ రైతుబజార్, పటమట రైతు బజార్ వద్ద స్టాల్స్‌ని ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను



నియోజక వర్గాల్లో జరిగే అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాన అంశం ప్లాస్టిక్ నిర్యూలన అని, దానికనుగుణంగా ప్రజల నుండి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రజలకు క్లాత్ బ్యాగులు ఇవ్వాలని, ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాల గురించి వారికి తెలియచేసే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని, కాలుష్యాన్ని తగ్గించే విధంగా మొక్కలు నాటే సేకరించి గుడ్డ సంచులను ప్రజలకు అందిస్తారని తెలిపారు. పశ్చిమ నియోజక వర్గంలో హెచ్‌బి కాలనీ కరెంట్ ఆఫీస్, పాయకాపురం చెరువు, లయోలా కళాశాల రోడ్డు వద్ద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రజలు ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు విస్తృతంగా చైతన్యపర్చే విధంగా ఏర్పాటు చేస్తున్నారని, ప్రజలు కూడ ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నేడు ఏపి ఎడ్‌సెట్ పరీక్ష

**-ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య ఏవివిఎస్ స్వామి**
**-ఒక నిమిషం నిబంధన అమల్లో ఉంది**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్ 4, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా 2025-26విద్యా సంవత్సరంలో బిఈడి కోర్సుల్లో ప్రవేశాల కొరకు నిర్వహించే ఏపి ఎడ్‌సెట్-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బెస్డ్ టెస్టుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పర్యావరణ విభాగం ప్రొఫెసర్, ఏపి ఎడ్‌సెట్ - 2025 కన్వీనర్ ఆచార్య ఏవివిఎస్ స్వామి తెలిపారు. ఎడ్‌సెట్ ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టుకు మొత్తం 17,795మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నట్లు వెల ్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 87పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2నుంచి 4గంటల మధ్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తమకు కేటాయించిన సెంటర్ మధ్యాహ్నం 12.30నుంచి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగు తుందని, ఒక నిమిషం నిబంధన అమల్లో ఉంటుందని వివరించారు. హాల్ టిక్కెట్‌తోపాటు, ఆధార్ కార్డ్ , పాన్ కార్డ్ , పాన్ పోర్ట్ , ఓటర్ ఐడెంటికార్ ్డ, డ్రైవింగ్ లైసెన్స్, ఏదైనా ప్రభుత్వ గుర్తింపుకార్డు, బ్లూ లేదా బ్లాక్ పెన్ తమవెంట కలిగి ఉండాలన్నారు. ఏపి ఎడ్‌సెట్ ను అత్యంత సమర్థవంతంగా నిర్వహించడానికి పలు విశ్వవిద్యాలయాలకు చెందిన సీనియర్ అధ్యాపకులను కో-ఆర్డినేటర్లుగా నియమించినట్లు తెలిపారు.

## భూముల రీసర్వేను పరిశీలించిన పల్నాడుజిల్లా కలెక్టరు

**మాచర్ల, జూన్ 4 ప్రభాతవార్త:** మాచర్ల మండలంలో బుధవారం పల్నాడు జిల్లా కలెక్టరు పి.అరుణ్‌బాబు రాయవరం గ్రామం వద్ద



జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వే ప్రక్రియలో అవకతవకలు లేకుండా, రైతుల సమస్యలు పరిష్కరించేలా రైతుల సమక్షంలో నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అక్కడి రైతులతో మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉన్నాయా, ఏయే పంటలు వేస్తున్నారు, ఎంత ఆదాయం వస్తుంది వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారి మధుకీర్తి, మాచర్ల తహాశీల్దారు కిరణ్‌కుమార్, విలేజ్ సర్వేయరు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలోనే నవశకానికి నాంది : గుంటూరు తూర్పుఎమ్మెల్యే నసీర్

**గుంటూరుతూర్పు, జూన్4,ప్రభాతవార్త :** ఏడాది కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కి కొత్త పునాదులు వేశామని, ఇది ప్రజల ఆశీర్వాదంతోనే సాధ్యమైందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే



మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని రత్నపురి కాలనీ, మల్లికార్జునపేట, శారదా కాలనీ ప్రాంతాలలో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. ఉదయాన్నే స్థానిక ప్రజలతో మాట్లాడి ఆయా ప్రాంతాలలో ప్రభుత్వపరంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. రేషన్ కార్డులు, మంచినీటి సరఫరా, పెన్షన్లు, రోడ్లు, శానిటేషన్ వంటి సేవలపై లబ్ధిదారులతో మాట్లాడారు. ఎవరికి ఎలాంటి సర్వీసు అందకపోయినా తనను నేరుగా సంప్రదించవచ్చని ప్రజలకు సూచించారు. అనంతరం శానిటేషన్ కు సంబంధించి మురుగునీటి వ్యవస్థ ఇంకా మెరుగుపడాలని అధికారులకు సూచించారు. ఎక్కడ వీధులలోగానీ, ఇంటి పరిసరాలలోగానీ చెత్త కనిపించకుండా చూడాలని, దీనిపై ప్రజలను చైతన్యవంతం చేయాలని చెప్పారు. ఏడాది పాలనలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అనూహ్య మైన మార్పులకు నాంది పలికామని, దీనికి గర్వంగా ఉందని అన్నారు. గతంలో గుంటూరు తూర్పు నియోజకవర్గమంటే వెనకబడిన ప్రాంతంగా చూసేవారని, ఐదేళ్లపాడు ప్రజలు తీవ్రంగా విసిగిపోయారని తెలిపారు. తాము అధికారం చేపట్టిన వెంటనే ప్రణాళికాబద్ధంగా రోడ్లు, సీసీ డ్రైన్లు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ముందడుగు వేశామని తెలిపారు. ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోనే నవశకానికి నాంది పలికిందని చెప్పారు. పారిశ్రామికంగా, అభివృద్ధి పరంగా, సంక్షేమ పరంగా ఆదర్శవంతమైన నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహంకాళి నరసింహారావు, ఫతాన్ బాజీ, గిరిబాబు, మోహన్, బాబురావు, దయా రత్నం, కోటా పిచ్చిరెడ్డి, జమీర్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టరు

**మాచర్ల, జూన్ 4 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టరు అరుణ్‌బాబు బుధవారం ఆకస్మిక



తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పీజీఆర్ఎస్‌పై వచ్చిన అర్జీలు ఎన్ని వాటిని సకాలంలో పరిష్కరిస్తున్నారా, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా కలెక్టరును కలిసి వారికి ప్రధాన మంత్రి కిసాన్ డబ్బులు ఇంకా రాలేదని తెలిపారు. సదరు విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావడం జరుగుతుందని కలెక్టరుకు తెలిపారు. వాటర్ వర్క్స్ విషయాలపై తగు చర్యలు తీసుకోవాలనిఎంపిడిఓ సంబంధిత సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి ఎంపిడిఓ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, వెల్దుర్తి తహశీల్దారు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు పలు దేవతామూర్తుల ప్రతిష్ట మహోత్సవం

**యడ్లపాడు, జూన్ 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో పలు దేవతా విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం గురువారం నిర్వహించనున్నారు. గ్రామంలోని బీసీ కాలనీ సమీపంలో సిద్ది వినాయకుడు, అభయాంజనేయ స్వామి గుడులు, అలాగే గ్రామ నడిబొడ్డున గ్రామదేవత సీతాలంబ విగ్రహ ప్రతిష్టకు అంతా సిద్దంచేశారు. ఈ మహోత్సవాన్ని అలయ అర్చక స్వాములు కె చంద్రశేఖరశర్మ, సాయిసుబ్రహ్మణ్య రాఘవశర్మ, ఆధ్వర్యంలో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు కొండకావూరి అయ్యప్ప



గురుకుల్, కొండకావూరి సీతారామ ప్రసాదశర్మ పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. మంగళవారం నుండే గ్రామంలో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. గురువారం ఉదయం 8.49కి ప్రధాన ప్రతిష్ట మహోత్సవం ఉంటుందని, అనంతరం విచ్చేసిన భక్తులకు భారీ అన్న ప్రసాద వితరణ నిర్వహించుటకు జరుగుతుందని, కావున పెద్ద ఎత్తున భక్తులు హాజరు అయ్యి ఈ మహోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించవల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలి

## -మండల విద్యాశాఖాధికారి ఆర్.చలపతిరావు

**పొన్నూరు, జూన్ 4,ప్రభాతవార్త:** పాఠశాలలు ప్రారంభం కాగానే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని,



విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం రుచిగా, శుచిగా, శుభ్రంగా, వేడి వేడిగా వడ్డించాలని మండల విద్యాశాఖాధికారి ఆర్.చలపతిరావు ఆదేశించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో బుధవారం కుక్, హెల్పర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం తప్పని సరిగా ఆహారపదార్ధాలను రుచిగా తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత కుక్, హెల్పర్లపై ఉందన్నారు. పిల్లలు ఇష్టపడేవిధంగా ఆహారపదార్ధాలను తయారు చేసి అందించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో నోడల్ ప్రధానోపాధ్యాయుడు వైవిస్ సాయి మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.వివిధ విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కుక్, హెల్పర్లకు అందజేశారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# 6నుంచి ఉపాధి పనుల క్షేత్రస్థాయి తనిఖీలు ప్రారంభం

**యడ్లపాడు, జూన్ 4, ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహించిన పనులను క్షేత్రస్థాయి పరిశీలనకు సామాజిక తనిఖీ బృందం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం స్టేట్ రిసోర్స్ పర్సన్ అవులయ్య వివరిస్తూ



2024/25ఆర్థిక సంవత్సరంలో మండలంలోని వివిధ గ్రామాలలో 9.40కోట్ల వ్యయంతో నిర్వహించిన 1122ఉపాధి పనులను ఈ నెల 6వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో తనిఖీల కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పంట కాలువలు, మైనర్ ఇరిగేషన్ కాలువలు, పండ్ల తోటలు, సీసీ రోడ్లు, సచివాలయ భవనాలు, మెటల్ రోడ్లు, పేదలకు నిర్మించిన ఇళ్లు, పశువుల షెడ్‌లు, తదితర ఉపాధి పనుల సామాజిక తనిఖీలకు ముగ్గురు డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్‌లు, తనిఖీలకు గ్రామ స్థాయి సామాజిక తనిఖీల బృందం 20మంది పాల్గొంటారన్నారు. ఈ నెల 1నుండి తనిఖీల బృందానికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గురువారం అన్ని శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు. తనిఖీల అనంతరం గ్రామ, మండల స్థాయిలో సభలు నిర్వహించి పనులు వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

# ఔత్సాహికులు ముందుకు రావాలి

## -జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్

**పొన్నూరు, జూన్ 4,ప్రభాతవార్త:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎ.విజయలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పరిశ్రమలు స్థాపించిన వారికి, స్థాపించాలనుకునేవారికి అవగాహనా





సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఔత్సాహికులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించిన పూర్తి వివరాలను ఔత్సాహికులకు తెలియజేశారు. ఔత్సాహికుల సందేహాలను నివృత్తిచేశారు. అవగాహనా సదస్సులు సుమారు 90మంది పాల్గొన్నారు. సందేహాలు ఏమైనా ఉన్నట్లయితే పరిశ్రమల అధికారి శ్రీనివాస్ సెల్ నెం.9966549759 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మణికుమారి, పరిశ్రమల ప్రోత్సాహక అధికారి మత్తి శ్రీనివాసరావు,ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఎపిఎం జోయిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం ఫౌండేషన్ సేవలు అద్భుతం

## - కురగల్లులో కంప్యూటర్, టైలరింగ్, ట్యూషన్ సెంటర్ల ప్రారంభం

**మంగళగిరి, జూన్ 4 ప్రభాతవార్త :** చెన్నై లోని ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, వారికి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సేవలు అద్భుతమని తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహా కొనియాడారు. ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజధాని గ్రామం కురగల్లులో బుధవారం ఉచిత కంప్యూటర్, టైలరింగ్, ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వర్శిటీ ప్రో-ఛాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్‌తో కలిసి బుధవారం సబ్ కలెక్టర్ సంజనాసింహ ఈ



సెంటర్లను ప్రారంభించారు. మహిళలతో ముచ్చటించారు. ట్యూషన్ చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరావతిలో అతిపెద్ద విద్యా సంస్థగా ఎస్ఆర్ఎం వేలాది మంది విద్యార్థులకు విజ్ఞాన జ్యోతులను వెలిగిస్తుందన్నారు. విద్యా సంస్థలు కూడా సామాజ సేవకు ముందుకు వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా సేవలు అందించడం ఆనందంగా ఉందన్నారు. నేటి ఆధునిక జీవనంలో మహిళలకు డిజిటల్ అక్షరాస్యత అత్యంత ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్‌పై కనీస పరిజ్ఞానంను పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్ఆర్ఎం వర్శిటీ ఆ దిశగా గ్రామంలోనే నిపుణులతో ఉచితంగా అందిస్తున్న కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని, అందుకోసం స్వయం ఉపాధి కోర్సులను అందిపుచ్చుకోవాలనే లక్ష్యంతోనే గ్రామీణ ప్రాంతాల్లో టైలరింగ్, కంప్యూటర్ శిక్షణ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఆర్ఎం వర్శిటీ ప్రో-వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఉన్నత చదువులతోని విజయ సోపనాల అధిరోహణ సాధ్యమన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉచిత సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి డీ వీ వెంకటగిరి తెలిపారు. చెన్నై, అమరావతితో పాటు ఢిల్లీలోనూ ఈ ఉచిత సేవా సెంటర్లను నడుపుతున్నట్లు చెప్పారు. అమరావతి ప్రాంతంలో ఇప్పటికే మూడు సెంటర్ల ద్వారా ఉచిత సేవా కార్యక్రమాలను ప్రారంభించామని, త్వరలోనే మరిన్ని విస్తరిస్తామన్నారు. మారుమూల పల్లెకు వచ్చి ఉచితంగా ఉపాధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎస్ఆర్ఎం వర్శిటీ సేవలు ఎన్నటికి మరచిపోలేమని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి కొనియాడారు. మహిళలతో పాటు యువత కూడా ఈ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు రామారావు పిలుపునిచ్చారు. గ్రామస్తులు తరుపున వర్శిటీ ప్రో-ఛాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్, ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ వెంకటగిరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సంజనా సింహ ఎస్ఆర్ఎం ట్యూషన్ సెంటర్ల టీచర్లు ప్రతిపాటి సుష్మ, పుణ్యవాణి కొండూరు భారతి ప్రమీల, ధన కుమారి లను వేదికపైకి ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు అనంతరం ఎస్ఆర్ఎం ఫౌండేషన్ పనితీరును వివరించే న్యూస్ లెటర్ ను సబ్ కలెక్టర్ సంజన వేదికపై ఆవిష్కరించారు ఫౌండేషన్ కార్యదర్శి వెంకటగిరి ఆచార్య సతీష్ లు సంయుక్తంగా సబ్ కలెక్టర్ కు జ్ఞాపి ప్రధానం చేశారు ఈ సందర్భంగా కురగల్లు ట్యూషన్ సెంటర్ విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు ఇతర ఇతర స్టేషనరీని పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అడిషనల్ రిజిస్టర్ డాక్టర్ వినాయక, డైరెక్టర్లు అనూప్ సింగ్, రేవతి బాలకృష్ణ సిద్ధార్థ త్రిపాఠిలతో పాటు మీడియా మేనేజర్ వేణుగోపాల్ గంగిశెట్టి పాల్గొన్నారు.

# ప్రాధమిక ధశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నివారించవచ్చు

**యడ్లపాడు, జూన్ 4, ప్రభాతవార్త :** ప్రపంచ వ్యాప్తంగా రెండవ ప్రధాన మరణ కారకంగా నిలుస్తోందని, ప్రతి సంవత్సరం 10మిలియన్ల



మంది క్యాన్సర్ కారణంగా చనిపోతున్నారని, అయితే ముందుస్తు స్క్రీనింగ్, తగిన చికిత్స ద్వారా మూడింట ఒక వంతు మరణాలను అరికట్టే అవకాశం ఉందని, క్యాన్సర్ ఎక్కువగా శ్వాస కోశాలు, ఊపరితిత్తులు, రొమ్ము, గర్భాశయం, చర్మం, జీర్ణానాళ వ్యవస్థలు వంటి అవయవాలను ప్రభావితం చేస్తుదని నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ నిర్వాహకురాలు నరేంద్ర సువర్ణకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం ఎస్సీకాలనీలో క్యాన్సర్ వ్యాధిపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, రాకకుగల కారణాలు, నివారణ మార్గాలు, వైద్య పరీక్షల ప్రాముఖ్యతపై వివరించారు. ఈ సందర్భంగా వివరిస్తూ దీర్ఘకాలంగా తగ్గని పుండ్లు, కురుపులు, పుట్టుమచ్చలలో మార్పులు, పోడిదగ్గు, అజీర్ణం, అజ్ఞాత రక్తస్రావాలు వంటివి క్యాన్సర్ లక్షణాలుగా గుర్తించాలన్నారు. మేమోగ్రఫీ, అల్ట్రాసౌండ్ , బయాప్సి వంటి పద్ధతులు ప్రాధమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పౌండేషన్ ఉపాధ్యక్షుడు వై ప్రసాదరావు, డీఈవో ఎం సాంప్రనీత్, ఏఎన్ఎమ్ నాగమణి, అశా కార్యకర్తలు, మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాలువల ఆక్రమణ చట్టరీత్యా నేరం

## -తహశీల్దార్ శ్రీనివాసశర్మ

**పొన్నూరు, జూన్ 4,ప్రభాతవార్త:** ప్రభుత్వ స్థలాలను, ప్రభుత్వ కాల్వలను ఆక్రమించుకోవడం



చట్ట రీత్యా నేరమని చేబ్రోలు తహశీల్దార్ శ్రీనివాసశర్మ హెచ్చరించారు. చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి గ్రామంలోని అప్పాపురం కాల్వ మీద ఇరిగేషన్ కాల్వ ఆక్రమించుకొని గృహాలు నిర్మించుకున్నవారి వివరాలను సేకరించారు. కాలువలు ఆక్రమించుకొని గృహాలు నిర్మించుకోవడం ద్వారా అనేక నష్టాలున్నా యన్నారు. ఆక్రమణదారులకు గతంలోనే ఇంటి స్థల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. కాల్వకట్టపై ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారు తక్షణమే ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. ప్రభుత్వంవారు ఇచ్చిన స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేసుకొని అక్కడే జీవనం సాగించాలని అధికారులు వారికి సూచించారు. తహశీల్దార్ వెంట ఎస్సై వెంకట కృష్ణతోపాటు ఇగిరేషన్, ఎలక్ట్రికల్, పంచాయితీ రాజ్‌శాఖాధికారులు, గృహనిర్మాణశాఖాధికారులు ఉన్నారు.

# వెన్నుపోటు పొడిచింది మాజీమంత్రి విడదల రజిని కాదా?

## తెదేపా రాష్ట్ర మైనారిటి సెల్ ప్రధాన కార్యదర్శి బేరింగ్ మౌలాలి

**చిలకలూరిపేట, జూన్4,ప్రభాతవార్త:** వెన్నుపోటు అనేది మొట్టమొదట కనిపెట్టింది మాజీమంత్రి విడదల రజిని కాదా అని టిడిపి రాష్ట్ర మైనారిటిసెల్ ప్రధాన కార్యదర్శి బేరింగ్ మౌలాలి ప్రశ్నించారు. బుధవారం వైసిపి చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో మాజీమంత్రి రజిని వ్యాఖ్యలపై స్పందించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆనాడు చంద్రబాబు నాయుడుకు, ప్రత్తిపాటి పుల్లారావుకు, చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు, వెన్నుపోటు పొడిచింది విడదల రజినినే అని బేరింగ్ మౌలాలి మండిపడ్డారు. రజనీ పెట్టిన మొక్క గంగాభవాని లక్షల్లో కుంభకోణం చేస్తే దానికి 15 కుటుంబాలు బలి అయ్యాయని అన్నారు. ఆ కుటుంబాలకు వెన్నుపోటు పొడిచింది మాజీమంత్రి రజిని కాదా అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు మాజీమంత్రి సమాధానం చెప్పాలని మౌలాలి డిమాండ్ చేశారు.



# దాడి సంఘటనలపై కేసులు నమోదు

**యడ్లపాడు, జూన్ 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జాలాది, లింగారావుపాలెం గ్రామాలలో జరిగిన దాడి సంఘటలపై కేసులు నమోదు చేయటం జరిగిందని ఎస్సై టి శివరామకృష్ణతెలిపారు. అయన వివరిస్తూ జాలాది గ్రామానికి చెందిన పిల్లి ద్వారకరావు అతని కుమారుడు పై ఈ నెల ఒకటవ తేదిన గ్రామానికి చెందిన క్రిమిలింగ్ మరియు అతని కుమారుడు దాడికి పాల్పడ్డారని, ఈ దాడిలో బాదితుడికి తలపై గాయాలు కాగా చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా అసుపత్రికి వెళ్ళి చికిత్స పొందిన అనంతరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేయటంతో వారి ఫిర్యాదు అధారంగా కేసును నమోదు చేసి దర్యాప్తు నిర్వహించుతున్నామన్నారు. అదేవిధంగా లింగారావుపాలెం గ్రామంలోని గంగమ్మ తల్లి దేవాలయంలో ఈనెల 2వ తేది కొంతమంది వ్యక్తులు దేవాయలంలో ఉన్న సీసీటీవీ కెమెరాలను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసి అవిషయమై వారిని ప్రశ్నించగా వారు ప్రశ్నించిన వ్యక్తిపై దాడికి పాల్పడటంతో వారు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారి ఫిర్యాదు అదారంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునామన్నారు.

# కార్మికుల పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలి

## -యూనియన్ గౌరవాధ్యక్షుడు నిమ్మకూరి రమేష్‌బాబు

**పొన్నూరు, జూన్ 4,ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించి పెండింగ్ జీతాలను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు నిమ్మకూరి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక మండల



విద్యాశాఖాధికారి వారి కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో రమేష్‌బాబు మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని, కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని, నెల నెల బిల్లులు జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మెలో మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులందరూ పాల్గొనాలని రమేష్‌బాబు కార్మికులను కోరారు. ఉద్యమాల ద్వారానే హక్కులను సాధించుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో తక్షణమే స్పందించాలనికోరారు. కార్యక్రంలో అధ్యక్ష, కార్యదర్శులు సుమతి,కృష్ణకుమారి, కార్మికులు పాల్గొన్నారు.

# నేటి నుండి శ్రీగోదా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు

**గుంటూరు కల్చరల్, జూన్ 4,ప్రభాతవార్త :** స్థానిక కృష్ణనగర్ 1వ లైనులోని శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ధనకుదరం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జూన్ 5నుంచి 9వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు బుధవారం ఆలయ ప్రాంగణంలోని జరిగిన సమావేశంలో తెలిపారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకొని భక్తులు విశేషంగా పాల్గొని స్వామి, అమ్మవార్ల సేవకు పాత్రులు కావాలని కోరారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక కార్యక్రమాల్లో గురువారం ఉదయం అష్టోత్తర శత కలశాభిషేకం, అంకురారోపణ, శుక్రవారం ధ్వజారోహణం, నిత్యహోమం, శనివారం ఉదయం శ్రీగోదా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణమహోత్సవం, సాయంత్రం లక్ష మల్లెల, తులసీ దళార్చన, ఆదివారం నిత్యపూజలు శ్రీవారి రథోత్సవం, రాత్రి శ్రీ లక్ష్మీనారసింహా-ఆంజనేయ హవనం ,సోమవారం సుదర్శన మూలమంత్ర హోమాలు, మహాపూర్ణాహుతి, వసంతోత్సవం, తిరుప్పాడ సేవ, భక్తులకు అన్న ప్రసాద వితరణ విశేషంగా జరుగుతాయని తెలిపారు.

# జనవిజ్ఞానవేదిక పుస్తక మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

**చిలకలూరిపేట, జూన్4,ప్రభాతవార్త:** పట్టణంలోని జిల్లా గ్రంధాలయం వద్ద జనవిజ్ఞానవేదిక పుస్తక మహోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం చేయడం వల్ల ఏన్నో విజ్ఞాన పరమైన విషయాలు తెలుస్తాయని, విద్యార్దులు వ్యక్తిత్వ వికాసం పుస్తకాల ద్వారానే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో



జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి జి రామారావు, కన్వీనర్ దార్ల బుజ్జిబాబు, డాక్టర్ విన్సెంట్‌పాల్, డాక్టర్ పివి సుబ్బారావు, షేక్ కరిముల్లా, డి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ విద్యార్థినికి పీహెచ్‌డీ

**పొన్నూరు, జూన్ 4,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్




యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్టుమెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగానికి చెందిన బత్తిన త్రివేణి అనే విద్యార్థినికి బుధవారం విజ్ఞాన్స్ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్, కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారుతూ సమ్ ప్రాబ్లమ్స్ ఆన్ కన్వెక్టివ్ బౌండరీ లేయర్ ఫ్లో ఆఫ్ నాన్-న్యూటోనియన్ ఫ్లూయిడ్స్ ఓవర్ ఏ స్ట్రెచ్చింగ్ షీట్ అనే అంశంపై విద్యార్థిని పరిశోధన చేసిందని తెలియజేశారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మునగాల వెంకట సుబ్బారావు గైడ్‌గా వ్యవహరించారని చెప్పారు. ఈమె తమ పరిశోధనలో భాగంగా మొత్తం 3ఎస్‌సీఐ పేపర్స్‌ను పబ్లిష్ చేశారని తెలియజేశారు. డాక్టరేట్ పొందిన బత్తిన త్రివేణిని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

# పోలీసులపై దాడిచేసిన వారికి తగిన శాస్తి జరగాల్సిందే

## -స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ

**గుంటూరు విద్య, జూన్ 4,ప్రభాతవార్త :** సమాజంలో శాంతి భద్రతలు కాపాడే పోలీసులపైనే వ్యక్తులు దాడి చేస్తే పోలీసులు అలాంటి వారికి తగిన శాస్తి చేయడం సమంజసమేనని స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ అన్నారు. సిటి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో



ఏసుబాబు మాదిగ మాట్లాడారు. తెనాలి ఐతానగర్‌లో పోలీసులు బహిరంగంగా పలువురు నిందితులపై చర్యలు తీసుకోవడం వలన, మరొకరు అలాంటి దుశ్చర్యలకు పాల్పడరని ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు. పోలీసుల చర్య ఈ విషయంలో సమర్థనీయమేనని ఆయన పేర్కొన్నారు. నిందితులపై వివిధ పోలీస్టేషన్లలో పలు రకాల కేసులు నమోదై ఉండడం గమనించదగ్గ విషయం అన్నారు. ప్రజలకు అండగా రక్షణగా నిలిచేపోలీసులపై దాడులకు తెగబడితే శాంతి భద్రతల పరిస్థితులు కంట్రోల్ ఎవరు చేస్తారని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. ప్రజలు కూడా ఐతానగర్ సంఘటన పట్ల నిజానిజాలు తెలుసుకొని పోలీసులకు బాసటగా నిలవాలి ్సన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలు రాజకీయపార్టీల నాయకులు సైతం వివిధ సందర్భాల్లో పోలీస్ అధికారులపై ఒంటి కాలిపై వెళుతున్నారని, పోలీసులంటే మనలో వారేనని మన మంచి కొరకు పనిచేసే వారేనని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని ఆయన పేర్కొన్నారు.

# విజయోత్సవ దినాన్ని ఘనంగా నిర్వహించిన తెదేపా నాయకులు

**చిలకలూరిపేట, జూన్4,ప్రభాతవార్త:** పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విజయోత్సవ కార్యక్రమాన్ని బుధవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్‌చేసి శుభాకంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు జరిగిన విధ్వంసకర పాలన నుండి రాష్ట్ర ప్రజలకు విమోచన కలిగి అభివృద్ధి వైపు పయనించే ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్న రోజుగా జూన్4 వతేదిని విజయోత్సవ దినంగా పార్టీ శ్రేణులు నిర్ణయించడం జరిగిందని అన్నారు. ఈ రోజును యావత్ ఆంధ్ర ప్రజానీకం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం రాష్ట్ర చరిత్రలో చెరగని ముద్ర వేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ సమద్‌ఖాన్, కార్యదర్శి మద్దుమాల రవి తదితర టిడిపి నాయకులు, మహిళా నేతలు పాల్గొని కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.



# దక్షిణ భారతావనిలో శాంసంగ్ సాల్వ్‌ఫర్ టుమారో

**అమరావతి, జూన్ 4, ప్రభాతవార్త :** యువత ఆవిష్కరణలకు దోహదపడుతూ, స్థానిక సమ్యలకు వినూత్న పరిష్కారాలనందిస్తున్న సాల్వ్‌ఫర్ టుమారో దక్షిణ భారతావనిలోని హైదరాబాద్, బెంగుళూరుల్లో విస్తరించామని శాంసంగ్ ఇండియా ప్రతినిథులు తెలిపారు. తాము ఈ కార్యక్రమాన్ని త్వరలో ఈశాన్య ప్రాంతాల్లో కూడా నిర్వహిస్తామన్నారు.

# వెన్నుపోటు,గొడ్డలి వేటు పేటెంట్ జగన్‌రెడ్డిదే

## -ఏపిఐడిసి చైర్మన్ దేగల ప్రభాకర్

**గుంటూరు క్రైమ్,జూన్ 4,ప్రభాతవార్త :** జగన్‌రెడ్డి చేసిన కుంభకోణాల నుంచి ప్రజాదృష్టి మళ్లించడానికే వెన్నుపోటు ధర్నాల డ్రామా ఆడుతున్నారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ ఆరోపించారు.స్థానిక అర్బన్ టిడిపి



కార్యాలయంలో ఏపిఐడిసి చైర్మన్ దేగల ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడారు.జగన్‌రెడ్డి గతంలో అధికారంలో ఉన్న సమయంలో తొలి ఏడాది లో 10శాతం హామీలను కూడా అమలు చేయని వ్యక్తి జగన్‌రెడ్డి అని ఎద్దేవ చేశారు.ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70శాతం హామీను అమలుచేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమే అన్నారు.కాంగ్రెస్‌ను అడ్డంపెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచుకొని,అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీ స్థాపించాడు జగన్‌రెడ్డి అని అన్నారు.శివకుమార్ స్థాపించిన వైకాపాని కబ్జాచేసి శివకుమార్‌కు వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు.ఎత్తుకొని పెంచిన బాబాయ్ ని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకుడ్ని కాపాడుతూ,రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్ రెడ్డి అని అన్నారు.ఆస్తికోసం తల్లి,చెల్లిని ఇంటి నుంచి గెంటేసి,కుటుంబ వ్యవస్థకే జగన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచాడన్నారు.జగన్‌రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్ళ పాలనలో 85శాతం హామీలు ఎగనామం పెట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచాడని మండిపడ్డారు. మద్యపాన నిషేధంపై మాట తప్పి,మడమతిప్పి విషపూరిత మద్యం పోసి పేదల ఆరోగ్యానికే వెన్నుపోటు పొడిచాడన్నారు.మెగా డీఎస్సీ హామీపై మాట తప్పి యువతకు వెన్నుపోటు పొడిచాడన్నారు .అన్న క్యాంటిన్లు రద్దుచేసి పేదలను,కార్మికులకు వెన్నుపోటు పొడిచాడన్నారు .బిసి,ఎస్సీ,ఎస్టీ మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు లక్షకోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచాడన్నారు. అధికారంలోనికి వచ్చి తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం తప్ప మరోకటి లేదన్నారు. సంక్షేమం అభివృద్ధి సమపాలనలో చేస్తున్న నాయకుడు,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు.అసలైన వెన్నుపోటు దారుడు జగన్‌రెడ్డి అని వెన్నుపోటు అంటూ ధర్నాలు చేయడం దొంగే దొంగ దొంగ అన్నట్లుగా ఉందన్నారు.

# గోపాలరావు ఠాకూర్‌కు ఘన నివాళులర్పించిన జూపూడి రంగరాజు

**గుంటూరు విద్య,జూన్ 4,ప్రభాతవార్త :** ఆంధ్ర రాష్ట్రానికి మొట్టమొదటి జనసంఘ్ సంఘటన కార్యదర్శిగా పనిచేసి,ఈ రాష్ట్రంలో 1967లో ముగ్గురు ఎమ్మెల్యేలు వారి సమయంలో 7గురు



ఎమ్మెల్సీల గెలుపుకు కృషిచేసిన "శ్రీ గోపాల్‌రావు ఠాకూర్"పుణ్యతిది సందర్బంగా వారికి నివాళులర్పిస్తున్నానని బిజేపి సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు అన్నారు.గోపాల్‌రావు ఠాకూర్‌జీ సంస్మరణ సభ జిల్లా కార్యాయంలో బిజేపి జిల్లా అధ్యక్షులు చెరుకూరు తిరుపతిరావు సభ అధ్యక్షతన జరిగిన సమావేశం జరిగింది.అనంతరం వారికి ఘనమైన నివాళులర్పించిన అనంతరం జూపూడి రంగరాజు మాట్లాడుతూ 1929లో సంఘ్‌లో ప్రవేశం,డిగ్రీ పూర్తి చేసి,ఆర్ఎస్ఎస్ లో శిక్షణ పూర్తి చేసుకొని సంఘ్ స్థాపకులు పరమపూజ్యనీయ డాక్టర్జీ,పరమ పూజ్యనీయ గురూజీతోను సన్నిహిత సంబంధం వల్ల డాక్టర్జీ కోరికపై దేశం నలుమూలల సంఘ కార్యాన్ని విస్తరించాలని నిర్ణయం జరిగింది.నాటి సర్ కార్యవాహ్ గురూజీ ఆదేశం మేరకు 1940జూన్‌లోగోపాల్‌రావు ఠాకూర్ విజయవాడకు రావడం జరిగింది.1950-51లోరాయలసీమ తీవ్రమైన కరువు ఏర్పడింది.గ్రామాల నుండి ప్రజలు వలసలు పోవడం పశువులకు మేతలేక మృత్యువాత పడటం జరిగింది.ఆసమయంలో సంఘం ఠాకూర్‌జీ నేతృత్వంలో సహాయ కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించారు.1951లో జనసంఘ్ పార్టీ ఏర్పాటు అయ్యాక,నాటి ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచారక్ శ్రీ బాపూరావ్ మేఘేగారు గోపాల్ రావు ఠాకూర్‌ను జనసంఘ్ పార్టీలో పనిచేయాలని తెలియజేశారు.1953లో ఠాకూర్ జీ ఆంధ్రప్రదేశ్ జనసంఘ్ సంఘటన కార్యదర్శిగా నియుక్తి అయ్యారు.జనసంఘ్ తరుపున రాష్ట్రంలో తొలి కార్యక్రమం "కాశ్మీర్ సత్యాగ్రహం" ఠాకూర్‌జి రాష్ట్రమంతటా పర్యటించి కాశ్మీర్ అంశంపై జరిగిన బహిరంగ సభల్లో మాట్లాడారు. 1954నవంబర్ 6న గుంటూరులో జనసంఘ్ రాష్ట్ర సభలు మూడు రోజులపాటు ఠాకూర్‌జీ ఆధ్వర్యంలో జరిగాయి. రాష్ట్రనలుమూలల నుండి 300మంది ప్రతినిధులు హాజరవ్వడం జరిగింది.1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ జరిగిన సమయంలో ఠాకూర్‌జీ తెలంగాణా జిల్లాలో విస్తృతంగా పర్యటించి జనసంఘ్ శాఖలు ప్రారంభించడం జరిగిందిన జూపూడి రంగరాజు పేర్కొన్నారు.కార్యక్రమంలో వనమా పూర్ణచంద్రరావు,బిట్ర శివన్నారాయణ, భీమినేని చంద్రశేఖర్,వల్లెపు కృపారావు,పాలపాటి రవికుమార్,చరకకుమార్ గౌడ్,వెలగలేటి గంగాధర్,పద్మనాభం,తుల్లిమిల్లి శ్రీను,భజరంగ్ రామకృష్ణ,తాడువాయి రామకృష్ణ,తానుచింతల అనిల్,రాజేష్ నాయుడు,దేసు సత్యనారాయణ, కారంశెట్టి రమేష్,దానబోయిన శివయ్య,ఉడతా నరిసింహారావు,ఇండ్ల శ్రీధర్,నారాయణరెడ్డి,అమతి వెంకట రమణ,శ్రీను నాయక్,మౌలాలి, రాజు, శివరామకృష్ణ,మండల అధ్యక్షులు తంగా లక్ష్మణ్,బాషా,మల్లాల లక్ష్మణ్‌గౌడ్,పురుషోత్తం తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కాలనీలో ఒయాసిస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన డాక్టర్ కందిమళ్ల జయమ్మ

**చిలకలూరిపేట, జూన్4,ప్రభాతవార్త:** పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న సాయిబాబా గుడివద్ద బుధవారం ఒయాసిస్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించుకోవలసిన



బాద్యత ప్రతి ఒక్కరికి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒయాసిస్ సెక్రటరీ కరణం విజయలక్ష్మీ, జనసేన పార్టీ ఇన్‌చార్జి తోట రాజారమేష్, హనుమంతురావు, మునీర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# నాదెండ్ల మండల ఆర్ఐగా పదవీ భాద్యతలు స్వీకరించిన పి సంతోషకుమారి

నాదెండ్ల,జూన్4,ప్రభాతవార్త: నాదెండ్ల మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పి సంతోషకుమారి బుధవారం పదవీభాద్యతలు స్వీకరించారు. కాగా సంతోషకుమారి గతంలో వినుకొండ మండల తహసిల్దార్ కార్యాలయంలోసీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. బదిలీ మీద నాదెండ్ల ఆర్ఐగా నియమితులయ్యారు. పదవీ భాద్యతలు స్వీకరించిన సంతోషకుమారికి రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలియచేశారు.



# ఇంటికి వచ్చిన రేషన్ బియ్యం కూటమి ఆలోచన భేష్ అంటున్న వృద్ధులు

**పెదనందిపాడు జూన్ 4 (ప్రభాతవార్త)** పెదనందిపాడు హరిజనవాడకు చెందిన కొలగాని నాగేంద్రం గత కొంతకాలంగా పెరాలసిస్ తో బాధపడుతున్నాడు. కూటమి ప్రభుత్వం రేషన్ వాహనాలను ఎత్తివేసి వృద్ధులకు రేషన్ సరుకులునేరుగా ఇంటికి పంపిస్తామని చెప్పిన విధంగా బుధవారం రేషన్ డీలర్ సుబ్బారావు కు చెందిన సిబ్బంది తన ఇంటికి అంత్యోదయ కార్డు కింద బియ్యం



కందిపప్పు పంచదార తీసుకొచ్చిఇచ్చి తన వేలిముద్ర వేయిం కోవడం పట్ల నాగేంద్రం ఆనందం వ్యక్తం చేశారు. గతంలో రేషన్ తీసుకొచ్చిన వాహనాలు వీధిలో ఒక చోట నిలిపి సరుకులు ఇవ్వడంతో నా బోటి వాళ్ళు అక్కడికి వెళ్లి సరుకులు తెచ్చుకోవడం ఇబ్బందిగానే ఉండే దన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సరుకులు ఇంటికి పంపించడం హర్షనియమన్నారు.

# ఉపాధిహామీ పథకంతో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగు : ఏపివో వెంకయ్య

**కొల్లిపర,జూన్ 4 ప్రభాతవార్త:** ఉపాధిహామీ పథకం ద్వారా పేద ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని డిఆర్‌డిఏ ఏపివో వెంకయ్య అన్నారు.బుధవారం మండల పరిధిలోని వల్లభాపురం,మున్నంగి,కొల్లిపర, దంతలూరు,అత్తోట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు.కూలీలకు వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు.ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ పేద



ప్రజల కోసమే ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.ఉపాధిపనుల్లో పాల్గొనే కూలీలకు చేసిన పనులను బట్టి వేతనం ఇవ్వటం జరుగుతుందన్నారు.పేద ప్రజలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు వనుకూరి రాజేంద్ర,కనపర్తి సాగర్,వల్లభాపురం బుజ్జిబాబు,సాగర్,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎస్‌జిటి లకు పదోన్నతుల కౌన్సిలింగ్

**గుంటూరు విద్య,జూన్ 4,ప్రభాతవార్త :** ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటి ప్రభుత్వం,జిల్లా పరిషత్ మరియు మండల పరిషత్ పాఠశాల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతుల కౌన్సిలింగ్ కొరకు అర్హతగల ఉపాధ్యాయుల జాబితాను **deognt.blogspot.in** ఉంచినట్లు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి, సి.వి.రేణుక తెలిపారు.కాబట్టి సంబంధిత సబ్జెక్టు,మీడియాల్లో మున్సిపల్ కార్పొరేషన్‌లో 162పోస్టులు, మున్సిపాలిటిల్లో 40పోస్టులు, పదోన్నతుల కొరకు అర్హతగల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు వారి యొక్క సర్టిఫికేట్లు పరిశీలన జూన్ 5న ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రభుత్వ యాజమాన్యంలో 50పోస్టులు,జిల్లా పరిషత్ యాజమాన్యంలో 83పోస్టుల పదోన్నతుల కొరకు సర్టిఫికేట్లు పరిశీలన మధ్యాహ్నం 3.00గంటల నుండి సాయంత్రం 5.00గంటల వరకు గుంటూరులోని పాతబస్టాండ్ ,ప్రభుత్వ బాలుర పాఠశాల నందు గల పరీక్షాభవన్‌కు హాజరు కావలసిందిగా సివి రేణుక తెలిపారు.

# సాదాసీదాగా వైకాపా చేపట్టిన వెన్నుపోటు దినం

చిలకలూరిపేట,జూన్4,ప్రభాతవార్త: వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం పట్టణంలో సాదాసీదాగా ముగిసింది. రెండు రోజుల ముందే ఈ కార్యక్రమానికి సంబందించి పోస్టర్లను మాజీమంత్రి విడదల







రజిని విడుదల చేశారు. మొదటగా బైక్ ర్యాలీ అనుకున్నప్పటికి బైక్ ర్యాలీకి తగ్గ జనం రాకపోవడంతో ఆ తర్వాత దానిని పాదయాత్రగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు వచ్చినప్పటికి పాత పశువుల సంత వద్దకు రాగానే కొంతమంది నాయకులు వెనుతిరిగారు. పాదయాత్రలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు అంతంత మాత్రమే చేయడం జరిగింది. పాదయాత్ర భాస్కర్ సెంటర్, చౌత్రా, గడియారస్థంభం సెంటర్ మీదుగా తహసిల్దార్ కార్యాలయానికి చేరుకొన్న అనంతరం మాజీమంత్రి విడదల రజిని తహసిల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా పేదలకు న్యాయం జరగలేదు : మాజీమంత్రి విడదల రజినికూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినా పేదలకు న్యాయం జరగలేదని మాజీమంత్రి విడదల రజిని అన్నారు. బుధవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూనిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, ఆరోగ్యశ్రీని తూట్లు పొడిచారని అన్నారు. రైతన్నలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం దురదృష్టకరమని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ పథకాలలో ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెదేపా కార్యాలయంలో ఘనంగా కూటమి ప్రభుత్వ సంబరాలు

**నరసరావుపేట, జూన్ 4 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అయిన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు మిఠాయిలను పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందుతుందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు అనుభవం, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ల ఆశయానికి ప్రధాన నరేంద్ర మోడీ తోడవ్వడంతో ఆంధ్రప్రదేశ్ పునర్ నిర్మాణం ప్రారంభమైందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్న రాష్ట్ర ప్రజలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కృతజ్ఞతలు తెలియజేశారు. గత ఐదేళ్ళ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు, దౌర్జన్యాలను వైకాపా పార్టీ చేసిందన్నారు. అందుకే ప్రజలు ఛీకొట్టి ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రపంచ దేశాలు అభినందిస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నాగార్జునసాగర్ కుడి కాలువ ప్రాజెక్ట్ కమిటీ సమావేశం

**నరసరావుపేట, జూన్ 4 ప్రభాతవార్త :** నాగార్జునసాగర్ కుడి కాలువ ప్రాజెక్ట్ కమిటీ సమావేశాన్ని బుధవారం కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా సమావేశ హాల్‌లో నిర్వహించారు. సమావేశంలో ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావు మాట్లాడుతూ మేజర్, మైనర్ కాలువల మరమ్మత్తులను పూర్తి చేయాలన్నారు. రానున్న కాలంలో పంటలకు సాగునీరు సకాలంలో అందేలా డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌లు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్.ఈ.కృష్ణమోహన్, వైస్ ఛైర్మన్ చక్రపాణి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ గోగినేని కోటేశ్వరరావు, ప్రాజెక్ట్ పరిధిలోని డిసి ఛైర్మన్‌లు, ఈఈలు, డిఈ, ఏఈ, జెఈలు పాల్గొన్నారు.



# స్వచ్ఛ సంపద ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కలిగించాలి : ఈవోపిఆర్‌డి భార్గవ్

**కొల్లిపర,జూన్ 4 ప్రభాతవార్త:** స్వచ్ఛ సంపద ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కలిగించాలని ఈవోపిఆర్‌డి భార్గవ్ అన్నారు.బుధవారం మండల పరిధిలోని చివలూరు,కొల్లిపర పంచాయతీల వద్ద స్వచ్ఛ సంపద తయారీ కేంద్రాలను ఆయన తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ తడిచెత్త..పొడిచెత్తను తప్పనిసరిగా వేరు చేయాలన్నారు.కార్యక్రమంలో కార్యదర్శులు అలకనంద,మృత్యుంజయరావు,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చట్టం దృష్టిలో అందరూ సమానులే

**తెనాలి, జూన్ 4 (ప్రభాతవార్త) :** తెనాలి ఐతానగర్ యువకులను పోలీస్ అధికారులు చట్టానికి వ్యతిరేకంగా బహిరంగ ప్రదేశాలలో తిప్పుతూ నడిరోడ్డుపై కర్కసింగా చితకబాదిన కేసును ఎందుకు కులాలకు, రాజకీయాలకు ముడిపెడుతున్నారంటూ ప్రజా ప్రతినిధులను అధికారులను బిఎస్‌పి బహుజన పార్టీ తెనాలి అసెంబ్లీ నియోజక వర్గం ఇన్‌చార్జి కారుమంచి సునీల్ ప్రశ్నించారు.



ఐతానగర్‌ల్లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో సునీల్ మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానులే అంటూ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు ఈ కేసును ఎందుకు తప్పు దారి పట్టిస్తున్నారు. నిజంగా కానిస్టేబుల్‌పై యువకులు దాడి చేస్తే జైలుకు పంపాలే తప్ప పోలీసులకు నడిరోడ్డుపై కొట్టే అధికారం ఎవరిచ్చారన్నారు. ఎందుకు ఆ యువకులపై కక్షగటి బహిరంగ ప్రదేశాలలో తిప్పుతూ చితకబాదిన వైనాన్ని, కొన్ని సామాజిక వర్గాల వారు కొన్ని మీడియా పత్రికల వారు రాజ్యాంగాన్ని విస్మరించి చట్టాన్ని చేతిలో తీసుకున్న పోలీస్ అధికారులకు మద్దతు పలుకుతున్నారు. అసలు పోలీసు అధికారులకు నిందితులను లేక ముద్దాయిలను ఎవరినైనా కొట్టే అధికారం ఉందా దీనికి ప్రజా ప్రతినిధులు, అధికారులే సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రజా ప్రతినిధులు, పోలీస్ అధికారులు ఈ కేసు విషయంలో చేస్తున్న చర్యలను అంతరాత్మతో ఒక్కసారి ఆలోచన చేయాలని ఆయన కోరారు. ఈ కేసు విషయంలో బాధిత యువకుల కుటుంబాలకు బహుజన సమాజ్ పార్టీ అండగా ఉంటుందని తెఇయజేశారు. సమావేశంలో బిఎస్పీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ నాస్‌డాక్‌లో ఎస్ఎస్ ఇన్నోవేషన్స్

**విజయవాడ, జూన్ 4, ప్రభాతవార్త :** భారతదేశ వైద్య సాంకేతికతను ప్రపంచ పటంలో నూతన శిఖరానికి చేరుస్తూ దేశీయంగా అభివృద్ధి చేసిన ఎస్ఎస్ఐ మంత్రి సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ రూపొందించిన తమ సంస్థ నాస్‌డాక్‌లో నమోదయ్యినట్లు ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక, ఛైర్మన్ సిఇఓ డా సుధీర్ శ్రీవాస్తవ తెలిపారు. ఎస్ఎస్ఐఐ గుర్తుతో తమ సంస్థ నమోదయ్యిందన్నారు.

# విద్యార్థులకు చక్కటి కెరీర్ ఎన్ఐఏటి లక్ష్యం

**గుంటూరు, జూన్ 4, ప్రభాతవార్త :** నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ మార్గదర్శకత్వంలో దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యావ్యవస్థ విద్యార్థులకు నైపుణ్య విద్యను పెంచడానికి చేస్తున్న కృషికి నెక్ట్‌వేవ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ టెక్నాలజీస్ ప్రారంభించిన భాగస్వామ్యం ఎంతో దోహదం చేస్తుందని ఎన్ఐఏటి కో ఫౌండర్, సిఇఓ రాహుల్ అత్తులూరి తెలిపారు. హ్యాండ్స్ ఆన్‌స్కిల్స్ ట్రైనింగ్, ఇండస్ట్రీ ప్రాక్టీషనర్ల నుండి సెషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్స్ తదితరాల్లో తాము తోడ్పడుతామన్నారు.

# 2029లో సైకో పార్టీ, మాయ పార్టీలు కనుమరుగు

## - నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి యరమల రామచంద్రారెడ్డి

మాచర్ల, జూన్ 4 ప్రభాతవార్త: 2029లో సైకో పార్టీ - మాయ పార్టీలు కనుమరుగు కానున్నాయని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి యరమల రామచంద్రారెడ్డి అన్నారు. గతేడాది జూన్ 4న రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఫలితాల్లో సైకో పార్టీ పోయి మాయపార్టీ వచ్చిందని ఎద్దేవా చేశారు. సైకో పార్టీ ల్ల 2019 నుంచి 2024 వరకు రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇసుక దందాతో, మద్యం దందాతో ఎంతోమంది పేద ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారు. వేలకోట్ల అవినీతి మయం, ముఖ్యంగా ల్యాండ్



టైటిలింగ్ యాక్టుపేరుతో ప్రజల ఆస్తులు కొల్లగొట్టాలని చేసిన ప్రయత్నం దుర్మార్గమన్నారు. ప్రతి గ్రామంలో స్థానిక నాయకుల అఘాయిత్యాలు దారుణం. వీటి ఫలితమే సైకో పార్టీకి మంగళం పలికారు. ఇక ఇప్పుడున్న పార్టీవి అన్నీ మాయాటలే. ఇచ్చిన వాగ్దానాలు రెండు తప్పితే ఏవీ అమలు కాలేదు. ప్రజలు సైకో పార్టీ- మాయ పార్టీల మీద పూర్తిగా విశ్వాసం కోల్పోయారు. 2014 ముందు కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలే ప్రజల ఉందు కనబడుతున్నాయి. 2029లోరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చరిత్ర తిరిగి రాయడం ఖాయమన్నారు. అధికారం కాంగ్రెస్ పార్టీదే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాచర్ల పట్టణ పార్టీ అధ్యక్షులు కొమ్ము కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు గాదె పుల్లారెడ్డి, రెంటచింతల, వెల్దుర్తి, మండల పార్టీ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాసరావు, వంగపాటి నాగరాజు, నాయకులు, నాజర్‌వలి, పినపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాచర్లలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ

మాచర్ల, జూన్ 4 ప్రభాతవార్త: మాచర్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రమా, పిన్నెల్లి



వెంకటరామిరెడ్డి స్వాతి, నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు పూనూరి గౌతమ్‌రెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా బయల్దేరారు. అయితే పార్టీ కార్యాలయం నుంచి నాయకుల్ని, కార్యకర్తలని బయటికి రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వైకాపా కార్యాలయం వద్ద భారీగా పోలీసులను మొహరించారు. ఈ సందర్భంగా పిన్నెల్లి రమ, పూనూరి గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ఇచ్చిన మోసపూరిత హామీలు రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వాన్ని దావానలంలా దహిస్తాయని పేర్కొన్నారు. ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు అక్రమ కేసులతో వైకాపా కార్యకర్తలను, నాయకులను వేధిస్తున్నారన్నారు. ఇలాంటి ఉడత ఊపులకు భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రభుత్వ వైఫల్యాలపై ఇలాంటి నిరసన కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైకాపా కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# కూటమి ఏడాది పాలన సందర్భంగా హర్షం వ్యక్తం చేసిన నాయకులు

**మాచర్ల, జూన్ 4 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని స్థానక తెదేపా నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. బస్టాండ్ సెంటర్ కూడలిలో భారీ కేకు కట్ చేసి నాయకులు ప్రసంగించారు. ఏపీని పట్టిపీడిస్తున్న సైకో పాలనను విముక్తి చేసి ఏడాది కూటమి పాలనలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు పండుగ చేసుకుంటున్నారని అన్నారు. గతేడాది



జూన్ 4న ఎమ్మెల్యేగా బ్రహ్మానందరెడ్డి సాధించిన అఖండ విజయాన్ని గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు కేకులను పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నేతృత్వంలో, ఎమ్మెల్యే జూలకంటి సారథ్యంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయమంగా నియోజకవర్గం శాంతియుత వాతావరణంలో ముందుకు పోతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, వజ్రంనాయక్, మున్నా రాంబాబు, శశి, మద్దిగపు వెంకటరామిరెడ్డి, కంభంపాటి అనిల్, చంటి, జానీబాష తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు హామీలిచ్చి గాలికొదిలేసిన చంద్రబాబు

## మాజీ ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల, జూన్ 4 ప్రభాతవార్త: ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలిచ్చి వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు గాలికొదిలేశారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో బుధవారం వెన్నుపోటు దినం పేరిట నిరసన ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా కాసు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే సూపర్6 పథకాలు అమలు చేస్తామని ప్రజలను



నమ్మించి ఒక్క పథకం కూడా అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందన్నారు. వైసీపీ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఎస్పీ బాలు జయంతి వేడుకలు


**నరసరావుపేట టౌన్, జూన్ 4 ప్రభాతవార్త :** స్థానిక టౌన్‌హాల్లో బుధవారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలు విగ్రహానికి నరసరావుపేట కళాకారులు, సంగీత అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఎస్పీ బాలు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పొన్నపాటి ఈశ్వరరెడ్డి, జుజ్జూరి



వెంకట్రావు, కొఠారి రంజిత్‌కుమార్, బివి చంద్రశేఖరరావు, బత్తుల మురళి, చేగు వెంకటేశ్వరరావు, ఒగూరి నాగేశ్వరరావు, స్వర్ణ రామిరెడ్డి, బాజీమస్తాన్, పాషా, అమరేంద్ర, పోలేశ్వరరావు, అమర్నాథ్, బాజాను, పోతర్లంక రవి తదితరులు పాల్గొన్నారు.

# యోగా ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలి

**గుంటూరు కార్పొరేషన్, జూన్4, ప్రభాతవార్త:** శరీరానికి సమతుల్యతో పాటు దృఢత్వాన్ని అందించే యోగాపై యోగాంధ్ర 2025 ద్వారా ప్రజలకు విస్తృత స్థాయిలో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని ఎన్టీఆర్ స్టేడియం ఎదురు యోగా రోడ్డులో నగరపాలక సంస్థ, ఆయుష్ ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్ర 2025 యోగాసనాల శిక్షణ, అవగాహన కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవి, నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, పాల్గొన్నారు. యోగా గురువు పతాంజలి మహర్షికి నివాళులర్పించి, జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా మాస్టర్ ట్రైనర్ యోగ ప్రోటోకాల్ ప్రకారం సూక్ష్మ వ్యాయామంతో పాటు ఆసనాల ప్రయోజనాలు వివరిస్తూ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, శాసనసభ్యులు గల్లా మాధవి, నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా అధికారులు, ప్రజలతో వివిధ రకాల యోగాసనాలు చేయించారు. శాసనసభ్యులు గల్లా మాధవి యోగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ జూన్ 21 వ తేదీ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు హెల్త్ వెల్త్ ఆంధ్రాలో భాగంగా యోగాపై అవగాహన కోసం యోగాంధ్రా 2025 కార్యక్రమాలు నెల రోజులు పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. యోగాసనాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలను జిల్లాలోని పర్యాటక ప్రాంతాలతో పాటు, పట్టణాల్లోనూ, మండల కేంద్రాల్లో , గ్రామ, వార్డు స్థాయిలో నిర్వహిస్తున్నా మన్నారు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా, వ్యాయామం చేయటం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని యోగా ప్రతి ఒక్కరు జీవన విధానంలో భాగం కావాలన్నారు. యోగా వలన మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. భారతదేశ వారసత్వ సంపదైనా యోగాను గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచానికి చాటిచెప్పి జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకునేలా చేశారన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం 11 వ వార్షికోత్సవ సందర్భంగా ఒన్ ఎర్త్ ఒన్ యోగా నినాదంతో జరుపుకుంటున్నామని తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో, అన్ని ప్రాంతాల్లో నెలరోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలను పెద్ద ఎత్తున ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై ప్రజలకు అవగాహన కోసం యోగాసనాల కార్యక్రమాలతో పాటు ర్యాలీలు, తదితర కార్యక్రమాలను ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములు చేస్తూ నెల రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో మెగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్ట్ ఆఫ్ నటరాజ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యాసంస్థల విద్యార్థులు నృత్య రూపకంలో యోగాసనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు, ఆయుష్ జిల్లా అధికారి అనిత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, సిపిఓ శేషశ్రీ, జిల్లా ఉప రవాణ కమిషనర్ సీతారామిరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డిపిఓ సాయికుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డ్వామ పిడి శంకర్, హౌసింగ్ పీడీ ప్రసాదు, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీలా, డిప్యూటీ కమిషనర్లు డి శ్రీనివాస్,బి శ్రీనివాస్, వెంకటకృష్ణ, పశ్చిమ మండల తహసిల్దార్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, యోగ మాస్టర్ ట్రైనర్లు, ట్రైనర్లు , ప్రాక్టీసర్స్, ప్రజలు పాల్గొన్నారు.









# తాగునీటి సమస్య పరిష్కారానికి రూ 56 లక్షలు జిల్లా పరిషత్ నిధులు మంజూరు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జూన్4, ప్రభాతవార్త:** గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అటు పంచాయితీలుగా మనుగడ సాగించలేక, ఇటు మున్సిపాలిటి పరిధిలో అభివృద్ధికి నోచుకోక ఇబ్బంది పడిన మానుకొండవారిపాలెం, గణపవరం గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల విలీనం వల్ల మానుకొండ వారిపాలెం, గణపవరం, పసుమర్రు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, గ్రామ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా కూడా ప్రభుత్వానికి తెలియచేయడం జరిగిందన్నారు. ప్రత్తిపాటి విజ్ఞప్తిపై ఇటీవల రాష్ట్ర పంచాయితీరాజ్ కమిషనర్ కృష్ణతేజ చిలకలూరిపేటకు వచ్చి గణపవరం గ్రామాన్ని సందర్శించారని, అనంతరం మూడు గ్రామాల ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారని అన్నారు. గ్రామస్థుల సమస్యలపై స్పందించిన పిఆర్ కమిషనర్ కృష్ణతేజ ప్రధానమైన తాగునీటి సమస్య పరిష్కారానికి సరిపడా నిధులను జడ్పీ నుంచి కేటాయించాలని జిల్లా పరిషత్ సిఈఓ జ్యోతిబసును ఆదేశించారని అన్నారు. మానుకొండవారిపాలెం గ్రామంలో 40లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్హెడ్ ట్యాంక్ నిర్మాణం, నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో నూతన ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు జిల్లా పరిషత్ వర్గాలు ధృవీకరించాయని తెలిపారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి రెండు గ్రామాలలో మొత్తం రూ56లక్షలతో ఆయా పనులు ప్రారంభించడం జరుగుతుందని ప్రత్తిపాటి తెలిపారు. త్వరలోనే ఆయా పనులకు సంబంధించి టెండర్లు ఖరారవుతాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు ప్రారంభించడం జరుగుతుందని ఆయన అన్నారు. గ్రామస్థుల సమిష్టి పోరాటంతో ఎట్టకేలకు రెండు గ్రామాల్లోని తాగునీటి సమస్య పరిష్కారానికి రూ 56లక్షల జడ్పీ నిధులు మంజూరు అయ్యాయని,ఇందుకు సంబంధించి సమాచారాన్ని జిల్లా పరిషత్ కార్యాలయ వర్గాలు ధృవీకరించాయని ప్రత్తిపాటి తెలిపారు.



# కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు

**పెదకూరపాడు, (క్రోసూరు) జూన్ 4 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో సంవత్సర కాలంలో రూ.100 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. పోలవరం నుంచి రైల్వే ప్రాజెక్ట్ వర్క్స్, రాజధాని అభివృద్ధి కోసం రూ.60 వేల కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో జోడెద్దుల పాలనగా కూటమి విజయ పథంలో నడుస్తుందన్నారు. వైకాపా పాలనలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారిపోతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల మరమ్మత్తులు చేసి ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందిస్తున్నామన్నారు. అలాగే పెదకూరపాడు నియోజకవర్గంలో 30 వేల ఎకరాలు రాజధాని కోసం రెండవ విడత భూ సమీకరణకు ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పేదలకు వెన్నుపోటు పొడిచిన ఘనత పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కే దక్కుతుందన్నారు. రౌడీషీటర్లను పరామర్శించేందుకు తెనాలి పర్యటనకు జగన్ వెళ్లడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల వైకాపా అరాచక పాలనకు 2024 జూన్ 4వతేదీన రాష్ట్ర ప్రజలు అంతం పలికారన్నారు. 11 సీట్లతో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌కు సిగ్గు రాలేదన్నారు. 2019 ఎన్నికల ముందు మూడు ముక్కల ఆటతో రాజధాని అమరావతిని విచ్ఛిన్నం చేయాలని చూసిన జగన్‌కు రాష్ట్రంలో తిరిగే అర్హత లేదని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విమర్శించారు.




# రేషన్ షాపుల వద్ద వినియోగదారుల అవస్థలు

**-గిరిజన లంబాడా వినియోగదారుల ఆందోళన**
**-వెంకట తండాలో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలి**

**ఎ కొండూరు, జూన్ 4, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏర్పడి కూటమి ప్రభుత్వం గతంలో వైసిపి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు చౌక డిపో డీలర్ల నుండి ఎండియు వాహన ఆపరేటర్ల ద్వారా ఇంటింటికి అందించే బియ్యం, పంచదార ఇంకా ఇతర నిత్యవసర సరుకుల పంపిణీ విధానాన్ని ఈ నెల 1 నుండి రద్దు చేసి పాత డీలర్ల విధానం ద్వారా రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకోవడం అనే పద్ధతి వల్ల సిగ్నల్స్ లేక వ్రేలిముద్ర మిషన్‌లు పనిచేయక పోతుండటంతో గంటల తరబడి క్యూలో నిలబడినా సరుకులు అందడం లేదని ఈ డీలర్ల విధానం వల్ల తమ దుంప తెగుతుందని ఎ కొండూరు మండలం చీమలపాడు శివారు వెంకట తండాకు చెందిన గిరిజన (లంబాడా) వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ తండా గిరిజన లంబాడాలు తండా నుండి సుమారు 5కి.మీ దూరంలో ఉన్న చీమలపాడు రేషన్ షాపులకు రావాల్సి ఉండడంతో వినియోగదారుల అవస్థలు వర్ణనాతీతం. ఎండియు వాహనాల ఆపరేటర్‌లు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం లేదని అక్రమాలు జరుగుతునా న్నయని ఆ శాఖ మంత్రి మనోహర్ ప్రకటించడం ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా ఉందని లంబాడా వినియోజదారులు మంత్రి ప్రకటన కేవలం జగన్‌పై కక్షసాధింపుతోనే ఈ వ్యవస్థను రద్దు చేసి తమకు కష్టాలపాలు చేశారని పలువురు కూటమి ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు. ఇకనైనా ఈ తండాలో చౌకడిపోను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో డీలర్ల ద్వారా సరు కులు తండాకు వచ్చి పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద రేషన్ షాపుల డీలర్ల వద్ద నిరసన ఆందోళన నిర్వహించి కూటమి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను ఎండగడతామని గిరిజన లంబాడా వినియోగదారులు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



# గంజాయి తరలిస్తు పట్టుబడిన నిందితులు



**తిరువూరు, జూన్ 4, ప్రభాతవార్త :** తిరువూరు పట్టణం శివారు ఆంధ్రా తెలంగాణ బోర్డర్‌లోని సంత చెక్‌పోస్టు వద్ద సీలేరు నుండి విజయవాడ గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను తిరువూరు సిఐ కె గిరిబాబు తిరువూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై కెవిజివి సత్యనారాయణ మరియు సిబ్బందితో కలిసి పట్టుకుని వారి నుండి 40వేల రూపాయలు విలువ గల 8కేజీల గంజాయిని ఒక పల్సర్ మోటార్ బైక్‌ను స్వాధీనపరచుకుని ముగ్గురు యువకులలో ఒకరైన మైనర్ బాలుడిని జువనైల్ హోమ్‌కు, మిగిలిన ఇద్దరు వ్యక్తులను తిరువూరు కోర్టులో హాజరు పర్చడం జరిగినది. తిరువూరు సర్కిల్ పరిధిలో ఎవరైనా మాదక ద్రవ్యాల రవాణా వాడకం వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుని వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని సిఐ గిరిబాబు తెలిపారు. అరెస్టయిన నిందితుల్లో తిరువూరు లక్ష్మీపురమునకు చెందిన 19 సంవత్సరాల మద్దిరాల లోకేష్ అనే లోకి, మదిరకు చెందిన 22సంవత్సరాల వయస్సు గల కళ్యాణపు వంశీ ఉన్నారు.

# యోగాతో క్రమశిక్షణ : పల్నాడుజిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

**విజయపురిసౌత్, జూన్ 4 ప్రభాతవార్త:** యోగాతో క్రమశిక్షణ అలవడుతుందని పల్నాడు జిల్లా కలెక్టరు అరుణ్‌బాబు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యటక ప్రాంతమైన అనుపులో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టరు అరుణ్‌బాబు ముఖ్యఅతిథిగాపాల్గొని ప్రసంగించారు. పర్యటక శాఖ ఆధ్వర్యంలో యోగాకార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనుపులోని ప్రశాంత వాతావరణంలో బుధవారం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 2000 మంది పాల్గొన్నారు. ప్రతిరోజూ ఉదయం ఒక గంటపాటు యోగ సాధన చేయడం వల్ల ఒత్తిడి దూరమవుతుందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మురళీ మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో భారీ ఎత్తున యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పర్యటకశాఖ రీజనల్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి, పర్యాటక శ్శాఖ డివిజనల్ మేనేజరు చైతన్య, ఆర్టీవో మురళీ కృష్ణ, డీఎంహెచ్ఓ డా॥ రవి, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, ఈఈ రమేష్, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజానాయక్, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి సంజీవకుమార్, డీఎఫ్ఓ నాగేశ్వరనాయక్, జిల్లా పర్యటక శాఖ అధికారి నాయుడమ్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు, డీసీఓ వెంకటరమణ, ఏపీఎంఐసీ ఆంజనేయులు, ఏపీటీడీసీ డిప్యూటీ మేనేజరు శివారెడ్డి, గ్రౌండ్ వాటర్ అధికారి శ్రీనివాసరావు, మాచర్ల మున్సిపల్ కిషనర్ వేణుబాబు, మాచర్ల తహశీల్దారు కిరణ్‌బాబు, మాచరన్ల ఎంపీడీఓ, సోషల్ వెల్ఫేర్ అధికారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన గురువు మెట్టు గోవిందరెడ్డి 200 యోగ మ్యాట్స్ కలెక్టరు చేతుల మీదుగా పంపిణీ చేశారు. యోగా కార్యక్రమం సందర్భంగా బెలూన్లను గాలిలోకి వదిలారు.





# కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తైన సందర్భంగా సంబరాలు

**సత్తెనపల్లి, జూన్ 4 ప్రభాతవార్త :** పట్టణంలోని రఘురామ్‌నగర్ ప్రజావేదిక నందు బుధవారం కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సంబరాలను నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ జగన్ హయాంలో రాక్షస, అరాచక పాలన సాగిందన్నారు. వైకాపా పాలనలో ఎన్నికలు ఎప్పుడు వస్తాయని ప్రజలు ఎదురు చూశారన్నారు. జరిగిన ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు బుద్ధి చెప్పారని, కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య పాలన జరుగుతుందన్నారు. తెనాలిలో అరాచక శక్తులను జగన్ ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. గతంలో పరామర్శకు వెళ్ళిన లోకేష్ పై వైకాపా వాళ్ళు దాడి చేశారన్నారు. అరాచక శక్తులకు జగన్ మద్దతు పలుకుతున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కొండమోడు - పేరేచర్ల రహదారి పనులు ప్రారంభమయ్యాయన్నారు. అలాగే అమరావతి రాజధాని రావటంతో భూముల విలువ పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో గంజాయి వంటిపై ఉక్కుపాదం మోపాడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి డ్రగ్స్ మాఫియా భరతం పడతానని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఇప్పటికే స్పష్టం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలను అమలు చేసిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. సత్తెనపల్లి నియోజకవర్గాన్ని తొలి ఏడాది కాలంలోనే రూ.25 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పేదవాడి ఆకలి తీర్చేందుకు రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి తొలి ఏడాదిలోనే రూ.కోటి 76 లక్షల 66 వేల 255 లు విడుదల చేశారన్నారు. రానున్న రోజుల్లో సత్తెనపల్లి నియోజకవర్గం అభివృద్ధి దిశగా రూపురేఖలు మారుస్తామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 13వ జాతీయ స్థాయి పెన్ కాక్ సిలాట్ చాంపియన్ షిప్‌లో రజత పతకం సాధించిన నరేంద్ర

**బాపట్ల, జూన్4, ప్రభాతవార్త:** జాతీయ స్థాయిలో సత్తా చాటిన కర్లపాలెం పోలీస్ కానిస్టేబుల్ వీరంకి నరేంద్రను జిల్లా ఎస్పీ తుషార్ డూడి అభినందించారు. స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎస్పీ జిల్లా స్థాయిలో సత్తాచాటిన నరేంద్రను అభినందించి మెడల్ తో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మే 9 నుండి 12 తేది వరకు లక్నోలో నిర్వహించిన ఇండియన్ పెన్ కాక్ సిలాట్ ఫెడరేషన్ 13వ జాతీయ స్థాయి పెన్ కాక్ సిలాట్ చాంపియన్ షిప్2025 లో బాపట్ల జిల్లాకు చెందిన కానిస్టేబుల్ వీరంకి నరేంద్ర 110 కేజీల విభాగంలో పాల్గొని రజత పతకం సాదించడం అభినందనీయమన్నారు. క్రీడలలో సత్తా చాటి జిల్లా పోలీస్ ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింప చేస్తూ పతకం సాధించడం గర్వకారణమన్నారు. గతంలో నరేంద్ర జాతీయ స్థాయిలో రెండు మెడల్స్ సాధించాడని, 2024లో జరిగిన సెకండ్ ఆల్ ఇండియా పెన్ కాక్ సిలాట్ చాంపియన్ షిప్ లో కాంస్య పతకం, 2018లో 3వ అల్ ఇండియా పోలీస్ గేమ్స్ లో కాంస్య పతకం సాధించాడన్నారు. రాబోయే రోజులలో మంచి శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఎస్పీ ఆకాక్షించారు. జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది క్రీడలలో కూడా పాల్గొనాలని సూచించారు. క్రీడలు శారీరక ఆరోగ్యం, మానసిక దృఢత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయన్నారు. క్రీడలలో మంచి ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహిస్తామని ఎస్పీ తెలిపారు.



# వెన్నుపోటు దినం నిరసనకు తరలివచ్చిన వైకాపా శ్రేణులు

**పెదకూరపాడు, (క్రోసూరు) జూన్ 4 ప్రభాతవార్త :** వైకాపా అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. వేల మంది వెంట రాగా నాలుగు రోడ్ల కూడలిలో వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి శంకరరావు పూలమాలలతో నివాళులర్పించి అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయంకు వెళ్ళి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అమలుకాని హామీలు ఇచ్చి ఏడాది కాలంలో ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. అమ్మఒడి, రైతు భరోసా, 50 ఏళ్ళకే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు పెన్షన్, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ఇలాంటి 147 హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. వాళ్ళు సాధించిన ఘనత ఏదైనా ఉంది అంటే రెడ్ బుక్ రాజ్యాంగం మాత్రమేనని, రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగిస్తున్నారన్నారు. వేలాది మంది పై కేసులు పెట్టడం, అన్యాయంగా, అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపడమే వాళ్ళు సాధించిన ప్రగతి అని శంకరరావు అన్నారు. రైతులకు మద్దతు ధర లేక పండించిన పంట అమ్ముకోలేక రోడ్డున పడ్డారని, ఉద్యోగస్తులకు డిఏలు, పిఆర్‌సి వంటి హామీలు నెరవేర్చక వాళ్ళు రోడ్డు ఎక్కారన్నారు. 18 సంవత్సరాలు నిండిన వాళ్ళకు చేయూత వంటి పథకాలు రాక పూర్తిగా నష్టపోయారన్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. సచివాలయం వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థ, ఇంటింటి రేషన్, ఇంటింటికి వైద్యం లాంటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్ని అటకెక్కించారని శంకరరావు ఆగ్రహించారు. గత ఐదు సంవత్సరాలు పెదకూరపాడు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి సంక్షేమ పాలన అందించామన్నారు. ఈ రోజు ఇసుక మాఫియా, మట్టి మాఫియా, రేషన్ మాఫియా వంటి అవినీతితో రాష్ట్రం నిండిపోయిందని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విమర్శించారు.



# గాయకుడు కొండలు స్వామికి ఘన సన్మానం

**కర్లపాలెం, జూన్04, ప్రభాతవార్త:** కొండలు స్వామి పాడిన రఘుకుల తిలకా పాట ప్రపంచ వ్యాప్తంగా సోషల్ మీడియాలో 40 కోట్ల మంది రీల్స్ చేయడం హర్షణీయమని సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు, జిఎస్ఆర్ బిల్డర్స్ డెవలపర్స్ గుండ్రెడ్డి శివ అన్నారు. శాలువా పూల మాలలతో కొండల స్వామిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల సాంబశివరావు, పంతం నాగేశ్వరరావు, ఈవూరి మణికంఠ, కెఆర్ఎమ్ శ్రీనివాసరావు, త్రిపురం సంజీవరెడ్డి, కారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



# వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ

**-పొన్నూరులో కథం తొక్కిన వైకాపా శ్రేణులు**
**-అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు**
**-తహశీల్దార్ కార్యాలయంలో అర్జీ అందజేత**
**-వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ**

**పొన్నూరు, జూన్ 4, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు వెన్నుపోటు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. సంవత్సరం గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. జగన్మోహనరెడ్డి కన్నా మంచి పాలన చేస్తామని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేశారన్నారు. నాడు ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకు వెన్నుపోటు పొడిచినట్లుగానే నేడు ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. హామీలు అమలు బాధ్యత తమదని ప్రజలకు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు బాండ్ పేపర్లు ఇచ్చారన్నారు. ఆ బాండ్ పేపర్లు ఏమిచేయాలి..? ఎక్కడ పెట్టుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. చంద్రబాబు చేసిన మోసాన్ని గుర్తించిన ప్రజానీకం జగన్‌ను ఎందుకు ఓడించామా..? అని మధన పడుతున్నారన్నారు. మళ్ళీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారన్నారు. ఇంటి వద్దకే వచ్చి రేషన్ అందించే వాహనాలను తొలగించి కార్డుదారులకు ఇబ్బందులను కూటమి ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఈ సంవత్సర కాలంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి రెండూ లేకుండా పోయాయన్నారు. ఈ సంవత్సర కాలంలో రెడ్‌బుక్ రాజ్యాంగం తప్పా మరేమిలేదన్నారు. ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు అనే తేడా లేకుండా అందరిపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలపై కక్షసాధింపు ధోరణి మానుకొని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేదానిపై శ్రద్ధపెట్టాలని హితవు పలికారు. ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వరకు వచ్చి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భవనం పద్మలీల, మైనార్టీ కమిషనర్ సభ్యుడు షేక్ సైఫుల్లా, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్లు బొనిగల వేణుప్రసాద్, ఆకుల వెంకటేశ్వరరావు, నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, యందేటి వెంకటసుబ్బయ్య, షేక్ నాజర్, షేక్ మహమ్మద (మాము), చింతలపూడి మురళీకృష్ణ, దేవరకొండ గోపి, వట్టిప్రోలు రంగారావు, మూకిరి అనీల్‌కుమార్, గేరా కుమారి, మంద్రు అనిత, ఆకుల రామమోహన్, అమిరినేని సాంబశివరావు, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



5-6Pg5exLE.qxd:5-6Pg5exLE.qxd 01/01/01 9:31 AM Page 1





# దాడుల్లో 9పాక్ యుద్ధ విమానాలు ధ్వంసం

'ఆపరేషన్ సిందూర్'పై అధికార వర్గాల వివరణ

**న్యూఢిల్లీ, జూన్ 4:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో దాయాది పాకిస్థాన్‌కు భారీ నష్టం వాటిల్లింది. భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణి వంటి కచ్చితత్వంతో కూడిన ఆయుధాలు పాక్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ విధ్వంసం సృష్టించాయి. ఈ దాడుల్లో పాక్ సైనిక, వైమానిక స్థావరాలు పెద్దమెత్తంలో దెబ్బతిన్నాయి. భారత బలగాలు చేసిన దాడుల్లో పాక్‌కు చెందిన సాయుధ డ్రోన్లతో సహా తొమ్మిది యుద్ధ విమానాలు ధ్వం సమైనట్లు. సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ దాడిలో పాక్ చెందిన ఆరు పాక్ యుద్ధ విమానాలు, రెండు నిఘా విమానాలు ఒకటి సీ130 హెర్క్యులస్ రవాణా విమానం ధ్వంస మైనట్లు అధికారికవర్గాలు పేర్కొన్నాయి. అంతే కాదు, పదికి పైగా సాయుధడ్రోన్లు, పలు క్రూ యిజ్ మిసైల్స్‌ను భారత బలగాలు నేలకూ ల్చినట్లు వెల్లడించాయి. పాక్‌లోని పంజాబ్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రాంతాల్లో భారత్ చేపట్టిన వైమానిక దాడుల్లో వీటిని కూల్చివేసినట్లు చెప్పాయి. భారత రాడార్ వ్యవస్థ సంగ్రహించిన ట్రాకింగ్, థర్మల్ సిగ్నేచర్‌ల ద్వారా వీటి కూల్చి వేతను నిర్ధారించినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. నాలుగు రోజులుపాటు జరిగిన ఈ ఘర్షణల్లో పాక్ నిఘావ్యవస్థకు భారీ నష్టం చేసినట్లు రక్షణ శాఖ వర్గాలు చెప్పాయి. నిఘా విమానాలను. భారత్ బలగాలు కూల్చివేసినట్లు పేర్కొన్నాయి. భారత సుదర్శన చక్రఎస్400తో 300 కిలో మీటర్ల దూరం నుంచే ఈ రెండు విమానాలను కూల్చివేసినట్లు వెల్లడించాయి. స్వీడన్ పరిజ్ఞానం తో రూపొందించిన ఏఈడబ్ల్యూ అండ్ సీ నిఘా విమానాన్ని భోలారి ఎయిర్ బేస్‌లో పాక్ ఉంచింది. ఈ ఎయిర్ బేస్‌పై చేసిన దాడిలో ఆ నిఘా విమానం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రా ల్లో కనిపిస్తోంది. పాక్‌లోని పంజాబ్‌పై చేసిన మరోకదాడిలో సీ130 హెర్క్యులస్ రవాణా విమానం ధ్వంసమైంది. ఆపరేషన్ సిం దూర్‌లో పాక్ డ్రోన్లను అత్యంత కచ్చితత్వంతో భారత బలగాలు నేలమట్టం చేశాయి. ఈ ఆపరేషన్‌లో చైనాకు చెందిన వింగ్ లూంగ్ సిరీస్‌కు చెందిన మీడియం, లాంగ్ ఎండ్యూర్నస్ డ్రోన్లను కూల్చి వేశాయి. పదుల సంఖ్యలోడ్రోన్లను ఒకే ఒక్క దాడితో భారత ధ్వంసం చేసింది. అంతేకాదు జమ్మూ కశ్మీర్, రాజస్థాన్ భూభాగాలపై పాక్ ప్ర యోగించిన డ్రోన్లను భారత బలగాలు సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణ శాఖ వర్గాలు చెప్పాయి.

భారత్ దాడుల్లో పాకిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో విధ్వంసం జరిగినట్లు ఆ దేశం తాజాగా విడుదల చేసిన పత్రాలు వెల్లడించాయి. ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలోని పెషావర్, సింధ్ రాష్ట్రంలోని అట్టాక్, బహావల్‌నగర్, హైదరాబాద్, పంజాబ్ లోని గుజ్రాత్, ఝుంగ్ ప్రాంతాలపై భారత్ దాడి చేసినట్లు అవి పేర్కొన్నాయి. ఆపరేషన్ సిం దూర్‌కు ప్రతిగా పాకిస్థాన్ చేపట్టిన 'ఆపరేషన్ బున్యన్ ఉమ్ మర్సూస్‌పై విడుదల చేసిన పత్రా ల్లో ఈ వివరాలు బహిర్గతమయ్యాయి.



# ఉక్రెయిన్‌కు లక్ష డ్రోన్లు..

## ఈ ఆర్థిక సంవత్సరంలో ఇవ్వనున్న బ్రిటన్

**లండన్, జూన్ 4:** ఇటీవల రష్యాలోని వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ భారీగా డ్రోన్ దాడులకు పాల్పడడంతో మాస్కోకు చెందిన 41 యుద్ధ విమానాలు ధ్వంసమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కీవ్‌కు భారీ సంఖ్యలో డ్రోన్‌లను సరఫరా చేయడానికి బ్రిటన్ ముందుకువచ్చింది. 2026 ఏప్రిల్ నాటికి ఉక్రెయిన్‌కు లక్ష డ్రోన్లు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఆ దేశానికి ఇచే 4.5 బిలియన్ పౌండ్ల మిలిటరీ మద్దతులో ఈ 350 మిలియన్ పౌండ్ల డ్రోన్ ప్యాకేజీ భాగమని పేర్కొంది. స్వతంత్రంగా ఉత్పత్తి చేసిన స్ట్రాటజిక్ డిఫెన్స్ రివ్యూను బ్రిటన్ ప్రభుత్వం ఆమోదించింది. రష్యన్ దురాక్రమణతో సహా ఉద్భవించిన మరిన్ని ముప్పులను ఎదుర్కోవడానికి కీవ్‌కు మిలిటరీ మద్దతు ఇస్తున్నట్లు తెలిపింది. బ్రస్సెల్స్‌లో నిర్వహించనున్న 50 దేశాల ఉక్రెయిన్ డిఫెన్స్ కాంటాక్ట్ గ్రూప్ సమావేశంలో బ్రిటన్ రక్షణ కార్యదర్శి జాన్ హీలీ ఈ ప్రకటన చేయనున్నారు. రష్యా వద్ద అపారమైన క్షిపణి సంపద ఉంది. ఆ దేశంతో పోలిస్తే ఉక్రెయిన్ దగ్గర భారీ ఆయుధాలు లేకపోవడంతో కీవ్‌ను ఆయుధాల కొరత వెంటాడుతోంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థ లేకపోవడంతో కీవ్‌ను ఆయుధాల కొరత వెంటాడుతోంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థ లేకపోవడంతో రష్యా చేసే క్షిపణులు, డ్రోన్ల దాడులను తట్టుకోలేకపోతోంది. దీంతో రిమోట్ సాయంతో సుదీర్ఘంగా ప్రయాణించ గలిగే డ్రోన్ల వ్యవస్థను అభివృద్ధి చేసుకుంది. వీటితో తాజాగా రష్యాలోని అనేక ప్రాంతాల్లో భారీ దాడులకు పాల్పడింది. గతంలోనూ రష్యా సైనిక స్థావరాలు, చమురు బావులపై దాడులు చేసేందుకు ఉక్రెయిన్ వీటిని ప్రయోగించింది. భవిష్యత్తులో రష్యా ఆక్రమణల ను ఎదుర్కోవడానికి మరిన్ని డ్రోన్లు సరఫరా చేయాలని మిత్ర దేశాలను కోరింది. మాస్కో కీవ్‌పై భీకర దాడులకు పాల్పడుతుండడంతో రష్యా దాడుల నుంచి తమ దేశాన్ని రక్షించుకోవడానికి పలు పశ్చిమ దేశాలు, బ్రిటన్, అమెరికా ఉక్రెయిన్‌కు ఆయుధాలను పంపిణీ చేస్తున్నాయి. ఇటీవల రష్యాపై దీర్ఘశ్రేణి ఆయుధాలు ప్రయోగించకుండా ఉక్రెయిన్‌పై ఉన్న ఆంక్షలను పశ్చిమదేశాలు తొలగించడంతో కీవ్‌కు దీర్ఘశ్రేణి ఆయుధాలు ప్రయోగించే అవకాశం లభించింది.



# పోలీసుల అదుపులో మరో దేశద్రోహి!

**ఛండీఘర్, జూన్ 4:** గూఢచర్యం ఆరోపణలపై మరోపంజాబీ యూట్యూబర్‌ను మొహాలీలోని రాష్ట్ర స్పెషల్ ఆపరేషన్స్ సెల్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. జస్బీర్ అనే ఈ యువకుడు రూప్‌నగర్ జిల్లా మహ్లన్ గ్రామానికి చెందినవాడు. జాన్‌మహల్ అనే యూట్యూబ్‌ఛానల్ నిర్వహిస్తున్నాడు. ఐఎస్ఐకి కీలక సమాచారం చేరవేస్తుననట్లు ఆధారాలు లభించడంతో ఆతడిని ఎస్ఎస్ఒసి అదుపులోకి తీసుకుంది. ఇప్పటివరకూ మొహాలిలో ఉన్న ఈసెల్ 12మందికిపైగా అదుపులోకి తీసుకుంది. వారిలో ఇద్దరు యూట్యూబర్లుకూడా ఉన్నారు. పాకిస్థానీ ఉగ్రవాద నెట్‌వర్క్‌కు గతనెలలో కీలక రహస్యాలను చేరవేస్తున్నట్లు తేలింది. జ్యోతి మల్హోత్రాతోపాటు ఈ పంజాబీ యూట్యూబర్ కూడా అదే విద్రోహ చర్యలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. పంజాబ్ డిజిపి గౌరవ్ యాదవ్ మాట్లాడుతూ స్పష్టమైన ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఈ కీలక విద్రోహచర్యల నెట్‌వర్క్‌ను మా ఎస్ఎస్ఒసి ఛేదించిందని జస్బీర్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. జస్బీర్‌సింగ్ పర్సన్ ఆఫ్ ఇండియన్‌ఆరిజన్ షకీర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్నాడని ఉగ్ర సంబంధిత విద్రోహ కార్యకలాపాల విభాగానికి జట్ రణ్‌ధావా పేరుతో అత్యంత కీలకంగా వ్యవహరించాడు. ఇషాన్ ఉర్ రహమాన్ అలియాస్ డ్యానిష్‌తో కూడా అత్యంతసన్నిహితంగా ఉననట్లు తేలింది. ఢిల్లీలోజరిగిన పాక్ నేషనల్ డే వేడుకల్లో పాల్గొన్నాడు. డానిష్ ఆహ్వానంతో వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. అక్కడే పాకిస్తాన్ ఆర్మీ అధికారులు, వ్లాగర్లను కలుసుకున్నాడు. మూడు ప్రత్యేక సందర్భాల్లో జస్బీర్ పాకిస్తాన్‌లోపర్యటించాడు. సింగ్‌నుంచి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలనుంచి మొత్తం డేటాను సమీకరించారు. పాక్ ఆధారిత నంబర్లు అధికంగా ఉన్నాయి. వీటన్నింటిని సమగ్ర పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. జ్యోతి అరెస్టుతో జస్బీర్ తన కమ్యూనికేషన్ హిస్టరీ మొత్తం డిలిట్‌చేయాలని చూసాడు. పిఐఒలతో సంప్రదింపులన్నింటిని చెరిపివేసి అరెస్టును తప్పించుకోవాలని చూసినట్లు అధికారులు చెపుతున్నారు. మొహాలి ఎస్ఎస్ఒసి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసామని, దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

# రేపే జమ్ముకాశ్మీర్‌లో ప్రధాని మోడీ పర్యటన

## చీనాబ్ వంతెన, రైల్వేలైన్, వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ప్రారంభం

## ఆపరేషన్ సిందూర్ తర్వాత కాశ్మీర్‌లో మోడీ తొలిపర్యటన




**శ్రీనగర్, జూన్ 4:** ఆపరేషన్ సింధూర్ తర్వాత జమ్ముకాశ్మీర్‌లో మొదటిసారి ప్రధానిమోడీ పర్యటిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వంతెనచీనాబ్ వంతెనను ప్రారంభించడంతోపాటు శ్రీనగర్‌ను కొత్త రైల్వేలైన్‌తో దేశంలోని ఇతర రైల్వే నెట్‌వర్క్‌తో కలిపే ప్రాజెక్టును జాతికి అంకితంచేస్తారు. అలాగే ఎప్పటినుంచో కాశ్మీర్ వాసులు కలలు కంటున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా ప్రధానిమోడీ ఈనెల ఆరవ తేదీ ప్రారంబించనున్నారు. చీనాబ్ వంతెన ద్వారా భారత రైల్వే నెట్‌వర్క్‌తో జమ్ముకాశ్మీర్ అనుసంధానంఅవుతుంది. మరి కొన్ని రోజుల్లో కాట్రా శ్రీనగర్ వందేభా రత్‌రైలు నడుస్తుంది. జమ్ముఉద్ధంపూర్ రైల్వే లింక్‌ప్రాజెక్టు, శ్రీనగర్ బారాముల్లా మధ్య తుది రైలు లింక్‌ప్రాజెక్టులు కూడా ఇపుడు అమలుకు రానున్నాయి. అమర్‌నాథ్ యాత్రీకులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే వందేభారత్‌రైలును కూడా ఈనెల ఆరోతేదీనే ప్రారంభిస్తున్నారు. కాట్రా బారాముల్లామధ్య తొలిదశలో రైళ్ల నడిచేందుకు వీలుగా రైల్వేస్టేషన్ విస్తరణపనులు కూడా పూర్తిచేసారు. జమ్ముతావి రైల్వేస్టేషన్ విస్తరణ పనులు పూర్తి కావస్తున్నందున రైలు సర్వీసులు జమ్ముకు కూడా నడుపుతారు. కాట్రాలో దిగి మరోరైలు ఎక్కాల్సి ఉంది. ఇపుడు కాట్రా శ్రీనగర్ వందేభారత్‌వల్ల ఏటా అమర్‌నాథ్ యాత్రసీజన్‌లో యాత్రీకులకు ఎంతో అనువుగా ఉంటుందని అంచనా. ఉధంపూర్ శ్రీనగర్ బారా ముల్లా రైల్వేలైన్‌పరిధిలో 36 సొరంగాలున్నాయి. 119 కిలోమీటర్ల దూరం ఇవి కవర్ చేస్తున్నాయి. ఇక చీనాబ్ వంతెన పరంగా చూస్తే నీటిమట్టానికి 359 మీటర్ల ఎత్తులో నిర్మించారు. జమ్ముకాశ్మీర్‌లోనిరియాసి జిల్లాలో ఉన్న బక్కల్ కౌరి గ్రామాలను కలుపుతున్నది. రైల్వేలింక్ ప్రాజెక్టులో భాగమే చీనాబ్ వంతెన నిర్మాణం. ఈ వంతెన నిర్మాణంకోసం కేంద్రం 1486 కోట్లు ఖర్చుచేసింది. ఈనెల ఆరోతేదీ ప్రధాని పర్యటన కోసం మోడీ భద్రతా టీమ్ రంగంలోకి దిగింది. కాట్రా రైల్వేస్టేషన్, స్పోర్ట్స్ స్టేడియంలలో మోడీకి ఘనస్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మోడీ ర్యాలీ వేదిక, రైల్వేస్టేషన్, వంతెన ప్రాంతాలను ఇప్పటికే తమ అధీనంలోకి ఎస్‌పిజి తీసుకుంది. సమగ్ర తని ఖీలు చేపట్టింది.




# పాక్‌కు ఎడిబి 500 మిలియన్ డాలర్ల సాయం

**ఇస్లామాబాద్, జూన్ 4:** భారత్‌నుంచి ఆర్థిక ఆంక్షలు ప్రకటించాలని, రుణపరపతులపై అంతర్జాతీయ ద్రవ్యసంస్థలకు పదేపదే అభ్యంతరాలు చెపుతున్నా పాకిస్తాన్‌కు అటు ఐఎంఎఫ్, ఇటు ఆసియా అభివృద్ధి బ్యాంకులు రుణపరపతిని అందించాయి. అమెరికా ఐఎంఎఫ్ సుమారు 8500 కోట్ల రుణపరపతిని అందిస్తే తాజాగా ఆసియా అభివృద్ధి బ్యాంకు 300 మిలియన్ డాలర్ల పాలసీ ఆధారిత రుణాన్ని మంజూరు చేసింది. అలాగే 500 మిలియన్ డాలర్ల పథక ఆధారిత గ్యారంటీని కూడా ఇచ్చింది. ఐఎంఎఫ్‌నుంచి 8500 కోట్లు రుణపరపతిని సాధించిన వెంటనే ఈ కొత్తరుణం పాకిస్థాన్ సాధించుకోగలిగింది. ఆర్థికమంత్రి సలహాదారు ఖుర్రమ్ షెహజాద్ ఈ ఎడిబి ప్యాకేజిని ధృవీకరించారు. పాకిస్థాన్ ఆస్థిక సుస్థిరతను మరింతగా పెంచుకునేందుకు ఈ ప్యాకేజి ఉపయోగపడుతుందని ఎడిబి వెల్లడించింది. పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌కు కూడా సంస్కరణలతో అమలుచేసేందుకు వీలుకలుగుతుంది. ఎడిబి కంట్రీ డైరెక్టర్ ఎమ్మా ఫాన్ మాట్లాడుతూ పాకిస్థాన్ స్థూల ఆర్థికవ్యవస్థ మెరుగుపడేందుకు అవసరమైన ప్రగతిని సాధించిందని చెప్పారు. ఈ ఆర్థికసాయంతో ఆర్థికరంగపరంగా పాక్‌ప్రభుత్వం సంస్థాగత సంస్కరణలుమరిన్ని చేపట్టి ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను పట్టిష్టంచేసుకుంటూ సుస్థిర వృద్ధిని నమోదుచేస్తుందని ఎడిబి వ్యాఖ్యానించింది. పన్ను వ్యవస్థను మరింతగా సంస్కరిస్తుందని ప్రభుత్వ వ్యయం, నగదు పర్యవేక్షణలను నియంత్రిస్తుందని చెపుతున్నారు. డిజిటలైజేషన్, పెట్టుబడుల సౌకర్యం, ప్రైవేటు రంగ అభివృద్ధిని మరింతపెంచుకోవాలని ఎడిబి సూచించింది. ఈ చర్యల వల్ల పాకిస్థాన్ ఆర్థిక లోటును, ప్రభుత్వ రుణాన్ని మరింతగా తగ్గించుకోగలవని, సామాజిక అభివృద్ధి, సంక్షేమం పరంగా కూడా మరింతగా వ్యయం చేసేందుకు వీలవుతుందని నిపుణులు చెపుతు న్నారు. దేశీయంగా వనరుల సమీకరణ చేసుకుంటూ ఆర్థికవ్యవస్థను పటిష్టంచేసుకునేందుకు ఆర్థిక రంగ సంస్కరణలు అమలుచేసే వీలుటుందని చెప్పారు.

ఈ ఆర్థికసాయంతో పాక్ పన్నుల వ్యవ స్థ మెరుగుపడుతుందని, రాబడులు పెంచి ఆర్థిక క్రమశిక్షణ మెరుగుపడుతుందని దేశీయ నిపుణులు చెపుతున్నారు. ఎడిబి, ఐఎంఎఫ్‌ల సాయంతో దేశరాబడుల బేస్‌ను పెంచుతుందని, ఆర్థికంగా స్వయం సమృద్ధికి చేరుకునే వీలువుతుందని భావిస్తోంది. అయితే ఎడిబి అందించిన సాయాన్ని పాకిస్థాన్ దుర్వినియోగం చేస్తుందని, పన్ను నుంచి జిడిపి నిష్పత్తిలో వ్యయంచేయకుండా అంతర్జాతీయసాయాలను ఉగ్రవాదులకు సాయంగాఉపయోగించగలదని ఆందోళన వ్యక్తంచేసింది. రక్షణరంగవ్యయం అంచనాలకు మించి పెంచుకోవడంవల్ల ఆర్థిక సుస్థిరత ఏం బాగుపడుతుందని ప్రశ్నించింది.

# ఉత్తరకొరియాతో చర్చలు పునరుద్ధరిస్తా

## దక్షిణకొరియా కొత్త అధ్యక్షుడు లీజె మ్యూంగ్



**సియోల్, జూన్ 4:** ఉత్తర కొరియాతో చర్చలను పునఃప్రారంభిస్తానని, అమెరికా మరియు జపాన్‌లతో త్రైపాక్షిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తానని దక్షిణ కొరియా కొత్త అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ బుధవారం హామీ ఇచ్చారు, తన ఐదు సంవత్సరాల పదవీకాలానికి కీలక విధాన లక్ష్యాలను ఆయన నిర్దేశించారు. అసమానత మరియు అవినీతిపై పోరాడతానని ప్రతిజ్ఞ చేస్తూ దక్షిణ కొరియాలో ప్రముఖ లిబరల్ రాజకీయ నాయకుడిగా బాల్యం నుండి ఎదిగిన లీ, బుధవారం తన పాలనను అధికారికంగా ప్రారంభించారు, గత సంవత్సరం చివర్లో అప్పటి అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ విధించిన మార్షల్ లా కారణంగా తొలగించడం ద్వారా ఏప్రిల్‌లో జరిగిన ఆకస్మిక ఎన్నికల్లో గెలిచిజాతీయ అసెంబ్లీలో తన ప్రారంభోపన్యాసంలో, లీ తన ప్రభుత్వం దక్షిణ కొరియాయుఎస్ సైనిక కూటమి ఆధారంగా "బలమైన నిరోధకత"తో ఉత్తర కొరియా దురాక్రమణలను ఎదుర్కొంటుందని చెప్పారు. కానీ అతను "ఉత్తర కొరియాతో కమ్యూనికేషన్ ఛానెల్‌ను తెరిచి, చర్చలు మరియు సహకారం ద్వారా కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పుతానని" అన్నారు. పొరుగు దేశాలతో ఆచరణాత్మక దౌత్యాన్ని కొనసాగిస్తానని మరియు బలమైన దక్షిణ కొరియాయుఎస్ కూటమి ఆధారంగా సియోల్‌వాషింగ్టన్‌టోక్యో త్రైపాక్షిక సహకారాన్ని పెంచుతానని ఆయన అన్నారు. "జాతీయ ప్రయోజనాల ఆధారంగా ఆచరణాత్మక దౌత్యం ద్వారా, ప్రపంచ ఆర్థిక మరియు భద్రతా దృశ్యాలలో ప్రధాన మార్పు వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని మన జాతీయ ప్రయోజనాలను పెంచుకునే అవకాశంగా మారుస్తానని లీ అన్నారు. లీ ఎన్నిక దక్షిణ కొరియా విదేశాంగ విధానంలో ఏదైనా పెద్ద, తక్షణ మార్పుకు కారణమవుతుందా అనేది అస్పష్టంగా ఉంది. గతంలో చైనా మరియు ఉత్తర కొరియా వైపు మొగ్గు చూపుతున్నారని మరియు అమెరికా, జపాన్ నుండి దూరంగా ఉన్నారని విమర్శకులు ఆరోపించిన లీ, ఇటీవల దక్షిణ కొరియా తన విదేశాంగ విధానానికి పునాదిగా అమెరికాతో పొత్తును పదే పదే నొక్కి చెప్పారు. లీ కోసం ఎదురుచూస్తున్న అత్యంత కఠినమైన బాహ్య సవాళ్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యొక్క సుంకాల విధానం మరియు ఉత్తర కొరియా ముందుకు సాగిస్తున్న అణు కార్యక్రమం. కానీ అధ్యక్షుడు ఎవరు అయినా ఆ అంశాలపై దక్షిణ కొరియాకు అనుకూలంగా పెద్ద పురోగతి సాధించడానికి పెద్దగా చేయలేరని నిపుణులు గతంలో అన్నారు. తన పదవీ స్వీకార ప్రసంగంలో, లీ అమెరికాతో వాణిజ్య సమస్యలను నేరుగా ప్రస్తావించలేదు. నెమ్మదిస్తున్న దేశీయ ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపజేయడం తన ప్రధాన ప్రాధాన్యత అని మరియు మాంద్యం ముప్పులకు వ్యతిరేకంగా "ముఖ్యమైన పోరాటం" నిర్వహించడానికి తన ప్రభుత్వం వెంటనే అత్యవసర టాస్క్ ఫోర్స్‌ను ప్రారంభిస్తుందని లీ అన్నారు. ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడానికి మరింత దూకుడుగా ప్రభుత్వ ఖర్చును కూడా ఆయన హామీ ఇచ్చారు. దక్షిణ కొరియా కేంద్ర బ్యాంకు తన కీలక వడ్డీ రేటును తగ్గించి, 2025 సంవత్సరానికి దాని వృద్ధి అంచనాను 0.8శాతానికి తగ్గించింది. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ కిమ్ మ్యుంగ్‌సూతో టెలిఫోన్ కాల్‌లో, స్థానిక టీవీ ఫుటేజ్ ప్రకారం, ఉత్తర కొరియా కదలికలను నిశితంగా పర్యవేక్షించాలని మరియు దక్షిణ కొరియాయుఎస్ సైనిక కూటమి ఆధారంగా దృఢమైన సంసిద్ధతను కొనసాగించాలని లీ సైన్యాన్ని కోరారు. తరువాత లీ సియోల్‌లోని జాతీయ శ్మశానవాటికను సంద ర్శించి, అక్కడ ఖననం చేయబడిన కొరియా నాయకులు, దేశభక్తులు మరియు యుద్ధంలో మరణించిన వారికి నివాళులు అర్పించారు.



# జాతిపితిగా ముజిబుర్ రహ్మాన్ పేరు తొలగింపు..

## చట్టంలో మార్పు చేసిన యూనస్ ప్రభుత్వం

**ఢాకా, జూన్ 4:** బంగబంధు ముజిబుర్ రహ్మాన్, మాజీ ప్రధాని షేక్ హసీనా కుటుంబాన్ని చరిత్ర నుంచి కనుమరుగు చేసేలా బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం తన ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దానిలో భాగంగా బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్‌కు ఉన్న 'ఫాదర్ ఆఫ్ నేషన్' బిరుదును తొలగించింది. అలాగే స్వాతంత్ర్య సమరయోధులు అనే పదానికి కొత్త అర్థాన్ని ఇచ్చింది. ఈ మేరకు నేషనల్ ఫ్రీడమ్ ఫైటర్స్ కౌన్సిల్‌యాక్ట్‌ను సవరించిందని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనికి సంబంధించి మంగళవారం రాత్రి న్యాయశాఖ ఆర్డినెన్స్ జారీ చేసిందని తెలిపాయి. 'యూనస్ ప్రభుత్వం జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ పదాలు, చట్టంలో ఆయన పేరు ఉన్న భాగాలను తొలగించింది' అని ఓ మీడియా కథనం పేర్కొంది. ఇటీవల ముజిబుర్ చిత్రం ఉన్న కరెన్సీ నోట్ల స్థానంలో కొత్త డిజైన్‌తో కూడిన నోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దాని స్థానంలో హిందూ, బౌద్ధ ఆలయాల ఫొటోలను కరెన్సీ నోట్లపై ముద్రిస్తోంది. జూన్ 1వ తేదీ నుంచి కొత్తనోట్ల జారీ మొదలైంది. 'కొత్త డిజైన్, సిరీస్‌ప్రకారం.. కరెన్సీ నోట్లపై మానవ చిత్రాలు ఉండవు. వీటికి బదులుగా ప్రకృతి, ప్రాచుర్యం పొందిన ప్రదేశాలు ఉంటాయి' అని బంగ్లాదేశ్ బ్యాంక్ అధికార ప్రతినిధి వెల్లడించారు. తూర్పు పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌గా పేరు మార్చుకున్న తర్వాత 1972లో కరెన్సీ నోట్లపై ఓ మ్యాప్‌ను ముద్రించారు. అనంతరం షేక్ హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ చిత్రంతో కూడిన నోట్లను విడుదల చేశారు.

# పాకిస్థాన్‌కు ఎప్పుడూ ఎదురుదెబ్బలే

## తమ పరాభవాలు బయటపెట్టిన బిలావల్ భుట్టో



**ఇస్లామాబాద్, జూన్ 4:** అంతర్జాతీయ వేదికలపై తమ దేశానికి తగిలిన ఎదురుదెబ్బల గురించి స్వయంగా పాక్ నేత బిలావల్ భుట్టో వెల్లడించారు. కాశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితిలో లేవనెత్తేందుకు చేసిన ప్రయత్నాలకు ఫలితం దక్కలేదని వాపోయారు. ఆపరేషన్ సిందూర్‌పై ఏర్పాటైన భారత అఖిలపక్షం తరహాలో పాక్ కూడా తన విదేశాంగ శాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో ఆధ్వర్యంలో ఓ ఎంపిల బృందాన్ని ఏర్పాటు చేసింది. వీరిని అమెరికా పంపగా, ఆ పర్యటనలో భాగంగా న్యూయార్క్‌లోని ఐరాస కేంద్ర కార్యాలయంలో భుట్టో మాట్లాడారు. 'కాశ్మీర్ అంశానికి సంబంధించినంత వరకు మనం ఎదుర్కొంటున్న అడ్డంకులు ఇప్పటికే ఉన్నాయి. దీంతోపాటు ఇతర వేదికలపై ఎదురుదెబ్బలు తగిలాయి' అని వ్యాఖ్యానించారు. 'రెండు అణ్వస్త్ర దేశాల మధ్య వివాదాల పరిష్కార వ్యవస్థను తీసుకురావడం అసాధ్యం. మా రెండు దేశాలకు చెందిన నిఘా సంస్థలు ఐఎస్ఐ, రా..కలిసి కూర్చొని, ఈ ఉగ్రవాద శక్తులపై పోరాటం కోసం కలిపి పనిచేస్తే, ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గిపోతాయని నేను భావిస్తున్నాను' అని మాట్లాడారు. రెండు దేశాల మధ్య నిరంతర ఘర్షణ విద్రోహశక్తులను బలోపేతం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. నిత్యం ఉగ్రవాదాన్ని ఎగదోసే ఆ దేశం నీతులు చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. గతంలోనూ తన దేశం గురించి ఆయన వాస్తవాలు బయటపెట్టారు. ఉగ్రవాద సంస్థలతో పాకిస్థాన్‌కు సంబంధాలు నిజమేనంటూ ఇటీవల వెల్లడించారు. 'పాకిస్థాన్‌కు గతం ఉందనేది రహస్యం కాదని నేను భావిస్తున్నా. ఫలితంగా మనం బాధపడ్డాం. పాకిస్థాన్ నష్టపోయింది. ఆ పరిణామాల నుంచి పాఠాలు నేర్చుకున్నాం. ఈ సమస్య పరిష్కారానికి అంతర్గత సంస్కరణలు చేపట్టాం. పాకిస్థాన్ తీవ్రవాద చరిత్ర తిరస్కరించలేనిది. అయితే, అది ముగిసిన అధ్యాయం. అది మన చరిత్రలో ఒక దురదృష్ట భాగం' అని స్థానిక మీడియాతో భుట్టో వెల్లడించారు.

# హమాస్ కొత్త అధినేతగా అల్‌హద్దాద్!



**జెరూసెలేం, జూన్ 4:** గాజాలో హమాస్ సైనిక విభాగం అధిపతి మహమ్మద్ సిన్వార్ ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో మరణించడంతో, ఆ సంస్థ తదుపరి నాయకుడిగా ఇజ్ అల్‌దిన్ అల్‌హద్దాద్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. గాజాలో ప్రస్తుతం జీవించి ఉన్న అత్యంత సీనియర్ కమాండర్ అల్‌హద్దాదే కావడంతో, కార్యాచరణ నియంత్రణ ఆయన చేతుల్లోకి వెళ్తుందని జెరూసలేం పోస్ట్ నివేదించింది. ఖాన్ యూనస్‌లోని యూరోపియన్ ఆసుపత్రి ప్రాంగణంలో ఇజ్రాయెల్ ఐడీఎఫ్ జరిపిన దాడిలో మహమ్మద్ సిన్వార్ మరణించారు. 2024లో యహ్యా సిన్వార్, మహమ్మద్ డెయిఫ్‌ల హత్యల అనంతరం మహమ్మద్ సిన్వార్ హమాస్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఈ దాడిలో రఫా బ్రిగేడ్ కమాండర్ మహమ్మద్ షబానా, దక్షిణ ఖాన్‌యూనస్ బెటాలియన్ చీఫ్ మెహదీ క్వారా కూడా మరణించినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. కేవలం 30 సెకన్ల పాటు సాగిన ఈ దాడిలో 50కి పైగా ప్రెసిషన్‌గైడెడ్ ఆయుధాలను ఉపయోగించినట్లు తెలిసింది. ఆసుపత్రి భవనానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా, దాని కింద ఉన్న హమాస్ కమాండ్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగినట్లు సమాచారం. ఇజ్ అల్‌దిన్ అల్‌హద్దాద్ చాలాకాలంగా హమాస్ మిలిటరీ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్నారు. 2021 నుంచి గాజా నగరంలోని ఇజ్ అల్‌దిన్ అల్ ఖస్సామ్ బ్రిగేడ్స్‌కు నాయకత్వం వహిస్తున్నారు. నవంబర్ 2023 లో, ఆయనను హమాస్ ఉత్తర గాజా బ్రిగేడ్ అధిపతిగా నియమించారు. గాజాలోని హమాస్ ఐదుగురు అసలు బ్రిగేడ్ కమాండర్లలో ప్రస్తుతం జీవించి ఉన్నది అల్‌హద్దాద్ మాత్రమేనని జెరూసలేం పోస్ట్ పేర్కొంది. అత్యంత రహస్యంగా వ్యవహరించే అల్‌హద్దాద్, ఆరుసార్లు ఇజ్రాయెల్ హత్యాప్రయత్నాల నుంచి తప్పించుకున్నట్లు భావిస్తున్నారు. ఆయన తలపై ఇజ్రాయెల్ ప్రభుత్వం 6.22 కోట్ల రూపాయల రివార్డు ప్రకటించింది. అక్టోబర్ 7, 2023న ఇజ్రాయెల్‌పై జరిగిన దాడులకు కీలక ప్రణాళిక రచయితలలో అల్‌హద్దాద్ ఒకరని, ప్రస్తుతం ఇజ్రాయెల్ బందీలను నిర్బంధంలో ఉంచిన బృందాన్ని కూడా ఆయనే నియంత్రిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. హమాస్‌లోని అత్యధిక సీనియర్ నాయకులు మరణించిన నేపథ్యంలో, అల్‌హద్దాద్ ఇప్పుడు సైనిక వ్యూహర చనతో పాటు బందీలపై చర్చలను కూడా నిర్దేశించే అవకా శం ఉంది. ఈ పరిణామాలపై స్పందించిన ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్, తదుపరి వరుసలో నువ్వే ఉన్నావని అల్‌హద్దాద్‌ను నేరుగా హెచ్చరించారు. ఈ పరిణా మం గాజాలో ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది.

# అమెరికా అణుఒప్పంద ప్రతిపాదనలపై ఖొమైనీ ఆగ్రహం

**టెహ్రాన్, జూన్ 4:** ఇరాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఒమన్ రాజధాని మస్కట్‌లో జరిగిన పరోక్ష సమావేశంలో చర్చలు కొనసాగించాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నాయి. దాంతో ఈ విషయంలో తొలి అడుగు పడింది. అయితే అణుఒప్పందానికి సంబంధించి అమెరికా నుంచి వచ్చిన తొలి ప్రతిపాదనపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ విమర్శలు చేశారు. యూఎస్ ప్రతిపాదన తమ చర్యలకు పూర్తి వ్యతిరేకంగా ఉందని వ్యాఖ్యానించారు. దేశంలో 100 న్యూక్లియర్ పవర్‌ప్లాంట్లు ఉన్నా దేశం సుసంపన్నం కాకుంటే అవి ఉపయోగపడవని, మళ్లీ నిధుల కోసం అమెరికా ముందు చేయి చాచాల్సి వస్తుందని అన్నారు. అయితే అమెరికాతో అణు ఒప్పందాన్ని పూర్తిగా తిరస్కరిస్తున్నట్లు మాత్రం ఖమేనీ పేర్కొనలేదు. అణు ఒప్పందంపై చర్చలు జరుగుతున్నప్పటికీ యూఎస్ ప్రతిపాదన గురించి మాత్రం ఎలాంటి సమాచారం బయటకు రాలేదు. అయితే ఆక్సియోస్ అనే వార్తా వెబ్‌సైట్ వివరాల ప్రకారం ఇరాన్ తన చుట్టు పక్కల దేశాలతో కలిసి యురేనియం శుద్ధి కోసం ఒక కన్సార్టియంను ఏర్పాటు చేయాలని అమెరికా ప్రతిపాదించింది. కానీ దీనివల్ల టెహ్రాన్‌కు ఎంత నష్టం వాటిల్లుతుందనే విషయం తెలియాల్సి ఉంది. అయితే ఇరుదేశాల మధ్య ఒప్పందం విఫలమైతే ఇప్పటికే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఇరాన్ ఆర్థికవ్యవస్థ మరింత పతనమయ్యే అవకాశం ఉంది. మరో వైపు మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశంఉంది. ఇరాన్ అణ్వాయు ధా లను అభివృద్ధి చేసుకోకుండా నిలువరించేందుకు కొద్దికాలంగా అమెరికా ప్రయత్నాలు చేస్తోంది.

# అయోధ్యను సందర్శించిన ఎలాన్‌మస్క్ తండ్రి ఎరోల్‌మస్క్



**అయోధ్య, జూన్ 4:** ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తండ్రి ఎరోల్ మస్క్ భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరానికి వెళ్లారు. అక్కడ నూతనంగా నిర్మించిన అయోధ్య రామ మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. భారతదేశం ఓ అద్భుతమైన ప్రదేశం అని పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలు ప్రేమ, దయ కలిగిన వ్యక్తులు అని అన్నారు. కాగా, దక్షిణాఫ్రికాకు చెందిన ఎరోల్ మస్క్ తన స్కూల్ ఫ్రెండ్ అయిన మాయే మస్క్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు పుట్టారు. ఆ తర్వాత కొన్నేళ్లకే వీరు విడాకులు తీసుకున్నారు. మాయే మస్క్ తన ముగ్గురు పిల్లల్ని ఒంటరిగానే పెంచింది. సింగిల్ మదర్‌గా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంది. ఇక ఎలాన్ మస్క్‌కు తన తండ్రి ఎరోల్ మస్క్‌తో విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. తండ్రంటే మస్క్‌కు అస్సలు ఇష్టం ఉండదు. 'మా నాన్న దుర్మార్గానికి ప్రతిరూపం. ఒక మనిషి ఎంత దారుణానికి ఒడిగట్టగలడో, అంతా తను చేయగలడు' అని ఓ సందర్భంలో స్వయంగా మస్క్ భారంగా వెల్లడించాడు.

## భారత్ దౌత్య బృందాల సమావేశాన్ని పాకిస్థాన్ అడ్డుకునే ప్రయత్నం..

# పట్టించుకోని మలేసియా ప్రభుత్వం!

**న్యూఢిల్లీ, జూన్ 4:** ఆపరేషన్ సిందూర్‌పై వివిధ దేశాలకు వివరించడానికి పార్లమెంటు సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాలు ఆయా దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. జనతా దళ్‌కు చెందిన పార్లమెంట్ సభ్యుడు సంజయ్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష దౌత్య ప్రతినిధి బృందం మలేసియాలో నిర్వహించాలనుకున్న కార్యక్రమాలన్నింటిని రద్దు చేయాలంటూ పాక్ ఎంబసీ మలే సియా ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమయంలో మతం అంశాన్ని ముందుపెట్టింది. 'మనవి ముస్లిందేశాలు భారత ప్రతినిధుల మాటలు వినకండి.

ఆ దేశ బృందం కార్యక్రమాలను రద్దు చేయండి' అని అభ్యర్థించింది. దీంతోపాటు కశ్మీర్ అంశం ఐక్యరాజ్యసమితి పరిశీలనలో ఉం దని కొన్ని దేశాలను భారత్‌కు దూరం చేసే ప్రయత్నాలు చేసింది. కానీ మలేసియా మాత్రం ఇవేవీ పట్టించుకోలేదు.

# అనంతపురం - కె.ఎస్.ఆర్ బెంగళూరు మెమూ రైలు ప్రారంభం

**- జెండా ఊపి ప్రారంభించిన ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, డిఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా**



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 4 ప్రభాతవార్త** అనంతపురం రైల్వేస్టేషన్‌లో బుధవారం అనంతపురం కె.ఎస్.ఆర్ బెంగళూరు (రైలు నెం. 66560 అనంతపురం - కె.ఎస్.ఆర్ బెంగళూరు మెమూ) రైలును జెండా ఊపి ప్రారంభించే కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, డిఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, అహుడా చైర్మన్ టి.సి.వరుణ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైలును ప్రారంభించి అనంతపురం రైల్వే స్టేషన్ నుండి ప్రసన్నాయనపల్లి రైల్వేస్టేషన్ వరకు రైలులో ఎంపి, ఎమ్మెల్యే, రైల్వే అధికారులు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం నుండి కె.ఎస్.ఆర్ బెంగళూరుకు రైలు ఏర్పాటు చేసే సువర్ణావకాశం తమకు లభించిందన్నారు. అనంతపురం నుండి బెంగళూరుకు ఉద్యోగులు, వ్యాపారులు, రోగులు, విద్యార్థులు కేవలం 50 రూపాయలతో వెళ్ళవచ్చున్నారు. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర రైల్వే శాఖ మంత్రులు అశ్వినివైష్ణవ్, వి.సోమన్న సహకారంతో అనంతపురం నుండి కె.ఎస్.ఆర్ బెంగళూరుకు రైలును విజయవంతంగా ఏర్పాటు చేసుకున్నామని, ఇందుకు చాలా సంతోషంగా వుందన్నారు. గతంలో ఈ రైలు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నుండి బెంగళూరు వెళ్లేదని, వెస్టన్ రైల్వే ఆధ్వర్యంలో వున్న పుట్టపర్తి బెంగుళూరు నుండి, సౌత్ సెంట్రల్ రైల్వే ఆధ్వర్యంలో అనంతపురం నుండి రైలు ఏర్పాటు చేయాలంటే ప్రత్యేకంగా పైలట్ కావాల్సి వుందన్నారు. గతంలో 8 బోగిలతో నడుస్తుండగా ప్రస్తుతం 12 బోగిలతో అనంతపురం నుండి బెంగళూరుకు రైలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రైలు ఏర్పాటు చేయడం పట్ల నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. తమ ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి వుందన్నారు. ఇప్పటికే పెన్షన్, గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, ఇతర పథకాలు కూడా అమలు చేస్తామన్నారు. జిల్లాలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని, ఇందుకు జిల్లా కలెక్టర్ బాగా పని చేస్తున్నారన్నారు. కేంద్రం గుంతకల్లు డివిజన్‌కు 500 కోట్ల రూపాయలను కేటాయించారని, అనంతపురం రైల్వేస్టేషన్లో అభివృద్ధి పనులను 50 కోట్ల రూపాయలతో చేపడుతున్నారని, ధర్మవరం, తాడిపత్రి, గుంతకల్లు, హిందూపురం రైల్వే స్టేషన్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతపురం మీదుగా విజయవాడ నుండి బెంగళూరుకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. యశ్వంతపూర్ నుండి మచిలీపట్నం వెళ్లే మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ ప్రతిరోజు వెళ్లేలా చూడాలని, యశ్వంతపూర్ నుండి హజరత్ నిజాముద్దీన్ వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్ అనంతపురంలో నిలపాలని, ధర్మవరం నుండి మచిలీపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ యాడికి మండలం రాయలచెరువులో నిలపాలని, యశ్వంతపూర్ నుండి లాతూర్ రోడ్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ అనంతపురంలో నిలపాలని, యశ్వంతపూర్ నుండి బీదర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ అనంతపురంలో నిలపాలని, ఇందుకు రైల్వే అధికారుల కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ పండుగ వాతావరణంలో అనంతపురం - కె.ఎస్.ఆర్ బెంగళూరు రైలు ప్రారంభించుకుంటున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయ్యిందని, ఈ సందర్భంగా బుధవారం ఈ కార్యక్రమం చేయడం సంతోషకరమన్నారు. అనంతపురం, హిందూపురం ఎంపిలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథిలు పార్లమెంట్‌లో మాట్లాడారని, ఎన్నో ఏళ్ల కల అయిన అనంతపురం నుండి బెంగళూరుకు రైలు వచ్చేలా కృషి చేశారన్నారు. గతంలో రాయితీపై వెళుతున్న జర్నలిస్టు పాసులను కరోనా సమయంలో రైల్వే అధికారులు రద్దు చేశారని తిరిగి మరలా రాయితీ మీద జర్నలిస్టులు ప్రయాణం చేయడానికి అవకాశం కల్పించాలని పలువురు జర్నలిస్టులు ఎంపి, ఎమ్మెల్యేలకు తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ జెఎల్ మురళి, డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశ్వర్లు, వాల్మీకి సంఘం డైరెక్టర్ ఈశ్వర్, మెడికల్ బోర్డు మెంబర్స్ రవికాంత్, రమణ, నరసింహులు, సౌత్ సెంట్రల్ రైల్వే డిజిఎం ఉదయ్‌నాథ్, రైల్వే సీనియర్ డిజిఎం మనోజ్, సీనియర్ డిఓఎం శ్రవణ్‌కుమార్, సీనియర్ డిఇఇ, టిఆర్‌డి సుదర్శన్‌రెడ్డి, ఎడిఆర్ఎం సుధాకర్, రైల్వే స్టేషన్ మాస్టర్ అశోక్‌కుమార్, స్టేషన్ ఎస్‌సి ఈ మెంబర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## ఆనందనిలయం అనంతస్వర్ణమయం దాతలకు విఐపి బ్రేక్ దర్శనం

**- ఏడాదిలో 3రోజులు జనరల్ బ్రేక్, 20 చిన్నలడ్డూలు**

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగ వైకుంఠం ఏడుకొండలపై కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి నిలయమైన ఆనందనిలయం అనంతస్వర్ణమయం చేసే పనులకు గతంలో విరివిగా విరాళాలిచ్చిన దాతలకు ఇప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానం సౌకర్యాలు సవరించింది. దీంతో గతంలో ఆనందనిలయం అనంతస్వర్ణ మయంకు విరాళాలిచ్చిన దాతలకు ఏడాదిలో ఐదుమందికి మూడుసార్లు విఐపి బ్రేక్ జనరల్ దర్శనం ఇవ్వాలని ఇటీవల టిటిడి ధర్మకర్తలమండలి నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. 2008వ సంవత్సరంలో టిటిడి సంకల్పించిన ఈ పథకాన్ని కొన్ని అనివార్యకారణాల వల్ల నిలిపివేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ పథకానికి విరాళం ఇచ్చిన దాతలకు అర్చనానంతరం దర్శనం కల్పించాలని నిర్ణయించారు. అయితే ఇప్పుడు గత కొంతకాలంగా అర్చనానంతరం దర్శన సేవ లేకపోవడంతో ప్రస్తుతం టిటిడి ధర్మకర్తలమండలి ఈ పథకం దాతలకు ప్రత్యామ్నాయంగా విఐపి బ్రేక్ జనరల్ కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దాతలకు సవరించిన సౌకర్యాలను వెల్లడించింది. అర్చనానంతరం దర్శనానికి బదులుగా ఏడాదిలో గరిష్టంగా 5మంది కుటుంబసభ్యులకు విఐపి బ్రేక్ జనరల్ దర్శనాలకు అనుమతిచ్చారు. 2,500 రూపాయలు టారిఫ్‌లో అద్దెగది సంవత్సరానికి మూడురోజులు వసతి కల్పిస్తారు. సంవత్సరానికి 20 చిన్నలడ్డూలు ప్రసాదంగా అందిస్తారు. దాతల దర్శన సమయంలో 5గ్రాముల బంగారుడాలర్, 50గ్రాముల వెండి నాణెం బహుమానంగా ఇవ్వనున్నారు. సంవత్సరానికి ఒకసారి 10మహాప్రసాదం ప్యాకెట్లు అందిస్తారు. విరాళం పాస్‌బుక్ జారీచేసిన తేదీనుండి 25సంవత్సరాలు చెల్లుబాటులో ఉంటుంది.

## తిరుమలలో తప్పిపోయిన గద్వాల భక్తుడు

**తిరుమల,జూన్ 4ప్రభాతవార్తప్రతినిధి:** వారంరోజుల క్రిందట శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చి క్యూలైన్ రద్దీలో తప్పిపోయిన తెలంగాణ గద్వాల పెద్దపోతులపాడుకు చెందిన మద్దిలేటి(52) తప్పిపోయాడని తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. మద్దిలేటి తన భార్యలక్ష్మీదేవి బంధువులతో కలసి గతనెల 27న తిరుమలకు వచ్చారు. అలిపిరి మెట్టమార్గంలో తిరుమలకు చేరుకుని అదేరోజు రాత్రి వైకుంఠమ్ 2 కంపార్టుమెంట్‌నుండి క్యూలైన్‌లోకి వస్తూ భక్తుల రద్దీతో తప్పిపోయాడు. దర్శనం ముగించుకుని ఆలయం వెలుపలకు వచ్చిన బంధువులతో మద్దిలేటి కనిపించలేదు, అందరూ తిరుగుప్రయాణమైన స్వగ్రామం, కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్ళలో వెదికారు. ఆయన ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం తిరుమలకు వచ్చి కుటుంబసభ్యులు 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తిరుమల 1టౌన్ ఎస్ఐ కేసు నమోదు చేశారు. వృద్ధుని ఆచూకీ తెలిస్తే 0877-2289027, 9440796771, 9581832190, 9014468661 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## సాంకేతికతతో భద్రతను మెరుగుపరచుకోవాలి

**- విధుల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించండి**
**- తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ**



**తిరుమల, జూన్ 4ప్రభాతవార్తప్రతినిధి:** దేశం నలుమూలల నుండి ప్రతిరోజూ పలు రకాల మనస్తత్వాలు కలిగిన భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తుంటారని, ప్రధానప్రవేశద్వారం అలిపిరి తనిఖీ కేంద్రం నుండి తిరుమల ఆనందనిలయం వరకు భద్రతా విభాగాలు సమన్వయంతో వ్యవహరించాలని తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ సూచించారు. పూర్తిగా నిఘాతో పరిసరాలపై డేగకన్ను వేయాలన్నారు. భక్తుల కదలికలు, వారి ప్రవర్తన కూడా గమనించాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఉన్నా, చేతుల్లో నిషేధిత పదార్థాలు ఉన్న వెంటనే అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి అదుపులోకి తీసుకోవాలన్నారు. తిరుపతి అలిపిరితనిఖీకేంద్రంతో బాటు తిరుమలలో యాత్రికుల విశ్రాంతి సముదాయాలు, అతిథిగృహాలు, భక్తుల రద్దీగా ఉండే ప్రాంతాల్లో భద్రత సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. సామాన్యభక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా భద్రత ఉండాలన్నారు. అంతేగాక తిరుమలకు వచ్చే భక్తులు నిషేధిత వస్తువులు తీసుకురాకుండా అవగాహన కల్పించాలని, వారిలో చైతన్యం కలిగించాలన్నారు. నిషేధిత వస్తువులు తనిఖీ చేసే సమయంలో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా వ్యవహరించాలని అదనపు ఎస్పీ తెలిపారు. తిరుమల ఆస్థానమండపంలో తిరుమల భద్రత, భక్తులకు రక్షణ,లగేజీలకు భద్రత కల్పించే అంశాలపై పోలీస్, విజిలెన్స్ సెక్యూరిటీ, ఆక్టోపస్, ఇంటెలిజెన్స్, టిటిడి ఉద్యోగులు, సిబ్బంది, దుకాణాల యజమానులు, వ్యాపారులతో బుధవారం ఉదయం కీలక సమావేశం నిర్వహించారు. అందరికీ సాంకేతిక పరంగా అవగాహన కల్పించడంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. భక్తులను తనిఖీ చేయడం,వారి లగేజీలను తనిఖీ ,వాహనాలను ఎలా తనిఖీ చేసి పంపుతున్నారనే విషయాలపై మరింత క్షుణ్ణంగా అవగాహన ఉండాలన్నారు. సిసికెమెరాలు ఏర్పాటు, వాటి పనితీరును కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిరంతరాయంగా సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. భక్తుల వాహనాలను,అనుమానాస్పద కార్యకలాపాలను, వస్తువులను పసిగట్టి బయటకు తీయాలన్నారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. భక్తుల రద్దీ సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆయన విజిలెన్స్, ఎస్‌పిఎఫ్, టిటిడి సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సమావేశంలో తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, విజిలెన్స్ విఎస్ఓ అల్లం సురేంద్ర, టిటిడి ఓఎస్‌డి సత్రానాయక్,తిరుమల సిఐలు విజయకుమార్, శేషాద్రి,హరిప్రసాద్,ఆక్టోపస్ అధికారులు, దుకాణాల యజమానులు, వ్యాపారులు పాల్గొన్నారు.

# రెండు లారీలు ఢీ : చెలరేగిన మంటలు

**మర్రిపాడు (నెల్లూరు), జూన్ 4, ప్రభాతవార్త :** నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై మర్రిపాడు మండలం కండ్రిక సమీపంలో బుధవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొనడంతో ఒక లారీలో మంటలు చెలరేగాయి. జాతీయ రహదారిపక్కన ఒక ట్యాంకర్ తో కూడిన లారీ పడి ఉండడం చూసి అటువైపు వెళుతున్న మరొక లారీ చూసేందుకు జాతీయరహదారి పక్కన నిలిపివేశాడు. ఈ తరుణంలో మరొక లారీ ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. బోల్తాపడిన ఆయిల్ ట్యాంకర్‌లోని ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో లారీ డీజిల్ ట్యాంక్ పగిలిపోవడంతో అక్కడికక్కడే మంటలు చెలరేగాయి. ప్రమాదం నుండి డ్రైవం, క్లీనర్ బయటపడ్డారు. చెలరేగిన మంటలను మర్రిపాడు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దీంతో పెనుప్రమాదం తప్పిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



జగ్గయ్యపేటలో భారీ ఎత్తున వైఎస్ఆర్‌సిపి వెన్నుపోటు దినోత్సవ ఆందోళనలో పార్టీ నేతలు, కార్యకర్తలు

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై దద్దరిల్లిన జగ్గయ్యపేట

**జగ్గయ్యపేట, జూన్ 4, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో భారీ ఎత్తున వైఎస్ఆర్‌సిపి వెన్నుపోటు దినోత్సవ ఆందోళన నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో మాజీఎంపి, పార్టీ పరిశీలకులు వేణుగోపాలరెడ్డి పాల్గొని కార్యకర్తలు, నేతలను ఉత్తేజపర్చారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు పట్టణ ప్రధాన వీధుల్లో కొనసాగిన ర్యాలీలో కూటమి ప్రభుత్వం అరాచక పరిపాలన కొనసాగిస్తుందని నినాదాలుచేశారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గుర్తుచేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రెవిన్యూశాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కాగా నిరసన కార్యక్రమానికి భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనటం పట్టణంలో చర్చనీయాంశమయ్యింది.

# ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైసిపి నిరసనలు గ్రాండ్ సక్సెస్

**- వెన్నుపోటు దినం పేరుతో పోటాపోటీగా నిరసన కార్యక్రమాలు - కార్యకర్తల నుంచి అనూహ్యస్పందన**




నిరసనలు వ్యక్తం చేస్తున్న దృశ్యాలు

**అనంతపురం, జూన్ 4 ప్రభాతవార్త బ్యూరో** వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బుధవారం వెన్నుపోటు దినం పేరుతో నిర్వహించిన నిరసనలు, రార్యలీలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. నియోజకవర్గ ఇన్‌చార్జులు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఎక్కడ చూసినా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నియోజకవర్గాల సమన్వయ కర్తలు పోటాపోటీగా ఈ నిరసన కార్యక్రమాన్ని, ర్యాలీలను సక్సెస్ చేసేందుకు గట్టిగా శ్రమించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా వెన్నుపోటు దినం పేరుతో ర్యాలీలు నిర్వహించి అధికారులకు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమాలను చేపట్టాలని వైసిపి రాష్ట్ర శాఖ పిలుపునివ్వడంతో ఆ మేరకు అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున సన్నాహాలు చేసుకున్నారు. ఒక్క తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దరెడ్డిని ఎల్లనూరు మండలం తిమ్మంపల్లిలో గృహ నిర్బంధం చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికిలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని చేపట్టాలని పెద్దారెడ్డి నేతృత్వంలో నాయకులు నిర్ణయం తీసుకున్నారు. తాడిపత్రిలోకి ప్రవేశం లేనందున యాడికిలో నిరసన కార్యక్రమం చేపట్టాలని యత్నించారు. అయితే అక్కడికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వెళ్లేందుకు పోలీసు అధికారులు అనుమతించకపోవడంతో యాడికిలో వెన్నుపోటు నిరసన కార్యక్రమాన్ని వైసిపి కార్యకర్తలు నాయకులు నిర్వహించారు. ఇదే విధంగా అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి నేతృత్వంలో అనంతపురంలోనూ, శ్రీ సత్యసాయిజిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ నేతృత్వంలో పెనుకొండలో వైసిపి కార్యకర్తలు, నాయకులు నిరసన ర్యాలీలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మాజీ మంత్రి శింగనమల సమన్వయ కర్త డా.శైలజానాథ్ నేతృత్వంలో నార్పలలోనూ, మాజీ ఎంపి రంగయ్య నేతృత్వంలో కళ్యాణదుర్గంలోనూ, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నేతృత్వంలో రాప్తాడులోనూ, మడకశిర సమన్వయ కర్త ఈరలక్కప్ప నేతృత్వంలో మడకశిరలోనూ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఉరవకొండలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇదే విధంగా ఆయా నియోజకవర్గాల్లో వైసిపి సమన్వయ కర్తలు, పార్టీ పరిశీలకులు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. వైసిపి చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీల్లో వైసిపి సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఇతర ముఖ్య నేతలు కూడా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీలో పాల్గొనడం విశేషం. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాల్లో కూటమి ప్రభుత్వం ఏడాదైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, సూపర్‌సిక్స్ పథకాలను పట్టించుకోలేదని, ఇంటిదగ్గరకు వచ్చి అందించే రేషన్‌ను తీసివేశారని, చంద్రబాబుపాలన అధ్వానంగా ఉందని, కూటమి ప్రభుత్వంలో అరాచకాలు ఎక్కువయ్యాయని ఆరోపణలు సంధించారు.

# ఎలక్ట్రానిక్ పద్ధతిలో పెన్షన్ మంజూరు పత్రాలు

**- రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ**

**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 4, ప్రభాతవార్త :** బుధవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్, జిపిఎఫ్ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక అదాలత్ నిర్వహించారు. 55 మందికి పెన్షన్ మంజూరు పత్రాలను, 15 మందికి జి పి ఎఫ్ ఆథరైజేషన్ లేఖలను నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పెన్షన్ ప్రతిపాదనల మంజూరు ప్రక్రియ ఏజి కార్యాలయంలో ఏవిధంగా జరుగుతుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పెన్షన్ ప్రతిపాదనలను పంపే సమయంలో దరఖాస్తుతో పాటు ఏయే పత్రాలను జతపరచవలెనో ప్రతి ఒక్కరూ విధిగా తెలుసుకోవాలన్నారు. అలాగే సదరు ప్రతిపాదనలను పంపుటకు రిటైర్ అయ్యేంతవరకు వేచి ఉండక్కర్లేదని, మూడు నెలలు ముందుగానే పంపవచ్చని తెలిపారు. కానీ అనేకమంది ఇప్పటికీ పదవీ విరమణ చేసిన అనంతరమే పెన్షన్ ప్రతిపాదనలను పంపుతున్నారని వివరించారు. దీని వల్ల ఆయా ఉద్యోగులు రిటైర్ అయ్యాక పెన్షన్ మంజూరు కాలేదని ఆవేదన చెందుతుండటం గమనించామన్నారు. అదేవిధంగా ఈమాసం నుండి ఆర్థిక శాఖ పరిధిలోని ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్, ఏపీజిఎల్ఐ తదితర శాఖల నుండి రిటైరయ్యే ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఇ పి పి ఓ పెన్షన్ మంజూరు పత్రాలను అందజేస్తామన్నారు. అందులోని సాధక బాధకాలను సవరిస్తూ వచ్చే నెల నుండి విద్యాశాఖతో మొదలుపెట్టి క్రమంగా అన్ని శాఖల్లోని ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ పద్ధతిలోనే పి పి ఓ లను అందజేస్తామన్నారు. ఇందుకోసం ప్రతి ఉద్యోగి నేరుగా తానే ఆన్లైన్లో దరఖాస్తును పూరించి అవసరమైన పత్రాలను జతచేసి డిడిఓ లకు సమర్పించవలసి ఉంటుందన్నారు. ఆయా డిడిఓ ల నుండి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి, ఆన్లైన్ ద్వారానే పెన్షన్ మంజూరు పత్రాలను పంపుతామన్నారు. ఆన్లైన్లో దరఖాస్తును సమర్పించవలసిన విధానం గురించి వీడియో సైతం తయారు చేయడం జరిగిందని, ఈ వీడియోను అందరి ఉద్యోగులకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఉద్యోగులు సాధారణంగా చేసే తప్పులను వివరిస్తూ, నిర్ణీత సమయంలో పంపకపోవడం, సంతకాలు చేయకపోవడం, నామినేషన్ పత్రాలను సరిగా నింపకపోవడం తదితరాల వలన పెన్షన్ మంజూరు ఆలస్యం అవుతుందన్నారు. ఇప్పటివరకు ఇటువంటి అదాలత్ లు పది జిల్లాల్లో పూర్తి చేశామని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సేవలందించేందుకు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని వివరించారు. రాష్ట్ర ట్రెజరీ శాఖ డైరెక్టర్ మోహన్ రావు మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా ప్రభుత్వ సర్వీసు పూర్తిచేసి పెన్షన్ మంజూరు కొరకు రాష్ట్ర కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండా ఏజీ కార్యాలయం వారు నేరుగా జిల్లాలకు కదిలి రావడం ఉద్యోగుల అదృష్టమని అన్నారు. డిఆర్వో ఉదయ భాస్కర్ మాట్లాడుతూ పెన్షన్ ప్రతిపాదనలను పంపేటప్పుడు ఎటువంటి తప్పులు లేకుండా చూసుకోవడం, అవసరమైన పత్రాలను జత చేయడం, పదవీ విరమణకు ముందే సదరు ప్రతిపాదనలను పంపడం వంటి చర్యలతో ఎటువంటి ఆలస్యం లేకుండా పెన్షన్ పొందే అవకాశం ఉందన్నారు.

# డిఫెన్స్ క్లష్టర్ ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో భూములు-సర్వే నివేదికల పరిశీలన

**జగ్గయ్యపేట, జూన్ 4, ప్రభాతవార్త :** కేంద్రప్రభుత్వం డిఫెన్స్ క్లష్టర్ ఏర్పాటుకు ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని జయంతిపురం, వేదాద్రి గ్రామాల్లో ఎంపికచేసిన భూములను, సర్వే నివేదికలను డిఆర్‌డిఓ డిజె ఆర్ జోషితో కలిసి బుధవారం జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ డిఫెన్స్ క్లష్టర్ ఏర్పాటుకు నిర్దేశించిన భూముల్లో సాయిల్ టెస్టింగ్ చేయాల్సిన అవసరం ఉన్నదని రెండు వారాల్లో సంబంధిత డిపార్టుమెంట్ యంత్రాంగం వచ్చి వారి విధులను నిర్వర్తిస్తారని అన్నారు. ఈప్రాజెక్టు ద్వారా నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనలు పెరుగుతాయని సంతోషం వ్యక్తంచేశారు. ఈయూనిట్ ఏర్పాటుకు ఎంతో కృషిచేసిన సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కాగా ఈకార్యక్రమంలో డిఆర్‌డిఓ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ఎస్ఎస్ ప్రసాదు, డిప్యూటీ కలెక్టర్ ఏపిఐఐసి బాబ్జి, జెడ్ఎం నాగార్జునరెడ్డి, ఆర్డీఓ బాలకృష్ణ, తహసీల్దార్ పెద్ది మనోహర్ తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు. జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల విజేతలకు అభినంద ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల విజేతలు గొట్టే సురేష్, గొట్టే తరుణ్‌లను స్థానియ ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ అభినందించారు. 22వ వార్డు కౌన్సిలర్ గొట్టే నాగరాజు కుమారుడు సురేష్, మిట్టగూడానికి చెందిన గొట్టే ఉపేంద్ర కుమారుడు తరుణ్ జగ్గయ్యపేట పట్టణంలోని ఐ జిమ్‌లో పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందుతూ గత నెల 30, జూన్ 1వ తేదీల్లో ఢిల్లీలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని 93 కిలోల విభాగంలో సురేష్ ద్వితీయస్థానాన్ని, సబ్ జూనియర్స్‌లో తరుణ్ 53 కిలోల విభాగంలో తృతీయస్థానాన్ని సాధించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**రహదారులు మరియు భవనముల శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
సుమారు రూ.2.30 లక్షల విలువ గల పనికి నిట్ నెం. 16/ఇ.ఇ/ఆర్ & బి/నరసరావుపేట/2025-26, తేది: 31.05.2025 ద్వారా టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.apeprocurement.gov.in తేది: 10.06.2025, మ.3.00 గం.ల నుండి 24.06.2025, మ.3.00 గం.ల వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజను, నరసరావుపేట
DIPR.No.16617/CL/Advt/1/1/2022-23, తేది: 04.06.2025

# తెలంగాణలో 18 నుంచి టెట్-2025 పరీక్షలు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) -2025 పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఈ నెల 18 నుంచి 30 వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్య డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి బుధవారం విడుదల చేశారు. పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటీ) విధానంలో నిర్వహించనున్నారు. రోజూ రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహిస్తారు. మొదటి సెషన్‌ను ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2 గంటల నుంచి 4:30 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ నెల 9 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ ప్రకటించింది. టెట్ పరీక్షలను ఈ నెల 15 నుంచి ప్రారంభిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నప్పటికీ ఈ నెల 15 నుంచి కాకుండా 18వ తేదీ నుంచి నిర్వహించాలని నిర్ణయిం

# డ్రగ్స్ కేసులో ఎపి కానిస్టేబుల్ అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** హైదరాబాద్ కూకట్‌పల్లిలో భారీగా పట్టుబడిన డ్రగ్స్ ఘటన కేసులో నిందితుడిగా ఉన్న ఏపీ కానిస్టేబుల్ గుణశేఖర్‌ను బుధవారం సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల ఓ ముఠా డ్రగ్స్ సరఫరా చేస్తుందనే విశ్వసనీయ సమాచారంతో బాలానగర్ పోలీసులతో కలిసి ఎస్వోటీ పక్కా నిఘాతో దాడులు చేయడంతో మాదకద్రవ్యాల ముఠా పట్టుబడింది తెలిసిందే. 840గ్రాముల కొకైన్‌ను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా..తిరుపతికి చెందిన సదరు కానిస్టేబుల్ గుణశేఖర్ తప్పించుకున్నాడు. పరారీలో ఉన్న అతన్ని కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి ఫోన్‌డేటా, సీసీకెమెరాల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు పట్టుబడ్డాడు. అయితే సురేంద్ర, గుణశేఖర్‌లు తిరుపతిలో ఎన్నో అక్రమ కలాపాలు చేశారన్న ఆరోపణలు కూడా వెలుగుచూస్తున్నాయి. అక్రమ ఫ్లాట్ల దందా కూడా నడిపి ఎందరినో మోసగించిన చరిత్ర కూడా ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే తిరుపతికి చెందిన ఉన్నం సురేంద్ర, బాపట్ల జిల్లాకు చెందిన దొంతి రెడ్డి హరిబాబు రెడ్డి , అద్దంకికి చెందిన చెగుడు మెర్సీ మార్గరెట్, షేక్ మస్తాన్‌వలీ, దేవరాజు యేసుబాబులు పోలీసుల అదుపులో ఉన్నారు.

# నవీముంబయిలో భగ్గుమన్న ఐదు బస్సులు

**బస్సు టెర్మినల్‌లో భారీ అగ్నిప్రమాదం**

**నవీముంబయి, జూన్ 4:** బస్సు టెర్మినల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం ఐదు బస్సులు దగ్ధం అయ్యాయి. నవీముంబయిలోని ఘన్‌సోలి బస్ డిపోలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వాటిలో కొన్ని ఎలక్ట్రిక్, డీజిల్ బస్సులున్నట్లు అధికారులు తెలిపారు.విద్యుత్ బస్సులో రిపేర్ల సందర్భంగా జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌వల్లనే ఈప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే కార్మికులు సిబ్బందికి ఎలాంటి ప్రాణహాని లేదని అగ్నిమాపక సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈప్రమాదానికి ముందే కొన్నిరోజుల క్రితమేబృహన్‌ముంబయి ఎలక్ట్రిక్ సప్లయి అండ్‌ట్రాన్స్‌పోర్టు(బెస్ట్)పరిధిలో 50 కొత్త విద్యుత్ బస్సులు పంపిణీచేయగా వాటిని బస్ డిపోల్లోనే పార్కుచేసి ఉంచారు. అయితే వీటిలో కొన్నింటికి భద్రతా ప్రమాణాలు క్షీణించినట్లు తేలింది.

# అనాధ శిశువుల దత్తతు ప్రక్రియ చట్టబద్ధంగా నిర్వహించాలి

**బాపట్ల,జూన్04,ప్రభాతవార్త:** అనాధ శిశువుల దత్తతు ప్రక్రియ చట్టబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బాలల సంక్షేమ కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధ శిశువులను



దత్తతుతో తల్లిదండ్రుల వద్దకు చేర్చాలన్నారు.చెత్త కుండీల వద్ద, ఆస్పత్రులు, ఆర్టీసీ బస్టాండ్ ల వద్ద వదిలేసిన శిశువులు మహిళ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే శిశు గృహ, బాల సుధన్ లలో ఆశ్రయం పొందుతున్నారని చెప్పారు.అలాంటి శిశువులు, బాలలు ఏడుగురు ప్రభుత్వ సంరక్షణలోని శిశు గృహంలో ఉన్నారన్నారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత శిశు గృహకు వచ్చిన వారందరికీ తల్లిదండ్రుల ప్రేమ అందించాలన్నారు. మొదటి సారిగా బాపట్ల జిల్లా నుంచి దత్తతు ఇవ్వడానికి అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. కారా (చైల్డ్ సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అధారిటీ) ద్వారా ఈ ప్రక్రియ జరగనుందన్నారు. చట్ట ప్రకారం దత్తతు ప్రక్రియతోనే తల్లిదండ్రులను వారికి జత చేయగలమన్నారు.ప్రస్తుతం ఇరువురికి దత్తతు ఇవ్వడానికి జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు.కారా నిబంధనలను అనుసరించి బాలిక లావణ్య, బాలుడు కార్తీక్ లకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ దూడికి ఫోన్లోనే కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఇందుకు సంబంధించిన విచారణ నివేదికను వేగంగా పంపాలన్నారు.ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని రాధా మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, జువెనైల్ వెల్ఫేర్ కమిటీ ప్రొభిషన్ అధికారి సౌందర్య, ఐ సి పి ఎస్ డిసిపిఓ పురుషోత్తమరావు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రజా తీర్పు దినం గత పాలకుల వెన్నులో వణుకు పుట్టించిన దినం

**పిట్టలవానిపాలెం,జూన్04,ప్రభాతవార్త:** ఇది ప్రజా తీర్పు దినమని గత పాలకుల వెన్నులో వణుకు పుట్టించిన దినమని మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత దగ్గర నుంచి మహిళల వరకు,రైతుల దగ్గర నుంచి కుల వృత్తిదారుల వరకు ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల దగ్గర నుంచి 5 కోట్ల ప్రజల వరకు విధ్వంసకారుడు వద్దని విజనరీ లీడర్ నేతృత్వంలో కూటమి పరిపాలన కావాలంటూ, జనం తిరుగుబాటే ఈ ప్రజా తీర్పు దినం విధ్వంసకారుడి వెన్నులో వణుకు పుట్టించినరోజని ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చిన రోజుని వెన్నుపోటు దినం అని నామకరణం చేసారంటే వైసీపీ తన ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవటానికి సిద్ధంగా లేదు అని అర్థం అవుతుంది అని అన్నారు. ప్రజలు ప్రతి విషయం గమనిస్తున్నారు అని గుర్తుచేస్తున్నానన్నారు. మెగా డీఎస్సీ అని గత ప్రభుత్వం చెబితే ఆ మాటలు నమ్మి అప్పు చేసి మరీ డీఎస్సీ కోచింగ్ తీసుకున్నారు.ఉపాధ్యాయ అభ్యర్థులు కానీ ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ ను కూడా నియమించలేదన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా యువతను మోసం చేశారన్నారు. అందుకే ఆ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేస్తూ రాష్ట్ర యువత ఇచ్చిన ప్రజాతీర్పు దినం నేడు అని అన్నారు. క్రిందటి ఏడాది ఇదే రోజు(జూన్ 4వ తేదీ)న 2024 ఏపీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూటమిని గెలిపించి,చంద్రబాబు సారథ్యం తమకు కావాలని చెప్పిన ప్రజలకు తెలుగుదేశం పార్టీ తరుపున ధన్యవాదాలు తెలియజేశారు. తమకు, తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటూ ఏపీ రాష్ట్ర ప్రజలు కూటమిని గెలిపించుకున్న రోజు ఇది అని ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి, అధికారం రాగానే వారిని ఘోరంగా మోసం చేసిన వారిని ప్రజలు తమ ఓటుతో తరిమికొట్టిన రోజు. తమపై అపారమైన నమ్మకంతో చారిత్రాత్మక విజయాన్ని అందించిన ప్రజలకు మరొక్కసారి ధన్యవాదాలు తెలుపుతోంది తెలుగుదేశం పార్టీ. ప్రజలకు గత ప్రభుత్వం వెన్ను పోటు పొడిచారు కాబట్టే మేము కూటమి ని గెలిపించి, చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చేసుకున్నామన్నారు.మళ్ళీ కూడా చంద్రబాబునే గెలిపిస్తామని బాపట్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపే నాయకుడు,పసుపు జెండాను తన భుజస్కాందాలపై మోస్తూ ,ప్రజా సేవే తన ఏకైక జీవిత లక్ష్యమని బహిరంగంగా ప్రకటించిన నిశ్వార్ధ ప్రజా సేవకుడు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ కు ప్రజా తీర్పుదినం శుభాకాంక్షలు,అభినందనలు తెలిపారు.

# మోసపూరితమైన హామీలతో వెన్నుపోటు పొడిచి నేటికీ ఏడాది


**బాపట్ల,జూన్04,ప్రభాతవార్త:** ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి వారిని వెన్నుపోటు పొడిచి నేటికీ ఏడాది అవుతుందని వైసిపి బాపట్ల నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ డిప్యూటీ స్పీకర్, పీఏసీ సభ్యులు కోన రఘుపతి ఆరోపించారు. వెన్నుపోటు దినం సందర్భంగా బుధవారం బాపట్ల లో భారీ



ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమలు చేయడం సాధ్యం కానీ హామీలు ఇచ్చి అన్ని వర్గాల వారిని మోసం చేసిన చరిత్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడదన్నారు.14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తికి ఈ హామీలు అమలు చేయగలమా అని కనీస ఆలోచన లేకుండా ప్రజలను మోసం చేయటానికి, గద్దెని ఎక్కటానికి హామీలు ఇచ్చి ఆశపెట్టి, భ్రమ పెట్టి, మభ్యపెట్టి, నిట్ట నిలువునా మోసం చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ప్రతి నియోజకవర్గంలో వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తాము ఈ నిరసనకు పిలుపునిచ్చామన్నారు. వైసీపీ పార్టీ కి పోరాటాలు కొత్తేమి కాదన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒక పెద్ద పోరాట యోధుడని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పోరాటాలు చేయడానికి, ప్రజల తరఫున నిలదీయటానికి తామెప్పుడూ ముందుంటామన్నారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్దమొత్తంలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అపార్ ఐడీల పై అవగాహన సదస్సు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూన్ 4,ప్రభాతవార్త :** యూజిసి ఆదేశాలతో ఏపి ఉన్నత విద్యామండలి అపార్ ఐడిలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.డైక్మన్ సెమినార్హాల్లో జరిగిన ఈ అవగాహన సదస్సు నాగార్జున యూనివర్సిటీ తాత్కాలిక ఓఎస్డి ఆచార్య ఆర్వివిఎస్ఎస్




రవికుమార్ ఐడిలపై అవగాహన కల్పించారు.ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ ఎకౌంట్ రిజిస్ట్రీ (అపార్)లో ప్రతి కళాశాల విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లను నేషనల్ అకడమిక్ డిపాజిటరీ (ఎన్ఏడి)లో అప్లోడ్ చేయాల్సిన అవశ్యకత ఉందని ఆయన వివరించారు.తద్వారా డిజిటల్ యుగంలో విద్యార్థి ఇబ్బందులు పడకుండా ఉంటారని సూచించారు.ఈ సదస్సులో ఆచార్య నాగార్జున యూనివర్సిటీతో పాటు కృష్ణ యూనివర్సిటీ,ఆర్జియు కెటి,ఆంధ్ర కేసరి యూనివర్సిటీ తదితర విశ్వవిద్యాలయాల నుంచి అధికారులు నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# లారీ ఢీకొని ఒకరు దుర్మరణం

**రొంపిచర్ల, జూన్ 4 ప్రభాతవార్త :** ఆగివున్న ఆర్టీసీ లగ్జరీ బస్సును కంటైనర్ లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందిన సంఘటన బుధవారం స్థానిక విద్యుత్ సబ్స్టేషన్ హైవేపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఒంగోలు సమీపంలో గల కందుకూరు వైపుకు ఆర్టీసీ లగ్జరీ బస్సు వెళ్తుంది. స్థానిక విద్యుత్ సబ్స్టేషన్ సమీపంలోకి రాగానే గ్రామానికి చెందిన కొంత మంది ప్రయాణికుల కోసం బస్సును నిలుపగా ప్రయాణికులు దిగి వెళ్ళిపోయారు. ఈ క్రమంలో వెనుక వైపు నుండి వేగంగా వసు_్తన్న కంటైనర్ లారీ అదుపుతప్పి ఆగి



వున్న బస్సును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుకభాగం పూర్తిగా దెబ్బతింది. హైవే రోడ్డుపై ఒంగోలు వైపుకు వెళ్తున్న మరొక ఆర్టీసీ లగ్జరీ బస్సు అక్కడ ఆగి వున్న బస్సును ఆపి అందులో నుండి ప్రయాణికులను ఈ బస్సులోకి ఎక్కిస్తున్నారు. కంటైనర్ లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతినడంతో రోడ్డుపై ఆగి ఉంది. ఈ క్రమంలో హైవే రోడ్డుపై వేగంగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి అక్కడ ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొనడంతో బస్సు నుండి దిగి మరొక బస్సులోకి ఎక్కడానికి వెళ్తున్న బెల్లంకొండ మాధవరావు (40) ను కంటైనర్ లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. కాగా మృతుడు ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గ పరిధిలోని గుడ్లూరు మండలం మిట్టపాలెం గ్రామానికి చెందినవారిగా పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని నరసరావుపేట రూరల్ సి.ఐ. రామకృష్ణ, ఎస్.ఐ. సి.హెచ్.మణికృష్ణలు పరిశీలించారు. రోడ్డు ప్రమాదం జరిగి ఇరుక్కొని ఉన్న కంటైనర్, బస్సులను క్రేన్ సహాయంతో బయటకు తీయించారు. ప్రమాదానికి కారణమైన వాహనాలను స్టేషన్కు తరలించారు. కాగా మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. మణికృష్ణ తెలిపారు.

# చిత్తూరు జట్టుపై ఘనవిజయం సాధించిన కడప జిల్లా జట్టు

**గుంటూరు క్రైమ్,జూన్ 4,ప్రభాతవార్త :** జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జేసాప్) ఆధ్వర యంలో రాష్ట్రస్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నమెంట్ను గత మూడు రోజులుగా గుంటూరు నగరంలోని పోలీస్ పేరెడ్ గ్రౌండ్స్లో జెకేసి కాలేజ్ గ్రౌండ్లో జరుగుతుంది.ఈ సందర్భంగా బుధవారం సెమిఫైనల్,ఫైనల్ మ్యాచ్లు జరిగాయి.సెమీఫైనల్లో వెస్ట్ గోదావరి టీమ్ 16.0ఓవర్లలో 103 పరులుగు చేయగా వారిపై చిత్తూరు టీమ్ 13.4ఓవర్లలో 108పరుగులు చేసి విజయాన్ని పొందింది.రెండో సెమీ ఫైనల్లో కడప టీమ్ 12ఓవర్లకు 140పరుగులు చేయగా,శ్రీకాకుళం జట్టు 12ఓవర్లకు 102పరుగులు చేసి ఓటమి పాలైంది.ఫైనల్లో కడప,చిత్తూరు జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు 16ఓవర్లలో 169పరుగులు చేసింది.అనంతరం బ్యాటింగ్కు దిగిన చిత్తూరు టీమ్ 16 ఓవర్లకు 135పరుగులుచేసి ఓటమి పాలైంది.కడప టీమ్ టైటిల్ను గెలిచింది.విజేతలకు రన్నర్స్కు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ అహ మ్మద్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.రాష్ట్రవ్యాప్తంగా 13ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన జర్నలిస్టులు అందరితో కలసి ఇలా క్రికెట్ ను నిర్వహించుకోవడం చాలా సంతోషం గా ఉందన్నారు.గత ప్రభుత్వంలో జర్నలిస్టులపై విపరీతంగా దాడులు జరిగాయని,కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా సీఎం చం ద్రబాబు నాయుడు,డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముందుండి పరిష్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ,కిమ్స్ శిఖర హాస్పటల్ ఆర్థోపెడిక్ డాక్టర్స్ డాక్టర్ జయకిషన్,స్పోర్ట్స్ ఇంజ్యూరి స్పెషలిస్టు డాక్టర్ సాయికృష్ణ,భాష్యం కిరిటీ,జేసాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్,టోర్నమెంట్ నిర్వాహకులు పుల్లంశెట్టి ఉదయ్కుమార్,పెంజర్తి రాజేష్,ఇక్కుర్తి వేంకటేష్,బండారు రాము,జేసాప్ రాష్ట్ర,జిల్లా నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# పండిత పామరులకు ఆరాధ్యుడు ఎస్.పి.బాల సుబ్రమణ్యం

**గుంటూరు కల్చరల్,జూన్ 4,ప్రభాతవార్త :** గాయకులుగా ఎన్నో పాటలకు జవమూ జీవమూ అందించినట్లుగా విలక్షణత ప్రదర్శించి సంగీత దర్శకునిగా అపూర్వమైన ప్రయోగాలు చేసిన ఎస్పీ బాలసుబ్రమణ్యం పండిత పామరులందరికీ




ఆరాధ్యుడని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలోపాల్గొన్న సంగీత విద్వాంసులు,గాయనీ గాయకులు,కళాకారులు నివాళులర్పించారు.స్థానిక అరండల్పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రముఖ సినీ గాయకుడు ఎస్పి బాలసుబ్రమణ్యం జయంతి కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో సంగీత విద్వాంసులు గాయకులు వివిఎస్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎస్పి బాలసుబ్రమణ్యం పాడిననిన చలనచిత్ర గీతాలు పాడినవారు లేరని ఆయన పాడినర భక్తి గీతాలు పాడినవారు లేరని ఈ అరుదైన ఘనతనుసాధించిన అరుదైన మనీషి ఎస్పి బాల సుబ్రమణ్యం అన్నారు.అవగాహన సాంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ బిళ్ళా అశోక్ కుమార్ మాట్లాడుతూ ఆయన పాటల లాగానే మాటలు కూడా తీయనైనవని,మంచిని పెంచాలని తపించిన మానవతామూర్తి,ఎస్పీబి వంటి మహోన్నత వ్యక్తి తెలుగువారు కావడం మన అదృష్టమన్నారు.కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం గీతాలను రాజశేఖర్, సాయిబాబు,లక్ష్మీ తదితరులు ఆలాపించారు.

# పెదవడ్లపూడి గ్రామంలో ఎల్వోసీ చెక్కులు పంపిణీ

**మంగళగిరి, జూన్ 4, ప్రభాతవార్త :** మంగళగిరి మండలం, పెదవడ్లపూడి గ్రామానికి చెందిన సనం వెంకయ్య దంపతులు రోడ్డు ప్రమాదానికి గురికాగ వైద్యఖర్చుల కోసం సీఎం సహయనిధి నుంచి మంజూరైన ఎల్వోసీ చెక్కులను స్థానిక నాయకులు బుధవారం బాధితుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. సనం వెంకయ్యకు రూ. 1,50,000 లక్షలు, సనం రాజకుమారికి రూ. 1,25,000



లక్షల విలువైన ఎల్వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జువ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ బాధితులు మెరుగైన వైద్యం చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వం సహాయనిధి ద్వారా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, గుడిమెట్ల మరియదాస్,జాలాది సందీప్, శానం రఘు, గుడిమెట్ల ఎల్లయ్య, కోటేశ్వరరావు, దీపు, డికోల్లు పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా కూటిమి ప్రభుత్వ విజయోత్సవ వేడుకలు

**పొన్నూరు, జూన్ 4,ప్రభాతవార్త:** రాక్షసపాలన పోయి, రామరాజ్యం ఏర్పడి బుధవారానికి సంవత్సరం అయిందని టిడిపి నియోజకవర్గ మైనార్టీ నాయకుడు పఠాన్ ఫిరోజ్ఖాన్ అన్నారు. ప్రజాతీర్పు వెలువడి సంవత్సరం



అయిన సందర్భంగా విజయోత్సవ వేడుకలను టిడిపి శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ఖాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన, ఇవ్వని హామీలను ప్రాధాన్యతా క్రమంలో నెరవేరుస్తుందన్నారు. రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయినప్పటికీ విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పథకాలను అమలు చేస్తూ, అభివృద్ధిలో కూడా దూసుకుపోతున్నారన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. వైకాపా ఐదేళ్ళ పాలన అంతా విధ్వంసమయన్నారు. వైకాపా ప్రభుత్వ తప్పిదాలను గాడిలో పెట్టేందుకు చంద్రబాబునాయుడు విశ్వప్రయత్నం చేస్తున్నారన్నారు. వైకాపా చేసిన అప్పులకు వడ్డీలు కట్టేందుకే చాలా కష్టపడాల్సి వస్తుందన్నారు. టిడిపి శ్రేణులు తొలుత పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఐలాండ్ సెంటర్కు వచ్చి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి, మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ బాజిసాహెబ్, మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, చెన్నుపాటి భాస్కర్, లక్ష్మీనారాయణచౌదరి, చలమశెట్టి సీతారామయ్య, బొప్పన బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైంది!

## వెన్నుపోటు దినం పేరిట వైఎస్ఆర్సిపి నిరసన కార్యక్రమం

**మంగళగిరి జూన్ 4, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చటంలో విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి వెన్నుపోటుకు చంద్రబాబు తెర తీశారని అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోలో హామీలను తుంగలో తొక్కటమే కాకుండా




నియోజకవర్గ ఇంచార్జ్ దొంతి రెడ్డి వేమారెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలలో భాగంగా మంగళగిరిలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు సర్వీస్ రోడ్డు వెంబడి గల వైఎస్ఆర్సిపి నియోజకవర్గ కార్యాలయం నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా బస్టాండ్ సెంటర్ కు చేరుకున్నారు. బస్టాండ్ సెంటర్ లో దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ విగ్రహానికి, బాబు జగజ్జీవన్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ సెంటర్ నందు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తహసిల్దార్ కార్యాలయానికి చేరుకొని డిప్యూటీ తాసిల్దార్ అంకారావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దొంతి రెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడుకు వెన్నుపోటు పొడవటం వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. ఆనాడు సొంత మామ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావును వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను మోసం చేసి మరోసారి రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలను, సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయటం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని అన్నారు. పలువురు వైఎస్ఆర్సిపి కార్యకర్తలపై హత్యాయత్నానికి పాల్పడ్డారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఈ తరహా నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని భారీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ, ప్రజలకు జరిగిన అన్యాయాన్ని తెలియజేసేందుకు వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించాలని జగన్మోహన్ రెడ్డి నిర్ణయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పచ్చల రత్నకుమారి, ఈదులమూడి డేవిడ్ రాజు దామర్ల కుబేర స్వామి, మంగళగిరి పట్టణ రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ నాలి వెంకటకృష్ణ, తాడేపల్లి పట్టణ రూరల్ అధ్యక్షులు వేణుగోపాలస్వామి రెడ్డి, అమరా వెంకటస్వామి, నాగేశ్వరరావు, దుగ్గిరాల మండల అధ్యక్షులు తాడిబోయిన శివ, గోపయ్య నియోజకవర్గ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలు

**పిడుగురాళ్ల, జూన్ 4 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, 151 నుంచి 11 సీట్లకు వచ్చినా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని కూటమి నేతలు అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్రం విముక్తి పొందిన రోజుగా పేర్కొన్నారు. గత ప్రభుత్వం అక్రమాలు, దౌర్జన్యాలకు ప్రజలు విసిగిపోయి గత ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పారన్నారు. అయినప్పటికీ వైసీపీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో దూసుకుపోతుందన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్లు రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీనివాస్, మార్కెట్యార్డు చైర్మన్ తురకా వీరాస్వామి, పిల్లి చెన్నారావు, సయ్యద్ అమీర్ అలీ, షేక్ బాబావలి, పణితి రవికుమార్, కిరణ్కుమార్, జనసేన నేతలు కటకం అంకారావు, రమేష్బాబు, డాక్టర్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


**ముగ్గుల పోటీలు:** గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సారథ్యంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు ఆదేశాల మేరకు జనసేన మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్ ఆధ్వర్యాన పట్టణంలోని 28వ వార్డు శివాలయం వీధిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు అంకారావు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు అమీర్ అలీ, సీనియర్ నేత బాబావలి, జనసేన అధికార ప్రతినిధి అడపా వెంకట్, జిల్లా ప్రోగ్రాం కమిటి సభ్యుడు దూదేకుల సలీం, జనసేన మండల ఉపాధ్యక్షుడు బేతంచర్ల ప్రసాద్, బయ్యవరపు



రమేష్, వీర మహిళలు సింగంశెట్టి రమణ, కొత్త అరుణ, ప్రధాన కార్యదర్శి గుర్రం కోటేశ్వరరావు, నూతి సూరి, మల్లెల రామాంజి, తోట రామదాసు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నకరికండి శివనాయుడు, ముక్కంటి, కిరణ్, గుదే సతీష్, కొల్లి తిరుపతిరావు, ఫరీద్ మేస్త్రి, బీజేపీ నేతలు వడ్లమూడి వెంకయ్య, విజయ్కుమార్, నువ్వు అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

# మండల తెదేపా ఆధ్వర్యంలో సంబరాలు

**పెదకూరపాడు, జూన్ 4 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా పెదకూరపాడులో టిడిపి నేతలు సంబరాలు జరుపుకున్నారు. సంవత్సర కాలంలోనే మండలంలో ఎంతో అభివృద్ధి జరిగిందని పార్టీ మండల అధ్యక్షులు రమేష్ అన్నారు. వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధి పనులు కేవలం శంఖుస్థాపనలకే పరిమితం



అయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భాష్యం ఆంజనేయులు, గంగినేని లీలావతి, షేక్.ముంతాజ్, రామ్గోపాల్రావు, మక్కెన సాగర్, కల్పన, మండల టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణం,ఎర్రకట్ట రోడ్డు అభివృద్ధిపై కలెక్టర్కు వివరించిన కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,జూన్ 4,ప్రభాతవార్త:** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశాకు విజయవాడ నగరపాలక సంస్థ కమీషనర్ ధ్యానచంద్ర బీఆర్టీఎస్ రోడ్ నిర్మాణం,ఎర్రకట్ట రోడ్ విస్తరణ పనులపై ప్రస్తుత స్థితిగతుల వివరాలను వివరించారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆయన ఆయా ప్రాంతాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ గుణదల నుండి సత్యన్నారాయపుణపురం వరకు ఉన్న బీఆర్టీఎస్ రోడ్డును రైల్వేస్టేషన్ వరకు పొడిగించేందుకు అవసరమైన చర్యలపై అధికారులతో ఆయన సమీక్షను నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న రోడ్డుపై స్పష్టత,రైల్వే అధికారుల భాగస్వామ్యంతో చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర నివేదికను సిద ం చేయాలని ఆదేశించారు. రైల్వే సమన్వయంతో ఈ రోడ్డును పూర్తి చేస్తే,రైల్వే స్టేషన్ వరకు మెరుగైన రహదారి కనెక్షన్ లభిస్తుందన్నారు. తదుపరి ఎర్రకట్ట వద్ద రానున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు,రోడ్ డెవలప్మెంట్ ప్లాన్,విస్తీర్ణం పనుల్లో ప్రభావితమవుతున్న ఇళ్ళ వివరాలపై అధికారులు సమగ్ర నివేదికను ఇవ్వాలని కమీషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్రెడ్డి,ఛీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్,ఇన్చార్జి చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల కృష్ణ నాయక్,అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బాబూ శ్రీనివాస్,డాక్టర్ అన్నపూర్ణ,డిప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్,అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్బాబు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సురేఖ,శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

### మహిళల హాకీ టోర్నీలో..

# భారత్ విక్టరీ

## ఉరుగ్వేపై 1-3తో గెలుపు



**న్యూఢిల్లీ:** జూనియర్ మహిళల నాలుగు దేశాల హాకీ టోర్నమెంట్‌లో భారత్ జట్టు ఘన విజయం సాధించింది. తమ ఐదవ మ్యాచ్‌లో 2-2తో డ్రాగా ముగిసిన తర్వాత, నిర్ణీత సమయంలో ఉరుగ్వేపై షూటౌట్‌లో భారత్ 3-1 తేడాతో విజయం సాధించింది. అర్జెంటీనాలోని రోసారియోలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో వైస్ కెప్టెన్ హినా (10వ నిముషం) మరియు లాల్రిన్‌పుయి (24వ నిముషం) మ్యాచ్ ప్రారంభంలోనే భారత్‌ను నియంత్రణలోకి తెచ్చారు, గీతా, కనికా, లాల్తాంట్లుగి షూటౌట్‌లో తమ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విజయాన్ని ఖాయం చేశారు. 10వ నిమిషంలో హినా గోల్ చేయడంతో భారత్ బలమైన ఆరంభాన్ని అందించింది. ఆ తర్వాత 24వ నిమిషంలో లాల్రిన్‌పుయి ఆధిక్యాన్ని రెట్టింపు చేసి హాఫ్ టైం ముగిసే సమయానికి భారతదేశానికి 2-0 ఆధిక్యాన్ని అందించింది. అయితే, చివరి క్వార్టర్‌లో ఉరుగ్వే తిరిగి పుంజుకుంది. 54వ నిమిషంలో ఇనెస్ డి పొసాడాస్ ఒక గోల్ కొట్టింది. మూడు నిమిషాల తర్వాత మిలాగ్రోస్ సీగల్ గోల్ చేసి స్కోరును 22తో సమం చేసింది. షూటౌట్‌లో, గీత, కనికా మరియు లాల్తాంట్లుగి వరుసగా మూడు గోల్స్ చేయడంతో భారత్ విజయపథకంలో నడిచింది. ఉరుగ్వే కేవలం ఒక గోల్ గోల్స్‌కు పరిమితం అయింది. ఇక ఆదివారం జరిగే మ్యాచ్‌లో భారత్ మహిళా జట్టు ఆతిథ్య అర్జెంటీనాతో తలపడనుంది.

# సెమీఫైనల్స్‌కు స్వియాటెక్

## ఎలినాపై 6-1, 7-5 తేడాతో గెలుపు




**న్యూఢిల్లీ:** ప్రపంచ ఐదవ నంబర్ ర్యాంకర్, పోలెండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్ వరుసగా నాలుగోసారి రోలాండ్ గారోస్ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. 2020 తర్వాత తొలిసారి క్లే టైటిల్ లేకుండా రోలాండ్ గారోస్‌లోకి అడుగుపెట్టినప్పటికీ స్వియాటెక్ ఇప్పుడు ఐదవ ఫ్రెంచ్ ఓపెన్ కిరీటానికి రెండు విజయాల దూరంలో ఉంది. దీంతో పారిస్‌లో తన విజయ పరంపరను 26వ మ్యాచ్‌కు విస్తరించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఉక్రెయిన్‌కు చెందిన ఎలినా స్వీటోలినాను 6-1, 7-5 తేడాతో క్వార్టర్ ఫైనల్ పోరులో అద్భుతమైన ఆటతో ఓడించింది. ఈ విజయంతో ఫ్రెంచ్ ఓపెన్‌లో వరుసగా 25 కంటే ఎక్కువ సింగిల్స్ విజయాలు సాధించిన ఐదవ క్రీడాకారిణిగా స్వియాటెక్ నిలిచింది. మొదటి సెట్‌లో స్వీటోలినాకు 3 బ్రేక్ పాయింట్లు ఉన్నప్పటికీ స్వియాటెక్ వెనక్కి తగ్గింది. రెండో సెట్‌లో మాత్రం పూర్తిగా భిన్నమైన పోరాటం చేసింది. ఈ సీజన్‌లో 16 విజయాలతో రూయెన్, మాడ్రిడ్, రోమ్‌లలో క్లే కోర్ట్ మ్యాచ్ విన్ లీడర్‌గా మ్యాచ్‌లోకి ప్రవేశించిన ఉక్రెనియన్ స్వీటోలినా స్వియాటెక్‌ను చివరి వరకూ తీసుకెళ్లింది. ఆమె 3-1తో ఆధిక్యంలో కొనసాగింది. రెండవ సెట్‌ను 5-4తో కైవసం చేసుకుని రెండు పాయింట్లు సాధించింది. కానీ గేర్ మార్చిన స్వియాటెక్ రెండవ సర్వ్‌ను క్రాస్‌కోర్ట్ ఫోర్ హ్యాండ్ రిటర్న్‌తో 6-5తో బ్రేక్ చేసింది. కొన్ని క్షణాల తర్వాత మ్యాచ్ తన రాకెట్‌పై ఉండగా, ఆమె వరుసగా రెండు ఏస్‌లను సంధించి మ్యాచ్‌లో రెండవ, మూడవ టర్న్‌లో 1 గంట 41 నిముషాల్లో పోటీని ముగించింది. ఆమె బలీయమైన ప్రత్యర్థిని ఎదుర్కోనుంది. ప్రస్తుత ప్రపంచ నెంబర్ 1 అరినా సబలెంకాతో స్వియాటెక్ తలపడనుంది.

# ఇండోనేసియా ఓపెన్‌లో సతీష్-ఆద్య జోడీపై భారత్ ఆశలు

## రోహన్-రుత్విక, ఆశిత్-అమృత, కపిల-తనీషా ఓటమి

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సతీష్ కుమార్ కరుణాకరన్-ఆద్య వరియత్ జోడీ మినహా మిగిలిన భారత్ జట్లన్నీ నిష్క్రమించాయి. దీంతో మిక్స్‌డ్ డబుల్స్‌లో కరుణాకరన్-వరియత్ జోడీ భారత్ ఆశలను సజీవంగా ఉంచింది. బుధవారం జరిగిన ఈ ఈవెంట్‌లో ఇతర భారతీయ జంటలు తదుపరి రౌండ్‌కు చేరుకోలేకపోయారు. ఇండోనేషియా ఓపెన్




సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ జంట సతీష్ కుమార్ కరుణాకరన్-ఆద్య వరియత్ మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది, అయితే ప్రారంభ ఓటములతో డ్రాలో ఉన్న ఇతర భారత జంటలన్నీ నిష్క్రమించాయి. 45 నిమిషాల పాటు జరిగిన కఠినమైన తొలి రౌండ్ పోటీలో సతీష్ మరియు వరియత్ 15-21, 21-16, 21-17 తేడాతో చైనీస్ తైపీకి చెందిన యే హాంగ్‌వీ మరియు నికోల్ గొంజాలెస్ చాన్‌ను ఓడించారు. కానీ ఈ ఈవెంట్‌లో ఇతర భారత జంటలు తదుపరి రౌండ్‌కు చేరుకోకపోయాయి. అదేవిధంగా మరో భారత్ ద్వయం రోహన్ కపూర్-గద్దె రుత్విక శివాని 14-21, 9-21 తేడాతో జపాన్ జోడీ యుచి షిమోగామి-సయాకా హోబారా చేతిలో ఓడిపోయారు. ఇక డెన్మార్క్‌కు చెందిన మ్యాడ్స్ వెస్టర్‌గార్డ్-క్రిస్టీన్ బుష్‌ల చేతిలో 15-21, 9-21తో భారత్ జంట ఆశిత్ సూర్య, అమృత ప్రముతేష్‌లు ఓడిపోయారు. అలాగే ఇంకో భారత్ ద్వయం ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో కూడా అదే విధిని ఎదుర్కోవలసి వచ్చింది, వారు మలేషియాకు చెందిన రెండవ సీడ్ టాంగ్ జీ చెన్-ఈ వీ తోహ్ చేతిలో 11-21, 21-16, 14-21 తేడాతో ఓడిపోయారు.



# ఐపిఎల్ హీరోస్

## ఆరెంజ్ క్యాప్ విజేతగా సుదర్శన్

## పర్పుల్ క్యాప్ దక్కించుకున్న ప్రసిద్ధ్

### చెన్నై సూపర్ కింగ్స్‌కు ఫెయిర్ ప్లే అవార్డు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్-2025 సీజన్ అద్భుతంగా ముగిసింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఈ సీజన్‌లో వ్యక్తిగత ప్రదర్శనలతో మెరిసిన పలువురు ఆటగాళ్లకు, అలాగే కొన్ని జట్లకు అవార్డులు లభించాయి. అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్, అలాగే అత్యంత విలువైన ఆటగాడు, ఎమర్జింగ్ ప్లేయర్ వంటి వివిధ అవార్డులను పలువురు ఆటగాళ్లు, టీమ్‌లు దక్కించుకున్నాయి. గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన సాయి సుదర్శన్, ఈ సీజన్‌లో తొలిసారి ఆరెంజ్ క్యాప్ విజేతగా నిలిచాడు. అతను 15 ఇన్నింగ్స్‌లలో 759 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. గుజరాత్ టైటాన్స్ ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ తొలిసారిగా పర్పుల్ క్యాప్ విజేత అయ్యాడు. ఈ సీజన్ లో అత్యధికంగా 25 వికెట్లు పడగొట్టాడు. గుజరాత్ టైటాన్స్‌కు చెందిన సాయి సుదర్శన్ ఎమర్జింగ్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు. ఈ సీజన్‌లో అతను అత్యధిక పరుగులు సాధించాడు. అత్యధిక ఫోర్లు కొట్టాడు. చెన్నై సూపర్ కింగ్స్ ఫెయిర్ ప్లే అవార్డును గెలుచుకుంది. ఈ సీజన్‌లో ఈ జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచినప్పటికీ, ఫెయిర్‌గా ఆడటంలో ముందంజలో ఉంది. ముంబై ఇండియన్స్‌కు చెందిన సూర్యకుమార్ యాదవ్ అత్యంత విలువైన ఆటగాడిగా నిలిచాడు.
అతను 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేశాడు. అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలో రెండవ స్థానంలో ఉన్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ సూర్యవంశీ సూపర్ స్ట్రైకర్‌గా ఎంపికై అవార్డును గెలుచుకున్నాడు ఈ బ్యాట్స్‌మన్ 206.55 స్ట్రైక్ రేట్‌తో 252 పరుగులు చేశాడు. కేవలం 14 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన వైభవ్, గుజరాత్ టైటాన్స్‌పై కేవలం 35 బంతుల్లో సెంచరీ చేసి చరిత్ర సృష్టించాడు. అతని స్ట్రైక్ రేటు 207గా నమోదైంది. ఈ అవార్డుతో పాటు అతనికి ఒక కారు కూడా బహుమతిగా లభించింది. గుజరాత్ టైటాన్స్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ అత్యధిక డాట్ బాల్స్ వేసిన ఘనతను పొందాడు. ఈ సీజన్‌లో అతను 15 మ్యాచ్‌ల్లో 151 డాట్ బాల్స్ వేశాడు. లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడిన నికోలస్ పూరన్, అత్యధిక సిక్సర్లు కొట్టినందుకు అవార్డును అందుకున్నాడు. ఈ సీజన్‌లో అతను 40 సిక్సర్లు కొట్టాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చెందిన కమిందు మెండిస్ అత్యుత్తమ క్యాచ్‌గా అవార్డును అందుకున్నాడు.అతనుచెన్నై సూపర్ కింగ్స్‌కు చెందిన డెవాల్డ్ బ్రెవిస్ క్యాచ్‌ను ఒంటి చేత్తో పట్టుకున్నాడు. ఈ ఐపీఎల్-2025లో అత్యధిక ఫోర్లు బాదిన ఆటగాడిగా సాయి సుదర్శన్ అవార్డును అందుకున్నాడు. ఈ సీజన్‌లో అతను 88ఫోర్లు బాదాడు. ఈసీజన్‌లో అత్యధిక ఫాంటసీ పాయింట్లు సేకరించినందుకు అవార్డును కూడా అందుకున్నాడు.

# నార్వే చెస్‌లో గుకేష్ ఓటమి

## మహిళల్లో ఆధిక్యంలో హంపి



**న్యూఢిల్లీ:** నార్వే చెస్-2025 టోర్నమెంట్‌లో అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ హికారు నకమురా ప్రపంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ క్లాసికల్ విజయాల పరంపరను బద్దలు కొట్టాడు. మహిళల విభాగంలో కోనేరు హంపి ఏకైక ఆధిక్యంలో ఉంది. నార్వేలో బుధవారం జరిగిన టోర్నీలో గుకేష్‌ను ఓడించి 3 పాయింట్లు సాధించాడు. మాజీ నార్వే చెస్ ఛాంపియన్ నకమురా తన ప్రత్యర్థిపై విజయాన్ని సాధించాడు. దీంతో భారత ఆటగాడి చేతిలో రౌండ్ 3లో ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నాడు. టోర్నమెంట్‌లో నిరాశాజనకమైన ప్రారంభం తర్వాత తిరిగి తన ఉత్సాహాన్ని పొందిన గుకేష్, వరుసగా 6 మరియు 7 రౌండ్లలో ప్రపంచ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సెన్ మరియు ఎరిగైసిలను ఓడించాడు. అయితే ఈ సారి మాత్రం ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉండగా, గుకేష్ 11.5 పాయింట్లతో నకమురాతో మూడో స్థానంలో నిలిచాడు. అమెరికన్ గ్రాండ్ మాస్టర్ కరువానా, ఎరిగైసి చేతిలో ఓడిపోయినప్పటికీ, 12.5 పాయింట్లతో ఆధిక్యంలో ఉన్నాడు. ఆర్మగెడాన్ టైబ్రేక్‌లో చైనాకు చెందిన వీయి చేతిలో ఓడిపోయిన కార్ల్‌సెన్ 12 పాయింట్లతో రెండవ స్థానంలో ఉండగా, ఎరిగైసి 10.5 పాయింట్లతో ఐదవ స్థానంలో ఉన్నాడు. మరోవక్క కోనేరు హంపి రెండు రౌండ్లు మిగిలి ఉండగానే ఆధిక్యాన్ని పొందింది. స్పానిష్ ఇంటర్నేషనల్ మాస్టర్ సారా ఖాడెమ్‌ను ఓడించింది. దీంతో హంపి 13.5 పాయింట్లతో, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ చైనాకు చెందిన జు వెంజున్ కంటే ఒక పాయింట్ ముందంజలో ఉంది. ఇక జు యొక్క ఆరు మ్యాచ్‌ల విజయాల పరంపరను ఆర్మగెడాన్ టైబ్రేక్‌లో 9.5 పాయింట్లతో ఐదవ స్థానంలో ఉన్న ఆర్. వైశాలి బద్దలు కొట్టింది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**వాణిజ్యం**



**ముంబై, జూన్ 4:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాల మధ్య ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు రోజంతా లాభాల్లోనే ట్రేడయ్యాయి. దీంతో వరుసగా మూడురోజులు నష్టాల్లో ముగి సిన సూచీలకు బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 80,777.65 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచి ఇంట్రాడేలో 80,705.18 81,087.29 మధ్య కదలాడింది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లతో రాణించిన సూచి చివరకు 260 పాయింట్ల లాభంతో 80,998 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,644.25 వద్ద గరిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 77 పాయింట్ల లాభంతో 24,620.20 వద్ద ముగిసింది. ఎటర్నల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. బజాజ్‌ఫిన్ సర్వ్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, టైటాన్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.93 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 3,387 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ప్రధాన బోర్డు నుంచి వచ్చిన స్కోడా ట్యూబ్స్ ఐపీఓకు షేర్లు నేడు స్టాక్ మార్కెట్లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర 140 కాగా ఆ ధర వద్దే షేర్లు లిస్ట్ అయ్యాయి. ఇంట్రాడేలో 5 శాతం షేర్లు రాణించాయి. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్‌ఎస్‌ఈలో కంపెనీషేర్లు 5శాతం లాభంతో రూ.147 వద్ద ముగిశాయి. ఎస్‌ఎంఈ విభాగం నుంచి వచ్చిన నెప్ట్యూన్ పెట్రో కెమికల్ షేర్లు దలాల్‌స్ట్రీట్‌లో లిస్ట్అయ్యాయి. ఎస్ఎస్ఈలో 9 శాతం ప్రీమియంతో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఎంట్రీ ఇచ్చా యి. ఇష్యూ ధర రూ.122 కాగా ఎన్ఎస్ఈలో రూ.132.75 వద్దట్రేడింగ్ మొదలు పెట్టాయి. ఇంట్రాడేలో రాణించిన షేర్లు మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈ లో 14శాతం లాభం తో రూ.139 వద్ద ముగి శాయి.

## సరిహద్దు దేశాలకు ఎఫ్‌డిఐలో ఎలాంటి మార్పుల్లేవ్!

**న్యూఢిల్లీ, జూన్ 4:** భారత్‌తో సరిహద్దులు పంచుకుంటున్న దేశాలకు సంబంధించి విదేశీ ప్రత్యేక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టతనిచ్చింది. ఈ పెట్టుబడులకు సంబంధించి ప్రస్తుతం అనుసరిస్తున్న విధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి. చైనా నుంచి ఎఫ్‌డీఐ దరఖాస్తులను ఎలాంటి పరిశీలన లేకుండానే అనుమతిస్తున్నారంటూ వార్తలు వస్తోన్న వేళ కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఈ మేరకు స్పందించాయి. భారత్‌తో భూ సరిహద్దు పంచుకుంటున్న దేశాల నుంచి పెట్టుబడులకు సంబంధించి 2020లో కేంద్రం ఓ నోట్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం.. ఆయా దేశాల పెట్టుబడిదారులు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకున్న తర్వాతే పెట్టుబడులు పెట్టేలా షరతు విధించింది. భారత్‌తో భూ సరిహద్దు పంచుకుంటున్న చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, ఆఫ్ఘనిస్థాన్‌లకు సమానంగా వర్తిస్తుందని నోట్‌లో పేర్కొంది. ఈ దేశాల నుంచి వచ్చే అన్ని ఎఫ్‌డీఐ ప్రతిపాదనల పరిశీలన, అనుమతుల మంజూరు అంతా ఒకే




ప్రక్రియలో జరుగుతుందని తెలిపింది. ఈ నోట్ విడుదల చేసినప్పటి నుంచి ఇప్పటివరకు ఎఫ్‌డీఐలో ఎలాంటి సవరణలు చేయలేదు. ప్రస్తుతం పెట్టుబడుల విషయంలో ఎలాంటి మార్పుల్లేవని సమాచారం. విదేశీ పెట్టుబడిదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు హోం కార్యదర్శి నేతృత్వంలోని మంత్రిత్వ కమిటీ బాధ్యత వహిస్తోంది.

## వికసిత్ భారత్‌కు 9శాతం వృద్ధి తప్పదు: రఘురామ్ రాజన్

**ముంబై, జూన్ 4:** 2047 నాటికి భారత్ వికసిత్ దేశంగా మారాలనుకుంటే 8, 8.5నుంచి 9శాతం వృద్ధి అవసరమని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ ఆర్థిక వేత్త రఘురామ్ రాజన్ తెలిపారు. అందుకు కారణంగా మనది ఇప్పటికీ పేద దేశమేనని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, అనేక అంశాల కారణంగా ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశినచతిని ఎదుర్కొంటోంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్ బలమైన జిడిపి గణాంకాలను నమోదు చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం నాలుగవ త్రైమాసికంలో భారత జిడిపి 7.4శాతంగా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి 6.5శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ గణాంకాలు అనేక దేశాల ఆర్థికవ్యవస్థల కంటే చాలా ఎక్కువ. ప్రస్తుత ఈ వృద్ధి చాలా ముఖ్యమైనదే, కానీ ఎన్నికల వల్ల ప్రభుత్వ వ్యయానికి అవాంతరాలు ఎదురవడం, ఇతర గణాంకాల్లో ఒడుదుడుకులు ఉండడం వల్ల ఇది సరిపోదు. ఇంకా చాలా సాధించాల్సి ఉంది. పెట్టుబడులు వచ్చేందుకు మరిన్ని చర్యలు, వినియోగం పెంచే నిర్ణయాలు, దేశీయ-విదేశీ వ్యాపారాలు భారత్‌వైపు చూసే ధోరణిని కొనసాగించే ప్రయత్నాలు, అధిక వృద్ధిని కొనసాగించే వ్యూహం అవసరమని ఆయన వెల్లడించారు. భారత జిడిపి జపాన్‌ను దాటి నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడంపై స్పందించిన రఘురామ్ రాజన్, ఈ మైలురాయిని అందుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. కానీ మరింత స్థిరమైన లక్ష్యాలు ఏర్పరచుకోవాలని అన్నారు. ఇతర దేశాలను దాటి అతిపెద్ద జిడిపి దేశంగా మారుతుండడం గర్వంగా ఉంది. రాబోయే సంవత్సరాలలో జర్మనీని కూడా దాటగలం. బహుశా మరో 1-2 యేళ్లలో ఇది సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో జిడిపి ర్యాంకింగ్‌లను నిజమైన ఆర్థిక పురోగతిగా భావించవద్దని ఆయన హెచ్చరించారు. మారకపు రేటు ఈ హెచ్చుతగ్గులను ప్రభావితం చేస్తాయి. జపనీస్ యెన్ బలంగా ఉంది. ఈ అంశాన్ని తేలిగ్గా తీసుకోవడానికి లేదు. మనం ఈదేశాల కంటే చాలా పేదవాళ్లం. సగటు పౌరుడికి మనం ఎంత ధనవంతులు అనేది ముఖ్యం. జిడిపి గణాంకాల హెచ్చు తగ్గులు కాదు. ఎందు కంటే మనం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం. కాబట్టి సామాన్య పౌరుడు పేదవాడిగా ఉన్నా సరే, మొత్తం జిడిపి ఎక్కువగా ఉంటుంది.



## మైక్రోసాఫ్ట్‌ను దాటేసిన ఎన్విడియా..

**వాషింగ్టన్, జూన్ 4:** ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఎన్విడియా అవత రించింది. మెరుగైన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో షేర్లు రాణిస్తున్నాయి. మంగళవారం ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు 3.4 శాతం లాభపడ్డాయి. దీంతో కం పెనీ మార్కెట్ విలువ 3.45 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.296.22 లక్షల కోట్లు) చేరింది. ఇప్పటివరకు ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీల్లో మొదటి స్థానం లో ఉన్న మైక్రోసాఫ్ట్ ప్రస్తుతం రెండో స్థానంలో నిలిచింది. కృత్రిమ మేధ రంగంలో బలమైన స్థానాన్ని కొనసాగిస్తూ మార్కెట్ విలువను గణనీయంగా పెంచుకోవడంతో ఎన్విడియా ఈ ఘనత సొంతం చేసుకుంది.ఎన్విడియా ఏప్రిల్‌తో ముగిసిన తొలి త్రైమాసిక ఫలితాల్నిప్రకటించింది. కంపెనీ ఆదాయం 44.1 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ.3.78 లక్షల కోట్లుగా) నమోదైంది. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే 12 శాతం, గతేడాది ఇదే సమయంలో నమోదైన ఆదాయంతో పోలిస్తే 69 శాతం వృద్ధి చెందింది. వాణిజ్య ఆంక్షలు, కఠిన నిబంధ నలు ఉన్నప్పటికీ ఎన్విడియా మెరుగైన వృద్ధిని నమోదు చేసింది. కేవలం చిప్‌ల తయారీకే పరిమితం కాకుండా ఏఐకి సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తోంది. రానున్న నాలు గేళ్లలో సుమారు అర ట్రిలియన్ డాలర్ల విలువైన ఏఐ సూపర్ కంప్యూటర్లు, డేటా సెంటర్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14